

ఆంధ్రపత్రిక
సంపుటి ౪౧ సంచిక ౨౭
4 అణాలు
2-3-55
ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



సంధ్యాయానం



త్వరలో విడుదల
వాహినీ వారి
బంగారు పాప
నిర్మాత - దర్శకుడు -
బి. యన్. రెడ్డి
యస్. వి. రంగారావు - జగ్గయ్య
రామశర్మ - కృష్ణకుమారి
జమున నటించినది.

సంవత్సర చందా
రూ. 12-0-0
విడిపత్రిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

సంపుటము 48
సంచిక 26
2-3-55

Founder : K. NAGESWARA RAO

జయ ఫాల్గుణ శుద్ధ నవమి బుధవారం

కాంబోడియా కబుర్లు : 3

చదువు - సంధ్యా

అసలు మొదట్లో ఇండో చైనా అంతకీ హానోయ్ సంస్కృతీకేంద్రం. ఇప్పటికీ హానోయ్‌లో విద్యాశాలలు కనిపించేఆస్కారం ఆధిక్యతా కాంబోడియాలో కనిపించదంటే అతిశయోక్తి కాదు. నాంపెన్‌లో విద్యార్థులసంఖ్యకన్న విద్యాలయాలు ఎక్కువ.

విషయానుక్రమణిక

ముఖచిత్రం : అశోక్ కుమార్ ప్రొడక్షన్స్‌వారి "సమాజ్"లో శశికళ.

మిడిల్ స్కూలు అంటే *III Form Standrad* వరకూ, విద్యాబోధ చేసేస్కూళ్లు-భారీఅయినవి - ఆరేడు ఉన్నాయి; కాని ఆ పైనుంచీ గ్రాడ్యుయేషను క్లాసువరకూ విద్యగరపే కాలేజీ ఒక్కటే "లిసే సిస్సోవాత్" (*Lyce'e Sissowath*) ఇందులో *III Form* నుంచీ బియే వరకూ చెబుతారు. కాంబోడియా అంతటికీ యిదొక్కటే కాలేజీ కావడంవల్ల ఉన్నతవిద్య అభ్యసించదలుచుకున్న ప్రతివాడూ యిక్కడికి రావలసిందే. కాంబోడియన్‌భాషలో

డిగ్రీలు విద్యామంత్రిత్వశాఖ (సైగాను) నుంచియిస్తారు. మిగతావి (ఫ్రెంచి) పారిస్ నుంచి ఆచార్యులువొచ్చి పరీక్ష చేసి యిస్తారు. ఈ కాలేజీ పారిస్ యూనివర్సిటీకి ఎఫీలియేటు అయిఉంది.

చదువుల పద్ధతి - మెట్రిక్యులేషనూ, గ్రాడ్యుయేషనుంచి - పాశ్చాత్యపద్ధతుల్లో నడుస్తుంది. బౌద్ధమతానికి సంబంధించినంత వరకూమాత్రం ప్రాచీన హిందూదేశ చరిత్ర చెబుతారు. ఏక్లాసుకీ జీతాలు కట్టనక్కర్లేదు. అసలు చేర్చుకునేటప్పుడే పరీక్షచేసి తగినవాళ్ళనే చేర్చుకుంటారు. ఆ తరవాత క్రమంగా ప్యాసయి, పై క్లాసులోకి వెళతారు విద్యార్థులు. ఎడ్యుకేషను ఫ్రీ. కాగా పై ఊళ్ళనుంచి వొచ్చిన పేదవిద్యార్థులకి వసతి భోజన సౌకర్యాలూకూడా కాలేజీ ఆవరణలోనే ఫ్రీ యేర్పాటు. 500 మందికి యిటువంటి సౌకర్యాలు ఏర్పరచడానికి వీలుంది. వీళ్ళకి బట్టలు ఉతకడానికి చాకలి కూడా ఫ్రీయే! తలాఒక్కొక్క మంచమ్మూ, దోమతెరా, దుప్పట్లూ, తలగడాలున్నూ; గోడవైపుకి కోటుస్టాండు, యింకో అవైపుకి టాయిలెట్టు టేబిలూ అదీ యిలాంటి సౌకర్యాలన్నీ ఉన్నాయి. భోజనం బాగుంటుంది. వంట సూపరువైజు చెయ్యడం - ఒక్కొక్కరోజు ఒక్కొక్క స్టూడెంటు. ఇహ బాగుండకేంచేస్తుంది? సాయంత్రం ఆడుకోడానికి టెన్నిస్సూ, స్పోర్ట్సూ, వ్యాయామశాలా అన్నీ ఉన్నాయి. వీళ్లుండే వసతి బాగా గాలీ వెలుతురూవొచ్చి మంచి ఆరోగ్యకరంఅయిన వాతావరణంలో ఉంది.

ఈ వసుపాయాలన్నీ కాక, బ్రైటు స్టూడెంట్సుకి అనేకం స్కాలరుషిప్సు. ఏమాత్రం బ్రిలియంటుస్టూడెంటు అనిపించుకున్నా అధికార్లే అన్ని ఖర్చులూ భరించి ఉన్నతవిద్యకి ఫ్రాంసు (*France*) పంపిస్తారు. తరవాత ఉద్యోగం ఖాయం. ఇన్ని వసుపాయాలూఉన్నా చదువుకునేవాళ్ళ సంఖ్య తక్కువనే చెప్పాలి. అందులో కాలేజీక్లాసువరకూ చదువుకునేవాళ్లు బొత్తిగానే "లిసే సిస్సోవాత్"లో మాత్రం పది వేలమంది విద్యార్థులు అన్నిక్లాసుల మొత్తంమీదా ఉన్నా, గ్రాడ్యుయేషనుక్లాసుల్లోవాళ్లు మాత్రం చాలా తక్కువ. అసలు మొగపిల్లల విద్యాపరిస్థితే యిలాఉన్నప్పుడు యింక ఆడపిల్లల చదువూ సంగతీ విమర్శించనక్కర్లేదు. ప్రత్యేకించీ ఆడపిల్లలస్కూళ్లు ఉన్నాయిగాని, అవి

మిడిల్ స్కూళ్లు కేవలమున్నూ. కొంచెం కొంచెంగా కో - ఎడ్యుకేషను కూడా లేక పోలేదు. "లిసే సిసోవాత్"లో పది పది హేనుమంది ఆడపిల్లలు చదువుకుంటు న్నారు.

లైబ్రరీ ఓమోస్తరుగా కొస్త బాగానే ఉందికాని ఫిజిక్సు, కెమిస్ట్రీ లేబరేటరీల్లో పరికరాలు ఏమాత్రం సంతృప్తికరంగా లేవు నాంపెన్‌లో. ఇతర క్లాసుల్లో మాత్రం గ్లోబులూ, మేపులూ అవీ యివీ కుప్పలు తిప్పలుగా ఉన్నాయి.

ప్రొఫెసర్ల జీతం చాలా భారీ స్కేల్లో ఉంటుంది. వీళ్ళకి బంగళా ప్రభుత్వం సప్లయి చేస్తుంది. ఇంతమంది పిల్లలుంటే ఫలానా యింత జీతం అని, పిల్లల యీడూ సంఖ్యనిబట్టే జీతం హెచ్చుతూ ఉంటుంది. రెండేళ్ళకి ఓసారి ఆర్నెల్లు సెలవయిస్తారు. ఈ సెలవల్లో ఫ్రాంసు వెళ్ళిరావడానికీ (ఫ్రెంచివాళ్లయితే) యిండియన్లయితే తమ దేశం వెళ్ళిరావడానికీ విమానంలో రానూపోనూ ఖర్చు ప్రభుత్వం భరిస్తుంది. అంతేకాకుండా యీ సెలవు ఆ పైదేశంలో కాలు పెట్టిందగ్గిర్నుంచీ లెక్క అవుతుంది. అంటే, రానూపోనూ ప్రయాణంలో పోయిన రోజులు సెలవలో జమ అయిపోవు.

ప్రొఫెసర్లకి ప్రిన్సిపాలంటే భక్తిగౌరవాలున్నాయిగాని, అనవసరం అయిన సైన్యభావంగాని, దాస్యభావంగాని లేవు. ఆయన ఓ సబ్జెక్టులో గొప్పవాడయితే మనం యింకోదాంట్లోను అనే ఓ గుండె నిబ్బరం. ప్రిన్సిపాలు కూడా ప్రొఫెసర్లని యెంతో ఆదరాభిమానాలతో చూస్తాడు - కాంబోడియా భాష చెప్పే ప్రొఫెసర్లని కూడాను. (మన తెలుగు సంస్కృతం లెక్చరర్లు జ్ఞాపకంవొచ్చి యీ ముక్క ప్రత్యేకించీ అడిగేను) ప్రిన్సిపాలు తన ప్రొఫెసర్ల పేరు చెప్పుకుని గర్వపడతాడు. కాలేజీ గుమాస్తాలకి కూడా ప్రిన్సిపాలు దృష్టిలో కొంత స్థానం గౌరవం ఉన్నాయి.

ప్రొఫెసర్లంటే స్టూడెంట్లకి అమితమైన భక్తి. క్లాసులో పాఠం అయినతరవాత స్టూడెంట్సు వొంగి వొంగి వెళతారు, బయటికి. ఏదైనా సందేహంవొచ్చి అడగాలనుకున్నప్పుడూ, లేదా అడిగిన ప్రశ్నకి జవాబు చెప్పినప్పుడూ కూడా వినయానికి చేతులు కట్టుకుని జవాబు చెప్పి తల బాగా వొంచి నమ్రత తెలియజేస్తారు.

సర్వసాధారణంగా వీళ్లు ఒక్క అన్నం తప్ప యింకేదీ వొండరు. పచ్చి బీరకాయ ముక్కల్లో, పచ్చి వంకాయ ముక్కల్లో ఉప్పులో అద్దుకుని అరుగిన్నెల అన్నం అమాంతం కాజేస్తారు. మనం గోంగూర తొక్కు పచ్చడి పెట్టుకుని ఏటి ఏడాదీ తిన్నట్టు వీళ్లు చేపలు తొక్కు పచ్చడి పెట్టుకుని ఏడాదిపొడుగునా తింటారు. అన్నంలోకి అది ముఖ్యంఅయిన ఆధరువు.

కాంబోడియా సంస్కృతీ - హైందవ ప్రాబల్యం

వీరి గృహ నిర్మాణశిల్పంలో దక్షిణ హిందూశిల్పం చాలావరకు కానవస్తుందని మనవిచేసేను. అంకోర్‌లో ఉన్న శిధిలాలూ, దేవాలయాలూ చూస్తే, మధుర కోవెల నిర్మాణం జ్ఞాపకం వస్తుంది. అంతేకాకుండా అంకోరులో ఉన్న దక్షిణ హిందూశిల్పం అసలు దక్షిణ హిందూస్థానంలో ఉన్న శిల్పంకంటె మిన్నగా ఉంటుంది కూడాను.

వీళ్లు బౌద్ధమతస్థులయినా, హైందవ ఆకారాలు కొన్ని నిబిడంగా నాటుకుపోయినాయి వీళ్ళలో. మాటవరసకి బౌద్ధభిక్షువులు అలా ఉండగా పౌరోహిత్యమూ కూడా లేనిదీ ఏ పుణ్యకార్యక్రమంవూ జరగదు. ఈ బ్రాహ్మలని "బకు" అంటారు. వీళ్ళు పంచెకట్టూ, అర్ధచంద్రాకారంగా ముందుకి నున్నగా క్షవరంచేసిన తలా, వెనక్కి పిలకా - అంతా సలక్షణంగా - అచ్చంగా బ్రాహ్మలు!

నాంపెన్ మ్యూజియంలో లక్ష్మీ శివ విష్ణువుల త్రిమూర్తి విగ్రహాలున్నాయి. "స్నానద్రోణి" (*Cuve a ablution*) ఒకటి, శేష ఉపస్థితబుద్ధుడూ ప్రత్యేకించీ ఆకర్షించేవస్తువులు. శేషశాయి బుద్ధుడూ, నాగస్థిత బుద్ధుడూ, గరుడ విగ్రహం, మధ్యన అజ్ఞాన పరిమితబుద్ధుడూ, అటూయిటూ లోకేశ్వర బుద్ధుడూ, ఉన్న బుద్ధత్రయం, బ్రహ్మ యిలాంటివి యెన్నో హిందూ బౌద్ధ సంప్రదాయాలు మిళితం అయిపోయినవస్తువులు కనిపిస్తాయి. కాంబోడియన్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ (*Combodian School of Arts*) లో ముఖ్యంగా ఆకర్షణీయంగా కనిపించే బొమ్మ "నటరాజు."

ఇంక వీళ్ళ భాషలోకూడా యెన్నో సంస్కృతపదాలు కలిసిపోయినాయి. ఉదాహరణకి మనవిచేస్తాను: క్రు అంటే గురువు; సముందే అంటే సముద్రం; కబల్ అంటే (కపాలం) తల; పుత్ =కొడుకు (పున్నామ నరకాత్ త్రాయతే యితి పుత్రః అని ఎప్పుడో చిన్నప్పుడు మా గురువులు మేడేపిల్లి రమణాచార్యులుగారు చెప్పిన ముక్క గుర్తొచ్చింది, పై విశేషం ప్రొఫెసర్ వెంకట గారు చెబుతూఉంటేను) అఖ్ని అంటే అగ్ని - యిలాగ యెన్నెనో ఉన్నాయి.

వీళ్లకి జాతకాల్లో నమ్మకంఉంది. పెళ్ళి ముందర పిల్లాడి జాతకం, పిల్లజాతకంవూ విధిగా చూస్తారు. జాతకాలు నప్పకపోతే పెళ్ళి కావడానికి రవంతమాత్రం వీల్లేదు.

వీళ్ల నెలలపేర్లు అచ్చంగా సంస్కృతం:

చెత్ =చైత్రం.
విసాఖ్ =వైశాఖం.
జెస్ =జ్యేష్ఠం.
ఆసాఢ్ =ఆషాఢం.
స్రావ్ =శ్రావణం.
ఫోత్రొబొత్ =భాద్రపదం.
అశోక్ =ఆశ్వీజం.
కాత్తిక్ =కార్తీకం.
మిక్సిర్ =మార్గశిరం.
బోస్ =పుష్యం.
మాఘ్ =మాఘం.
ఫాల్కున్ =ఫాల్గుణం.

కాగా మనలాగే వీళ్లకీ 60 ఏళ్ళూ, వాటికి అరవై పేర్లూ (ప్రభవ, విభవ, లాగ) ఉన్నాయి. (ఇంకా ఉంది)

బారిష్టరు గారి బాత్రాఖాని

మొక్కపాటి నరసింహశాస్త్రి

ఒక రోజున మేమందరం నాటకం చదువుకుంటున్నాం. ఎన్నివిధాల ప్రతిమాలినా, భద్రం మొట్టమొదట ఆడనన్నాడు. వాని కర్మం. ఎవతె తలరాత ఎవరు తప్పించగలరు. నలుగురిలోనూ నవ్వుతూ తిరుగుతూ ఉండిన రోజుల్లో, ఏదో కారణంతో పుస్తకం తెచ్చి ఇస్తాలా ఒకనాడు మాకు మొదలంటాం అని ఏం చెయ్యము. కానియ్యి. వెళ్లు. 'బుద్ధిః కర్మానుసారిణీ' అన్నారు పెద్దలు. 'వాగ్గ అను దాటించినవారు, దీపనిర్వాణగంధము, అరుంధతిని, మిత్రవాక్యమును మూర్ఖుడా, వినరా, కనరా, వినరా,' అన్నాడు చిన్నయ సూరి, వీరేశలింగం పంతులుగారు, వెళ్లు. ఆచారాల సమాచరించు. మధ్యవచ్చి, మమ్మల్ని ఎన్నివిధాల ప్రార్థించినా ఆటంలో అడుగుపెట్టి ... మరచిపోకు. దయచెయ్యి' అన్నాను.

'భగవద్గీత కాదు గురుదేవా. ఇది భవభూతి ... నాటకం. ఇంకా కొత్తగా ఉంది. అది పూర్తికాగానే ఎలాగా వస్తాను. అప్పుడు ... కాని, ... రంగంలోకి దిగనూ దిగుతాను, మిమ్మల్నందర్నీ ఏడిపించనూ ఏడిపిస్తాను 'శెలవు' అని వెళ్లిపోయాడు. మేం ఏమ్వరం సమాధానం చెప్పలేదు.

మేం ఘంటలు ఆటపట్టాలో ఉండగా భద్రం ఊరికే వెర్రిగా నవ్వడం మొదలుపెట్టాడు. మా ఏకాగ్రతకు భంగం కలిగించాడని మహా పెద్దకోపం వచ్చింది. పేకముక్కలు విసిరి అవతల పారేశాం.

'నాయనా! తప్పయ్యా. పని చెప్పా నవుకోక నాలుగు నిమ్మకాయ లెక్కలేనా. ప్రతిమాలో, బదులడిగో, దొంగిలించో కొట్టుకురా బాబూ. బారిష్టరు గారూ పది బిందెలు నీళ్లు, చల్లనివి తెప్పించండి. భద్రానికి ఏదో మతిభ్రమ కలిగినట్టుంది,' అన్నాడు శర్మ చాలా *Serious* గా.

'ఏమిటి, భద్రం. నీకేమంటాంటి ఆట ఆలా తగలేశావు. పండులాంటి కాపురం పాడుచెయ్యకపోతే, ఏదో కానన్నట్టు. తపీమని అలా పగిలా వెందుకు, కుర్రాళ్లు అనుకునే రబ్బరు బెలూనులాగ?' అన్నాడు శాస్త్రి.

'నాకి గుణమే అంతలంచ. ... అసహనం వాదూను. ... రాగ నాయనా అని ప్రతిమాలినప్పుడు రాకూడదూ, ఆట మధ్యలో గందరగోళం చెయ్యకపోతేను' అన్నాడు రామం.

'*Sorry*. సభాముందారా! *Sorry*. ఇది ప్రథమ తప్పిదంగా భావించి మన్నించండి. మీ ఆట ఆపించాలని నా ఉద్దేశం, నాకెంత మాత్రం లేదంటే నమ్మండి. ... ఏది - ఈ నాటకంలోగూ, నా నవ్వుకో ...' అని మళ్ళీ నవ్వడం ఆరంభించాడు.

'... నీ ... అయిన తరువాత నేనా చెప్పలేదనుకో. చెప్పు, తరువాత నీ చిత్తం వచ్చినట్టు నవ్వు,' అన్నాడు శర్మ.

'నాం ... పాత్ర ... హేయమైనదని, నా ... ఇంట్లో ... వెళ్లినట్టు ఏడిచాడని రాస్తేను నవ్వు వచ్చిందండి. క్షమించండి' అన్నాడు భద్రం.

'నిజంగా అలా ఎవడేనా ఏడుస్తాడంటే' అన్నాడు టప్పయ్య.

'అసలు మా తాతగారు గొప్పవాడే ... అవుతాడండి. దానికేమైనా, అర్థదార్లా, చట్టాలా. లేకపోలా ఏమన్నా ఉన్నా యేమిటండి' అన్నాడు రామం.

'ఏడ్చేవాడిని చూచి నవ్వు నవ్వవచ్చు గానీ, బాగుపడి సంతోషంగా ఉన్నవాడిని చూచి వాడు ఏడ్చాడు. లేదా ఏముంది' అన్నాడు శర్మ.

'అంతే నాయనా. శర్మ శెలవిచ్చినట్లు, మానవ స్వభావం అంతే బాబూ. ఏడ్చేవాడిని చూచి నవ్వడం, నవ్వేవాడిని చూచి ఏడవడమూను. రెండూ సహజమే. లేదా ఏమీ లేదు' అన్నాడు శాస్త్రి, గంభీరంగా; ఉపదేశముద్ర పెట్టి, ఉపన్యాసధోరణి చేస్తున్నట్టు.

'నా రాస్తిగా గొప్పవాళ్ల వమంటే ఏమిటి. ఏదో నాలుగు డబ్బులు సంపా

...ంచడమే కాదూ. దానికనేక మార్గాలున్నాయి. లేకనేం.' అన్నాడు శర్మ.


ఉంటాయి...ఎందుకుండవు. ఒక వూరి నుంచి ఒకవూరు వెళ్లాలంటే, రైలురోడ్డు, కంకరరోడ్డు, కాలవగట్లు, చేలగట్లు; అనేకం. ఇందులో ఏ చేలగట్టమ్మటో పడిపోతే, అవతల వూరు ఇట్టే చేరుకోవచ్చు. అలాగే ధనార్జనకుగాని, ఖ్యాతి సంపాదించడానికి కాని, పేరుపొందడానికికాని, సవాలక్షు సదుపాయాలున్నాయి, తెలుసుకో గలుగుతేను.

ఊరికే మాటవరుసకు చెపుతున్నాను. కవి అనే ఖ్యాతి సంపాదించవలెనని ఉన్న దనుకో. ఏమీ లేదు. ఏమీ శ్రమపడ నక్కర లేదు. ఏ గురువుని ఆశ్రయించనక్కరలేదు. ఎలాగో తంటాలుపడి ఒక్క పద్యం రాసెయ్యి. ఎలాగంటావా! ఎలా కవిటి వ్రాసేవాడవు....

ఏల దయరాదు నాపైన తెలుపవమ్మ,
తప్పులేమైన చేసిన ఒప్పులట్ల,
తెలిసికొనవమ్మ దేవి నన్నేలుకొమ్మ,
భారమయ్యేను భామరో బరువు బ్రతుకు॥

తరువాత ఎనిమిది పంక్తులు చుక్కలు పెట్టు— అది ఏదో ఒక పత్రికలో అచ్చువేయించు. వెయ్యరన్న సందేహం నీకు అక్కరలేదు. కళ్లనద్దుకుని, ఏదైనాసరే అచ్చువెయ్యడానికి కంకణం కట్టుకున్న పత్రికలు చాలా ఉంటాయి ఎప్పుడూను. అచ్చుప్రతి నీకు అందిన వారం రోజులు, అది మాగడానికి వ్యవధి ఇయ్యి. చలనచిత్రం ఏదైనా విడుదల కాగానే ప్రజాభిప్రాయం ప్రత్యక్షంగా తెలుసుకోడానికి డైరెక్టర్లు బయలుదేరినట్లునువ్వుకూడా ముఖ్యకేంద్రాలు కొన్ని తిరుగు. అనూ వూళ్లల్లో, నాల్గిళ్లల్లో, ఫలానా పద్యం చూచారా ఎలా ఉన్నదో అని అడుగు, ఏమీ ఎరగనట్టు. వాళ్ళు సహజంగా ఇంత చిచ్చు పద్యం ఇదే కాని ఇంకొకటి ఈ భూలో కవితనిష్పత్తి అని చెపుతారు. అయితే ఒక్క విషయం నీవు జ్ఞాపకం పెట్టుకో. నన్నయభట్టు పద్యం చదివి వినిపించినా, చాలామంది దగ్గరనుంచి ఇదే అభిప్రాయం వస్తుంది. లేకపోతే వారి ఆధిక్యత తగ్గిపోతుంది.

ఈ అభిప్రాయం చెవిని వేసుకుని, మరో నాలుగు వూళ్లు తిరుగు. ప్రతి వూళ్ళోనూ కళాసమితులు, సాహిత్యసభలు, అధమం పుస్తక భాండాగారాలు ఏవో ఒకటి ఉంటాయి. ఆ కార్యదర్శి నాశ్రయించి ఒక సభ ఏర్పాటు చేయించి, స్వీయ కవిత వాళ్లకు వినిపించి, దాని మీద ఓ ఉపన్యాసం దంచు. అమ్మ అనే శబ్దం, అట్టు ప్రాణేశ్వరికి, ఇటు ప్రకృతికీ, ఇంకో అట్టు పరమేశ్వరికి అన్వయిస్తుందనీ, ఆ ముగ్గురూ ఆరాధ్యులేననీ అందుచేత నిలా వ్రాశాననీ వ్యాఖ్యానించు. ఆ సభలో ఎవరేనా ఆరాధ్యులు కాని, ఉంటే వారు మరీ సంతోషిస్తారు. ఉపన్యాసంలో సంస్కృతి మొదలు సానిమేళాల వరకూ నీవు ఏమిచెప్పినా 'అశేం పోగాలము' అనేవాళ్లెవరూ ఉండరు. ఇది రెండో ఘట్టం. ఇంక నూతన కవిత్వప్రచారానికి మూడో ఘట్టం ఏమిటంటే నాలుగు మారుమూల గ్రామాలకెళ్లి అక్కడ సన్మాన సభలు జరిపించుకునో జరిపించుకోకుండా, జరిగినట్లో పత్రికలలో ప్రచురింపించుకో.



సర్వోదయనగర్ ముఖద్వారం (మద్రాస్ కాంగ్రెస్ ఎగ్జిబిషన్‌లో)

★ బారిష్టరుగారి బాతాఖానీ ★

ఇంక [illegible]బాల్లా, ప్రతి గ్రంథాలయ సభకు, ప్రతి జయంతి ఉత్సవాలకూ, ప్రతి పాఠశాల వార్షికోత్సవాలకూ, ప్రతి కాలేజి సంస్కృతి[illegible] నిన్ను పిలవక పోతే నన్నడుగు.

ఇంకో విశేషం [illegible] కొత్తగా పత్రిక పెట్టేవాళ్ళు, నిన్నేమైనా వ్రాసి పంపమనడం, [illegible] కలు ఊరికే [illegible] వచ్చు. అదృష్టం [illegible] యువక [illegible] వ్రాయంకో [illegible] మరీ అదృష్టవంతుడివయి[illegible] ఏ కంపెని [illegible] కాంప్లిమెంటరీ టిక్కెట్లు [illegible] ఈ ఖ్యాతి. [illegible] వ్రాయడానికి [illegible] పూర్తిల్లో [illegible] గాలలో వ్రాయడము, [illegible] లేవదీసేవాళ్ళలో [illegible] పత్రిక బాగుంటే మీవూరు పంచాయితీ ప్రెసిడెంటో, దేవాలయం ట్రస్టీయో అయి ఊరుకుంటావు తెలిసిందా. నీవు ఎంతో దురదృష్టవంతుడవై [illegible] సర్వం కొలి, ఇవేవీ జరక్క [illegible] తినే అవస్థపడితే, లోకం విధిగా నిన్ను ఆదరించి, '[illegible] పాపం. సారస్వత సేవకోసం అంగాన సర్వస్వం ధారపోసి ఏ స్థితికి వచ్చాడో' అని నిన్ను పొగడ[illegible] [illegible] నా క్షేమ్వరకూ ఒక్క కాని ఇవ్వక పోయినా ఇబ్బంది లేదు. [illegible] అవుతోసంబానా. [illegible] నీవు పడవలసిన శ్రమ అంతా [illegible] [illegible] అంత [illegible] ఉంటుంది. అందులో కవనో తెయ్య[illegible] తెలుగులో ఏ పత్రికకైనా పంపించు ముందు ఆ [illegible] అచ్చువేసిన పత్రికకు పంపినా [illegible] ఈ చచ్చుకథ సంపాదకులకి [illegible] జ్ఞాపకం ఉండుందన్న మాటే ఇటు-[illegible] ఏ [illegible] హిందీ కాని, బెంగాలీ కాని, అధికప్తే కొత్త ఇంగ్లీషు కాని వస్తే, ఆ భాషల్లో పత్రికలు చూచి ఆ కథలు యథాతథంగా తెలుగులోకి మార్చి స్వంతంకింద కొట్టెయ్య. మన తెలుగు సంపాదకులలో హిందీ బెంగాలీలు వచ్చినవాళ్ళు ఎవ్వరూ లేరనే చెప్పవచ్చు [illegible] చదివారా

[illegible] ఏమీ కష్టం లేదు. ఒక అందమైన కుర్రవాడు [illegible] వాడో, [illegible] వాడో ఉంటాడు [illegible] అమ్మాయి [illegible]

'[illegible]'

[illegible]నారాయణా, [illegible] ప్రశ్నలు వయ్యాక నేను చెప్పేది విను. అలాంటి సందేహాలేమైనా ఉంటే, 'పక్కింటి [illegible]యి' అనే చిత్రం తీసిన [illegible]గార్ని అడుగు. ఇలాంటి సందేహాలు వారికి చాలా కలిగి ఉండాలి అందుచేత చాలా ఆలోచించి ఉంటారు. ఈ స్త్రీ ముందా[illegible], అనగా మన కథానాయకుడు ఎన్నాళ్ళకీ ఉలక్క పలక్క, ఊరుకుంటే ఆ అమ్మాయి ఓ చీటీ రాసి, ఓ రాయికి

చుట్టపెట్టి వాడి మొహం బద్దలయ్యేటట్టు వాడి గదిలోకి విసురుతుంది.

'ఆ దెబ్బ వాడికి కాక మరొకడికి తగిలేతే' అన్నాడు భద్రం.


'అందుకనే నాకిదాంతటితోనూ 'కాహూ రాహా ప్రకృతి కృపణా కృతనా చేత నేను' అన్నారు. ఆ కైపులో ఉన్నవాళ్లు చేతనానికీ అచేతనానికీ తేడా తెలుసుకోలేరంటే, ఏ సంజచీకటివేళో బయిటికి మనిషికి ఎలా తేడా తెలుస్తుందని చెప్పు. పైగా అంత ఆకలిగా ఉన్నప్పుడు ఎవరైతే నేమి అనిపించినా అనిపించవచ్చు.

ఇవతలవాడు నాయుడుగారి కొడుకో యువకుడికి తలిదండ్రులో - కథ మరి రక్తికడుతుంది. వాడు గొరికెందని భాగ్యం అని కొర్యదీక్ష పూని కొన్నాళ్లు తంటాలుపడి అల్లో ఇల్లో తేల్చవచ్చు. ఎలాగైనా ఆ అమ్మాయి ఆఖరికి ఆ ఎవవరో ఈ ఎవవరో పెళ్లిచేసుకునో చేసుకోకనో సుఖంగా కాలక్షేపం చేస్తుంది.

ఇలాంటి కథావస్తువులు సనాలక్షు ఉన్నాయి నాదగ్గర. నీకు కావలిస్తే.

ఈ గొడవంతా ఎందుకు నాకు. అభ్యుదయ రచయితగా కవిగా అవుతానంటావా, చాలా సంతోషం. దానికి గొప్పగా అక్కర లేదు. కథా అక్కర లేదు; వస్తువు అక్కర లేదు, రచనా విధానం అక్కర లేదు; పాత్రపోషణ అక్కర లేదు. ఆ మాటకొస్తే పాత్రలుండేకాడు పోషణ. అంతా అపాత్రులే. ఎప్పుడూ పెండ్లే పాత్రలు, జమీందారు - కర్షకుడు - లేదూ మిల్లుయజమాని, కార్మికుడు సహజంగా జమీందార్లూ మిల్లుయజమానులూ, పరమ దుర్మార్గులు, రాక్షసులూ, కిరాతులూ, నరహంతకులూ, దొంగలు, దోపిడిగాళ్లూను. వాళ్లని నిర్మొగమాటంగా నీవు ఉచ్చరించగలిగిన, వ్రాయగలిగినన్ని తిట్లు తిట్టవచ్చు. ఇందులో ఏ అభాజనుడూ నిన్నేమీ పరువునష్టం దావా తేడు. కొంచెం కవిత్వ ధోరణిలో తిట్టాలంటే జమీందారుని రాజు అని, అంత్యప్రాసలతో తరాజు అని, బాజా అని, గాజు అని తిట్టు.

ఈ బాధలన్నీ నాకెందుకు ఇంకో రకం రాయకూడదా అంటావా. తప్పకుండా రాయొచ్చు. ఎవరినో నాలుగు ఉద్యోగాలు, ఊరునకెరవృత్తివారమైనా, సంపాదించిపెట్టి పెట్టుకో. అర్థ్యానం ఎంచి నీదగ్గర తిరుగు. వాడుకోలేదులా, కూలీకూలీలా, అన్నీ ఓపికతో విను. వాటిలోనుంచి నీ ఇష్టం వచ్చినవాంకాలు తీసుకుని, నీకిష్టంఉన్నవీ లేనివీ మరికొన్ని చేర్చి వాడిజీవితచరిత్ర రాసి పారెయ్యి. దానితో నీ దరిద్రం తీరుతుంది. లేదూ, ఆయనెవరో 'బారిష్టరు పార్వతీశం' అని నాకబుర్లు విని నాజీవితచరిత్ర రాశాడే;



సర్వోదయ నగర్‌లో గాంధీ మంటపం (కాంగ్రెస్ ఎగ్జిబిషన్‌లో)

ఫోటోలు: కె. శేషాంజనేయులు—మద్రాసు.

అలారాస్తే డబ్బు రాకపోయినా పేరైనా వస్తుంది. పాపం, నేనాయన కొక్కదమ్మిడీయైనా ఇవ్వకపోయినా, నా పేరువల్ల ఆయనకెంత పేరొచ్చిందో చూడు. లేకపోతే ఆయన ముఖం ఆయనకేంవచ్చు.

అసలు ఏదీ రాయను. పేరు రావడానికి వ్రాతతప్ప మరోమార్గమేమీ లేదా అంటావా. ఉంది. ప్రతిదానికీ ఉందనుకో. నువ్వో పల్లెటూరులోనో చిన్న పల్లెటూరిలాంటి పట్నంలోనో ఉన్నావనుకో. నువ్వు మొట్టమొదట నాలుగువూళ్లు అస్తమానం తిరుగుతూ ఉండు. నాయకులు ఎవరు ఆ ప్రాంతాలకొచ్చినా పిల్చి వాళ్ళవర్యసం చేసుకొని మీ వూరుకూడా వారిని రమ్మని ఆహ్వానించు. మీ వూళ్ళోకూడా ఉపన్యాసం ఇప్పించు. నేను మా గ్రామస్థులతరఫున మా కివి కావాలి అవి కావాలని ఒకఅర్జీ బనాయిస్తూ ఉండు. క్రమేణా నాయకులందరికీ నీ ముఖం, నీ నాళ్ళకి నీ పేరూ బుర్రలో ఉండిపోతుంది. తరువాత నిమ్మళంగా మీవూళ్ళో బ్రాహ్మలోట్టేపనికిమాలినవాళ్లని, కోమట్లనోటే, వాళ్లిద్దర్నీ కూడా నమ్మడానికి వీల్లేదని కాపులలోటే, ఈ ముగ్గురూ కూడా మీకు శత్రువులేనని పంచముల -

బారిష్టరుగారిబాతాఖానీ

కాదు హరిజనులతోటీ రహస్యంగా ఏ రాత్రివేళో వాళ్ల ఇళ్లకెళ్ళి మంత్రోపదేశం చేసినట్టు చెప్పు. క్రమేణా ఈతంత్రం చుట్టుపక్కల గ్రామాలలో కూడా ప్రయోగించు.

'ఈ రోజుల్లో ఈ మాటలన్నీ ఎవరు వింటారండీ' అన్నాడు శర్మ.

ఇంత అమాయకుడవనుకోలేదోయి శర్మా. నువ్వేదో తెలివైనవాడ వనుకున్నాను. ఇప్పుడు దేశం అంతా నాగరకత వచ్చింది. అక్షరాస్యత పెరిగింది. రాజకీయ చైతన్యం వచ్చింది అని కాదూ నీ ఉద్దేశం. అందుచేత నెవ్వరూ ఈ మాటలు వినరంటావు. అంతేనా. పందెం వేస్తావా. ఇంత తెలివి మీరిన ప్రజానీకం, ఎవరు ఏ మాట చెపుతే ఆమాట వింటారు. విమర్శజ్ఞానం, విచక్షణా తగ్గిపోయాయి. ఎటొచ్చీ మంచి చెపుతే వాళ్లు వినరు. గాంధీగారు రోజూ ఇన్ని గంటలు రాట్నం తిప్పమన్నారు. రామకృష్ణ పరమహంస ఇంతసేపు దైవధ్యానం చెయ్యమన్నాడంటే ఎవ్వడూ వినడు. విన్నా అలా చెయ్యడు. ఫలానా వాళ్లు దుర్మార్గులంటే వెంటనే నమ్ముతారు. ఫలానావాళ్ళు నీ కొంప తీస్తున్నారంటే కాబోలనుకుంటాడు. అందుచేత వాళ్ల కొంప ముందు మనమే తీదామంటే వెంటనే తయారవుతారు. అందుచేత పరస్పర ద్వేషం పెంచు. అందరూ నిన్ను నమ్ముతారు. అక్కడనుంచి ఏదో ఒక శాఖనో వర్గాన్నో పట్టుకుని ఒక సంఘం ఏర్పాటు చెయ్యి. కాపు కాంగ్రెసు అనో, తెలగా కాంగ్రెసు అనో, మున్సి కాంగ్రెస్సనో - ఏదో ఒకటి - లేదూ మాజీ గీత పనివారనో, మాజీ క్షురకార్మికులనో మాజీ సంతోష గృహనిర్మాతలనో (అనగా వేశ్యాగృహాలన్న మాట) ఏదో ఒకటి సంఘం పెట్టి వాళ్లదగ్గర చందాలు వసూలుచేసి, వాళ్ల కష్టాలను గురించి రోజూ ఉపన్యాసాలూ, పత్రికలో వ్యాసాలూ గుప్పించు. 'ఇంతింతై వటుడింతయై...' అన్నట్లు, క్షణాలమీద, చోటానాయిక్, బడానాయిక్, అస్సెంబ్లీ మెంబర్ లోక్ సభమెంబర్ - ఇన్నీ అయి, దిష్టి కొట్టకుండా బతికి బాగుంటే మంత్రి - మాజీ మంత్రికూడా కావచ్చు. ఏమంటావు.

అదీ కాక పల్లెల్లో కాక పెద్ద పట్నాల్లోనే ఉంటే, బస్సు కండక్టర్లతోటో, పోస్టు జవాన్లతోటో, రైలు పోర్టర్లతోటో, రిక్షావాళ్లతోటో, హోటలు పనివాళ్లతోటో, ఆఖరుకు పాకీవాళ్లతోటో నెమ్మదిగా స్నేహంచేసి వాళ్లనో సంఘంగా ఏర్పాటుచేసి, మధ్య మధ్య సమయాను కూలంగా సమ్మెలు చేయిస్తూ ఉంటే కొద్ది రోజులలో పెద్ద నాయకుడవు కావచ్చు. ఎప్పుడో మంచిరోజున మంత్రికూడా అవచ్చు. నాకు పేరూ వద్దు, ప్రతిష్ఠా వద్దు, వల్లకాడూ వద్దు. డబ్బొక్కటుంటే చాలునంటావా. దానికి మరి సూక్ష్మోపాయాలున్నాయి. మరో మాటు చెపుతాను. అన్నీ ఒకసారే చెపుతే నీకు జ్ఞాపకమూ ఉండదు. నీవు జీర్ణించుకోనూ లేవు - ఏమంటావు - రైట్ గురూజీ అన్నాడంతా.

సూతికాభరణం

గతించిన అయిదు రోజుల ఆవేదనా మమ్మల్ని మౌనవ్రతుల్ని చేసేంది. మరింత దగ్గరగా జరిగిజరిగి, ఒకర్నొకరం అంటిపెట్టుకు పోతున్నాము.—

నిమిషాలలోని సెకండ్లు పీనాసి మనిషి చేతిలోని రూపాయలమాదిరి వెచ్చింప బడి పోతున్నాయి.

ఆసుపత్రి వరండాలోని పీపులేని బల్లమీద శివరాత్రి చేస్తూ ఒకర్నొకరము కావలి కాసుకుంటున్న ఇద్దరు జీవాలము!

మాకు అల్లంతదూరంలో, రెండువరండాల మలుపుల మేరలోవున్న ప్రసూతి శాల మా మనసేంద్రియాలకు అవధి.

వరండాల పొడుగు వెడల్పులేకాక, దానిమీద పరచబడిన నాపరాతి పలకల వైశాల్య స్వరూపాలదగ్గర్నుంచీ కొలిచి కొలిచి, పరిచయాన్ని ప్రేమగా పరిణమింపజేసికొని, ఆ ఆవేశంతో ఆసుపత్రినే దేవాలయంగా భావించుకొని అనేక ప్రదక్షిణలు సమర్పించుకున్నాను— ఎముకలు కీచుకీచుమనే కరడు గట్టుకుపోయే చలిగాలిమంచులో!

అయినా, నాఫాలతలాన్ని ఊటలూరుతున్న స్వేదబిందువులు కనుబొమలు దాటీ కణతలు దాటీ దిగిరాలేక అక్కడనే చారికలుగా మిగిలిపోతున్నాయి.

వరండాలో ఏకాంతమనుభవిస్తూ మూలుగుతున్న మసిబారిన దీపం నాకు రామనామ తారకమయి నాలోని లోలోని తాపాన్ని వెలుపలికి పెల్లగిస్తోంది.

తన ఏకాగ్రత నంతనీ చేతిగడియారం మీదనే కేంద్రీకరించుకుని సాధన చేస్తున్న నామామగారి సమీప సహవాసం ఎందుచేతనో నాకు అలసట కలిగించసాగింది. అదే బల్లమీద ఇక కూర్చొన లేకపోయాను.

వరండాకు కుడిచివర సగంవిరిగిన కాలితో జవజవ లాడుతున్న కుర్చీమీదికి నా శరీరభారాన్ని బదలాయించేను. ప్రసూతి గదిలోని మూలుగులనిడివి ఇక్కడికి స్పష్టంగానే వినబడుతోంది.

లోని యాతనకూ బయటి నిరీక్షణకూ ఈవరండా ఒకపొలిమేర. ... ఇది దాటి మొగజాతి లోనికి పోరాదట !......

"ఇంకొక్క అరఘుంట ... !" చేతి గడియార్ధం మీదనుంచి దృష్టిని ఎదురుగా వేలాడుతున్న లైటుమీదికిపోనిచ్చి, మామగారు పైకి చదివిన మంత్రం: "పురుడు రాకుండావుంటే బాగుండును ... ఒక్కర గంట......"

నాకు కొరకొరలాడింది. అయిదురోజుల నుంచీ ఆమె మరణ బాధపడి పోతోంది. ఇక కొంప మునిగిపోతుం దేమోననే విషమ పరిస్థితి వచ్చేసరికి అర్థరాత్రివేళ ఎకాయెకీని ఆమెను తీసుకువచ్చి ఆసుపత్రిలో పడ వేశాను.

"నయమే — సమయానికి తెచ్చేరు" అన్నది రోగినిచూస్తూ డాక్టరు, "ఏమాత్రం ఆలస్యమైనా కొంపమునిగి పోయేదికదా—"

ఇప్పటికీ మూడుగంటలనుంచీ నర్సులూ డాక్టరూ ఆమెని కనిపెట్టుకుని చూస్తూ వున్నారు.

ఆమె మూలుగులు – ఆగదినిదాటి, వరండాలలో నడిచి,నన్ను దూసుకుపోయి, ఆసుపత్రి ఆవరణదాటి ... రోడ్డుప్రక్క నిద్రాముద్రితమైవున్న చెట్లచిటారు కొమ్మల ఆకులమీద తూగి, చీకటి ముసుగులలో

ప్రభాత

విలీనమయి, దురాన చక్రవాళంలోని మంచు మబ్బులను తాకి...... తిరిగి తిరిగి వర్తులాలై రంయ్ రంయ్‌మంటూ మరికొంత సేపటికి నా దగ్గకేవచ్చి నా చెవిలోనుళ్ళు తిరుగుతున్నాయి.

ఈ మూలుగు దొంతర్లు ఒకదాన్నొకటి తరుముకొంస్తూ నన్ను నుసి చేస్తున్నాయి.

—ఈ పడుతున్న యాతన చాలదా? దీనికి అవధిలేదా?... ఇంకో అరగంట ఆగాలిట!

మామగారి సణుగుడు నాకువినబడింది:

"...మూలా నక్షత్రం వెళ్ళిపోతుంది... ఒక్కరగంట!"

ఏదో పిచ్చమనిషి! ఏం మనిషి? ఈ మూలలు నక్షత్రాలూ ప్రాణాలు రక్షిస్తవా? నయమే— ఈయన ఆడాక్టరమ్మకు బదులు అక్కడ నిలబడిలేడు!

ఆయనమీద నాకుఈమాటు అసహ్యమే పుట్టుకువచ్చింది.

ఇంతలోనూ ఆయన మెల్లిగా తన బరువైన ముఖం నావేపు తిప్పేరు. ఎంతో గంభీరంగా దబ్బపండు చాయలో వుండే ఆయన ముఖం, ఆ మసక వెలుతురులో అప్పడాల పిండి ముద్దలాగుంది. తల్లిలేని తన కూతురి ఛాయ ఆయన కనుకొలకులలో మెరుస్తూ వుంది.

నాకో పదిగజాల దూరంలో ఆయన వంటరితనం అనుభవించలేక పోయారు. మెలమెల్లగా నాదగ్గరకువచ్చి, స్థంభానికి చేరగిలపడిపోయాడు; కొంత నైతికశక్తి సహాయం కోసం.

పాపం! ఆయనా పడుతున్నాడు! కూతురు కష్టపడుతోందని తెలియగానే అన్ని పనులూ ఆపుకుని మద్రాసునుంచి వాలేడు. పెద్దవాడు. బాధను బిగపట్టుకో గలుగుతున్నాడు. అంతే!

ఎంత ఏమయినా - కన్నబిడ్డగదా - తల్లిలేనిది - ఒక్కతి!...దగ్గరగా అమ్మమ్ముండొచ్చు...అత్తగారుండొచ్చు ... ఇంకో ఇందరుండొచ్చు...

"ఎందరుంటేనేమి - ఎంత డబ్బుంటేనేమి - తల్లిలోటు తీర్చగలమా?" అన్న మా అమ్మమాటలు నాకు గుర్తుకు వచ్చేయి.

మే మిద్దరం ఒకరికొకరం మూగ సానుభూతి చదువుకుని దూరంగా ఆకాశంమీది నక్షత్రాలను పరామర్శిస్తున్నాం.

కొంతసేపటికి మా అమ్మ వచ్చింది...

"ఇంకా టైం తీసుకుంటుంది..." అని నసిగింది.

నా ముఖంలోవున్న ప్రశ్నల పరంపరని చూసి ఆమె అనసాగింది:

"తొందరపడరు నాయనా—ఎంత ఆస్పత్రిలో ఐనా...కాన్పు సహజావుగా దానంతటది రావలసిందే! ఇంక, కాలం కర్మం కలిసిరాక అడ్డం తిరిగితే అప్పుడు చెయ్యి చేసుకుంటారేగాని - బలవంతాన్ని కాన్పు చెయ్యరు నాయనా..."

"మరి...బాధ...?"

"పడాలి...!" మెల్లిమెల్లగా నాకు నచ్చచెప్పసాగింది. "తొలిచూలు కాబట్టి కొంచెం ఎక్కువ...ఏమాత్రం తొందరపడినా పెద్దప్రాణానికే ముప్పం వస్తుంది.."

ఆ మాటలకు నా గుండె ఝల్లుమంది. నోరు మూతపడింది.

అమ్మ అంటోంది:

"నెప్పులు అంతకంతకు తగ్గిపోతున్నాయి. పెద్ద డాక్టరు కూడా వొచ్చి చూసి ఫరవాలేదన్నాడు."

"ఇప్పుడు నెప్పులే రావడం లేదా—?" అన్నారు జేవురించిన ముఖంతో మామగారు.

"వొస్తున్నాయి...తగ్గుతున్నాయి... వాళ్ళుపడే జాగ్రత్తలు పడుతో సేవున్నారు.

★ సూతికాభరణం ★

"అసలు కాన్పు నెప్పులు దాని కింతవరకూ రానే లేదు..... ఇందాకా అయిదారు వొచ్చేయి కాని, అలా ఇంకొన్నేపు గబగబా వొచ్చేస్తే కాన్పొచ్చేసేది..."

"నీరస పడిపోయిందనుకుంటూ—"

"అయిదు రోజులు..."

"లోపల శిశువు—?"

"బాగానే వుంది. అడ్డం తిరిగిందో ఏమో — ఏదో ఇంజక్షనిచ్చేరు...ఎంత సేపూ...ఫరవాలేదులెండి.. పిల్ల ఊరికే గాభరాపడిపోతోంది. నిస్త్రాణ పడిపోతోంది."

ఇందాకా ఒక గంటక్రితం నోరుచేసుకుని అడిగేను. దానికి అమ్మ యిచ్చిన సమాధానం: "ఇలా నువ్వు రాకూడదు నాయనా.. ఇంటికెళ్ళి పడుకో—మేమంతా వున్నాముకదా...". సలహా అతి చక్కనిది. ఇంకా ఒకపక్క నాకు గుచ్చుకుంటూనే వుంది.

ఇప్పుడుకూడా అమ్మా మామగారూ అదే సలహాను అందచేసి సంతృప్తి ప్రకటించేరు.. నాకు మాత్రం నవ్వూ ఉడుకుబోతుతనం వచ్చేయి—

ఆ మనిషి, శరీరాన్నంతని అంగుళమంత శిమూ యెరుగుదునే! నన్నే చూడనియ్యరాదు కాబోలు!

వాళ్ళిద్దరూ నన్ను మరచిపోయి ఏవేవో పురిటినిగురించిన సాంకేతిక వ్యవహారాలు కొంతసేపు మాట్లాడుకున్నారు.

గేట్లోంచి ఒక బండి లోపలికి తోసుకుంటూ వొస్తోంది...

"ఎవరో కాన్పుకేసు.." అనుకుంటూ అమ్మ లోపలికి వెళ్ళిపోతోంది—

"శిరోదయం కాగానే టైముచూడండి ...కబురు చెయ్యండి ఒక్కగారూ!" అన్నారు మామగారు

బండిలోంచి దిగేరు...ఒక ముసలావిడ ...ఒక అమ్మాయీ.. పదహారేళ్ళకంటే వుండవు. లోనుండి ఒక నర్సు వచ్చి అమ్మాయి రెక్కపట్టుకుని నడిపించసాగింది .. వరండాలో నా ప్రక్కనించె వెడుతున్నారు.

పాలిపోయి, గాలిలో ఈదుకుపోతున్నట్లు, అగ్నిపర్వతాలనే మింగివేస్తున్నట్లు కనపడుతోందా అమ్మాయి. ఏదో సామానుతో ముసలావిడ కూడా లోపలికెళ్ళింది.

మరికొంత సేపటికి ఇంకో ఇంత సామానతో ఒక మరీ ముసలాయన వచ్చి, బండివాడిని పంపించేసి, మామగారికి కాస్త దూరంగా బల్లమీద చదికిలపడ్డాడు.

—ఈయనికి మనవరాలు కాబోలు... లేక కోడలో!

ఈ సమయానికి ముసిలి నర్సు నా దగ్గరకు వచ్చింది. మెల్లగా అన సాగింది:

"మీరేమీ దిగులుపడకండి...కేస్ సీరియస్ దే...ఇద్దరి ప్రాణాలూ నిలపెట్టడానికే మేం ప్రయత్నాలు చేస్తున్నాం. పెద్ద డాక్టరుగారు కూడా ఆటెండవుతున్నారు..."

"అంత సీరియస్సా?" అన్నా, నోట్లోంచి మాటలు పెల్లగించుకుంటూ...నేనను కున్నంత పని జరుగుతోంది...ఈ కడుపు రాకపోయినా బాగుండును.

ఏమిటో—ఈ ఆడాళ్లకి పెద్ద తాపత్రయం. పిల్లలు కావాలి. ఇరుగు పొరుగుల పిల్లల్ని పోగుచేసుకుని వాళ్ళని సింగారించి ఆనందించడం. స్వతం పిల్లలు రాబోయేసరికి ఒకసారి చావడానికి సిద్ధపడడం...

ఒక్కసారి చచ్చిపోవడం ఒక విధంగా ఆనందించే విషయమే. చావులో కూడా సౌందర్యం వుంది; కవిత్వమూ వుంది.

పురిటి చావు ఒక చిత్రవధ. పిల్లలు పుట్టడం, తల్లి బతకడం ఒక పెద్ద లాటరీ!

"మీకు చెప్పడం మాకు విధాయకం..." నర్సు అనసాగింది. నేను నుడ్లు నేలకు వప్పగించి వింటున్నాను.

"గత్యంతరం లేకపోతే తల్లి ప్రాణంకోసమే పాటుబడతాం..."

ఒక్క క్షణం ఆగిపోయాను: "అపరేషన్—"

"అవును...తల్లి ప్రాణానికి ఏవిధమైన అపాయమూ రానియ్యం."

విమానంలో కూర్చున్నాను. ఒక్కసారి హిమాలయ పర్వతాలమీద సంచరించి చంద్రలోకంలో వాలేను.

"సరే" అన్నాను, తలయెత్తి చూశాను. నర్సు వెళ్ళిపోయి చాలా సేపయింది!

* * *

తెల్లవారి పోతోంది...

మామగారేదో చెపుతున్నారు. ఆ ముసిలాయన వింటున్నాడు; మళ్ళీమాపికూర్చుని! ఇంకెక్కడ కూర్చోగలను?

ఆసుపత్రుసంబంధం చేసేటప్పుడే ఇన్ని ముళ్లమొక్కలని పూదోటల్లో పారవేస్తారు. అనినాలకి, అంతా పూర్తయింతర్వాత, ఆవరణలో ఎదుగుతున్న పచ్చగడ్డిమీద అతినేర్పుగా పక్షేరుకాయలు లేవచల్లుతారు.

ఈ ముళ్ళతో నాని ఆసుపత్రి వాతావరణం పూర్తిగాలా.

రేపు బ్రహ్మదేవుడు స్వయంగా వచ్చి శ్రీమతి సరస్వతిగారికి మన ఆసుపత్రి పురుడు పోయించివస్తే, ఏ మూలకూర్చుంటాడు?—ఆ ముళ్ళమీదనే.

ఆ ముసిలాయన బాగా నా కర్థమవుతుంది: ఆ పిల్ల భర్త కూడా దగ్గర లేడు. అతనికి ఎవరూ లేరుట. ఎక్కడో చదువుకుంటున్నాడుట...ఈమె పసిపిల్ల! నిండా పదిహేనేళ్ళైనా లేవు. చాలాబలహీనంగావుంది, కాన్పుకు తట్టుకోలేనట్లు కనపడుతుంది పాపం—ఏదో సామాన్య కుటుంబీకులు.

అందుకనే మేము మొదటినుంచీ ఎంతో జాగ్రత్త తీసుకున్నాము. ఎప్పటికప్పుడు డాక్టరుకు చూపిస్తూ ప్రత్యేక ట్రీట్మెంటు చేయిస్తూనే వచ్చేను. అయితేమాత్రం ఏమి చేయగలుగుతున్నాం?...

పురిటి గదుల్లోంచి ఏవిధమైన చడీ చప్పుడూ వినపడడం లేదు. ఒకవేళ అంతా సొమ్మసిల్లి నిద్రపోతున్నారేమో—శ్రీకృష్ణభగవానుడు పుట్టిన నాటి రాత్రివలె!

ఇన్—పేషెంట్సు తాలూకు పరిజనులు అటికడ చేస్తూ అటూఇటూ పచార్లుచేస్తున్నారు. ఒక తోటమాలి వాడు వచ్చి వరండా చిమ్ముతున్నాడు.

నా కంతకంతకూ నైతికశక్తి కూడా క్షీణించిపోయింది. ఇందాకటినుంచి కూర్చున్న కుర్చీమీదకూడా వాలుస్తూ ఆయాసం తోంది

ఇద్దరు నర్సులు దూర్యాసంచాలించుకుని వెళ్ళిపోతున్నారు. అందులో ఒకామె నన్ను కళ్ళతో పలకరించింది.

...చక్కగా వుంటుంది—బొద్దుగా. కులంగోత్రం తెలియదు క్రిస్టియన్మాత్రం కాదని మనసులో ఏదో అనిపిస్తుంది—

ఆమెను చూసేసరికి, ఇంతవరకూ పద్మాసనంమీద యోగముద్రలో నిద్రిస్తున్న నా పురుషత్వం ఒక్కసారి కొలుకదపి నట్లయింది. ఒక్కొక్క స్త్రీని చూసేసరికి పురుషుడూ విపరీత పురుషుడుగానూ స్త్రీ విపరీత స్త్రీగానూ మారుతారు

ఈమెకూడా ఎప్పుడో ఒకప్పుడు

ప్రసూతి బల్లమీద క్షణాలను గుణించు కుంటూ పడుకుని వుంటుందా? రోజుకు పది పదిహేను బాలెంతలపాట్లు కళ్ళారా చూస్తున్న ఈమె పెళ్ళిచేసుకుని పిల్లల్ని కంటుందా?

అందుచేతనే కాబోలు అనేకమంది నర్సులు కన్యలుగానే దిగపడిపోతారు!

వీరి మానసిక ప్రవృత్తికి ఒక సమంజసమైన వ్యాఖ్యానం మనకు దొరుకుతుంది. కాని, వీరికి అప్పచెల్లెళ్ళయిన పంతులమ్మల విషయంలో అంత సులభగ్రాహ్యం కాదు. అనేకమంది పంతులమ్మ కన్యలు కూడా మనకు కనపడుతూనే వున్నారు.

పూర్వం ఒకానొక సందర్భంలో నేనొక నర్సును వివాహం చేసుకోవాలని అభిలాష పడ్డాను. ఆమె అందచందాలకు ముగ్ధుణ్నయి కాదేమో - డ్యూటీ లో పూర్తిగా లీనమైపోయే ఆమె గుణమే కారణమనుకుంటాను...అదే విధంగా ఒక పంతులమ్మగారిని కూడా అనుకున్నాను. కాని, ఒక టెలిఫోన్ అమ్మాయి మాత్రం నాకోసం ఎంతో అభిలాష పడేందని దరిమిలాని విన్నాను.

మొదటి ఇద్దరూ ఎందుచేతనో పెళ్ళి అనే పచ్చి వెలక్కాయకి మాత్రం ఇష్టపడినట్లు కనపడరు—ఏమైతేనేమి, వర్తమాన కాలంలో ప్రసూతి టేబిల్ మీదున్న అమ్మాయినే పెళ్ళిచేసుకోవడం జరిగింది. అలాగే వుంటాయి పెళ్ళిళ్ళు ..

టకటకమంటూ వెళ్ళిపోతోంది నర్సు. లోని సమాచారం రవంతైనా నా చెవిని పడవేస్తుందేమోననే ఆశతో - ఆమె నడుస్తున్న దిక్కు - రెండడుగులు వేశాను. నోరు విప్పి అడగడానికి గొంతులో కుంకుడుకాయ లుండిపోయాయి!

అంతమాత్రం సభ్యత పాటించకుండానే ఆమె వెళ్ళిపోయింది...పాపం! వాళ్ళకి ఇది నిత్య పరిపాటి. ఆమెకు నావంటి ప్రియులు కొంకు పదిమందుంటే చాలు.. ఉద్యోగానికి రాజీనామా ఇస్తుంది.

గత్యంతరం లేక మామగారి ముఖం కేసి చూశాను. ఆయన కోరుకున్న అరగంట దాటి గంటన్నర అయింది. కొంతసేపటి నుంచి ఆయనకూడా నిక్కచ్చిగా కంగారు పడిపోతున్నాడు. గడియారం కేసి చూడడం మానివేసి ఆ దృష్టిని ఎక్కడో మానసిక ప్రపంచంలోని ఒక సూక్ష్మాతి సూక్ష్మ బిందువుమీదికి బలవంతాన్ని పోనిస్తున్నాడు.

ఉన్నట్టుండి - లోపల్నుంచి - గబగబా కొన్ని పిచ్చకేకలు...ఏడ్పు...కీచులాట... ఆయిదారు కంఠాల జంత్రసమ్మేళనం... ఒక ఒక్క మూలుగు ఒక యుగం పాడుగున సాగి అంతమయ్యింది.

నా గుండెల్లో దడ ఆగింది. మామగారు ఒక్క వురకలో నన్ను త్రోసుకుని ఒక గజం ముందుకువెళ్ళి నిలుచున్నారు. ఆయన స్నానం పూర్తిచేసినట్లున్నారు. నా కాళ్ళ సత్తువ కరిగిపోవడంవలన కుర్చీలో కూలపడే వున్నాను.

ఒక నర్సు గబగబా వచ్చింది— "మొగ పిల్లాడు......" అని గిరుక్కున వెళ్ళిపోయింది.

అంతా నిశ్శబ్దం...కాలం పరుగెడుతోంది. మామగారు ఒక్క గజం స్థలంలో విసురుగా నడక సాగించేరు. ఆయన కళ్ళకి కూడా చెమటపడుతోంది...

పిల్లాడు - ఏడవలేదు—

ఆయన గొంతుకూర్చుండిపోయాడు. రెండు చేతులతోటీ చెవలనూ తలకాయనూ సవరించుకోసాగేడు...

"పోనీ-లే...అమ్మాయి??" అనిమాత్రం ఒకసారి అన్నాడు కాబోలు...

ఏమో - కీచుమని లోపలనుంచి ఏదో ధ్వని వచ్చింది. ఎలక పిలిచినట్లయింది - గాలిలోంచి...

ఏదో పెద్దబరువు తీరినట్లయింది నాకు. మామగారి ముఖంలో రక్తం కదిలింది. లేస్తూ ముసిలాయనకేసి చూశారు. ఆయన భగవంతుడి కోసమన్నట్లు ఒక్క సానుభూతి దరహాస రేఖ చదివించుకున్నాడు. ఆయన మనసుకూడా పాపం కుదుటబడింది.

ఇప్పుడు స్మృతికి వచ్చింది కాబోలు, మామగారు గడియారం కేసి దృష్టిపోనిచ్చి, ముసిలాయనతో కలిసి కూడికలూ తీసివేతలూ కొంతసేపు చేశారు.

నా కేసి తిరిగి అన్నారు మామగారు:

"వాళ్ళెన్ని మందులు వాడేది...మన తెలుగు మాత్రలు కొన్ని పడితీరాలి... ముందు ముందు పిల్ల శరీరానికి మంచిది..."

ఒక మూల్గుమాత్రం నానించి జవాబు.

"కనీసం ఒక్క పడేనా పడాలి—"

"ఏం మాత్రలు?"

"సూతికా భరణం అని—"

"ఓహో—!"

★ సూతికా ప్రకరణం

"సూతికా వ్యవహారాలలో - అంటే ప్రసూతి బాధవలన, తదితర కొన్ని దోషాల వలనా వచ్చే అన్నింటికీ ఒకే వజ్రాయుధం..."

ఆయనేదో ఇంకా ఉపన్యసిస్తూనే వున్నాడు.

నేనంతా వింటున్నానని చెప్పలేను. ఈ పేరు నాకుకూడా పరిచయమైనదిలాగే వుంది. మా తాతయ్య చెప్పగా విన్నానో లేక ఏ కేట్లాగులో నన్నా చూశానో.

"అవి తెప్పించేరా" అని మాత్రం అనగలిగేను.

"మాశురోజులయింది- దగ్గరేవున్నాయి. మీ అమ్మగారు రాగానే ఇస్తారు—"

ఎవరో ఒక సానుభూతి పేరంటాలు వరండాలోకి వచ్చి నన్ను చూస్తూ నిలిచింది ఏదో కాస్తసేపు తనలో తను మాట్లాడుకుంది...

"ఇంతకీ చాలా అదృష్టవంతులు నాయనా! కొన్ని మొత్తంమీద చాలా సజావుగా అయింది!"

పాపం! ఈవిడ తెలుసు అమ్మాయి ఎవరో ఇంకా బాధపడి తీరని కాలోలు—

"పిల్లాడు ఒక్కడుగా వున్నారు. చాలా సేపు ఏడవలేదు నాయనా. డాక్టరమ్మ ప్రాణం పోసింది. ఇలా తల్లిని నర్సులి కప్పగించి పిల్లాణ్ణి కాళ్లుచ్చుకుని నీళ్ల జేసిన్లో బోర్లా పారేసింది. పిర్రలమీద టపటపా బాదింది. గిరగిర తిప్పేస్తూ అంతెత్తుని గాల్లో ఎగరేసింది. అప్పటికి ఒక్కసారి కేమన్నాడు. నల్లగా పుట్టిన పిల్లాడు మెల్ల మెల్లగా ఎర్రపడి పసపసపండులా అయ్యేడు"—

ఈమె మాటలను నిదర్శనంగా లోపల ఎక్కడినించో ఒక దంటిపిల్లవాని రాగాలాపన హృదయానందకరంగావినవచ్చింది.

ఆవిడ పురాణం చెపుతూనేవుంది, నామ గాగుకూడా ఒక మంచిశ్రోత. "పిల్లాడేంటికి ఏడవకపోయేసరికి, ఆ పిల్ల, అంత బాధా మరిచిపోయి "ఇంకా ఏడవడేమండీ డాక్టరుగారూ!"అంది!.. డాక్టరు నవ్వుతో, ఒకవంక పిల్లాడితో అవస్థపడుతూనే, 'అబ్బ! అప్పుడే ఎంత మమకారం పుట్టుకొచ్చింది! ఇంతసేపు నిన్నేడిపించాడా— ఒక్కక్షణంఆగు ముద్దుపెట్టుకుందువుగాని-' అంది..."

మా మామగారడిగిన ఒక సామాన్యమైన ప్రశ్నకు, ఆమె తన్మయ రసానుభూతినుంచి ఒక్కసారి ఆసుపత్రిలోకానికి దిగజారి .

"ఆ రెండో అమ్మాయికి అప్పుడే మసుదొచ్చే కళలు లేవంది. పాపం.. పెద్ద డాక్టరుగారి దగ్గిర్నుంచీ తొందరపడుతున్నారు." అంటూ ఏదో రాజకీయ రహస్యం వెల్లడిస్తున్నట్లు అతి మెల్లగా చెప్పింది. "ఇంక మా మరదలు విషయమంటారా? జైమురాలేదు ఇంకో రెండు మూడురోజులు బాధపడాలి.. పురుళ్ళ వ్యవహారంలో ఆ పరమేశ్వరుడి దయవుండాలండి"అంటూ తను వ్యక్తిగత స్థితికూడా కొంత చదివించుకొని తెర వెనక్కలకి తొలగిపోతోంది.

ఈవిడ ఉపన్యాసంలోని రెండో భాగం మామగారు వినలేదు ముసలాయనకు —ఒక ముందు ముందు అవసరంకొచ్చే కొత్త శక్తిని యథాశక్తిని ఇమ్ముకోవడంగానే— ప్రయత్నిస్తున్నట్టున్నారు.

నా శరీరం తేలికపడిపోయింది ఆవేదన, బాధ అన్నీ అయిపోవడంవలన ఒకవంక నిద్రనీరసం వస్తున్నా— ఇలా పచారుచేస్తున్నాను

ఈ వరండాకూడా ఇంక రకరకాల మనుష్యులతో నిండిపోయి తన ఏ కొంత వాస్తవత్వాన్ని పోగొట్టుకుంటుంది. నాకు దీనితో ఈ ఒక అర్థరాత్రి బాదరాయణ సంబంధం ఎందుచేతను వచ్చిందో.

ఇంతసేపు నన్ను భరించిన కుర్చీని కృతజ్ఞతతోనూ సంతృప్తితోనూ పురస్కరించి మామగారికేసి నడవబోతున్నాను. ఆయనే నావంక వస్తున్నారు—ఆ ముసలాయన, మామగారినుంచి సంక్రమింప జేసుకున్న యోగాభ్యాసం ప్రారంభిస్తున్నారు. పాపం! ఇక ఆయన వంతు—

సహకార సానుభూతులు లేని ప్రసవ బాధను అనుభవించడానికి!

ఇంతలోనూ—

తెల్లవారగట్లు కనపడిన మురళి నవ్వు చిరునవ్వు ముఖంతో మావేపు వస్తూ కనపడింది

నిరెండ కిరణాలు ఆమె తెల్లటి 'యూనిఫారం' మీదా ముడతలుపడిన నల్లటి ముఖం మీదా కవిత్వ సౌందర్యాన్ని ప్రసాదిస్తున్నాయి.

భార్య: అద్దంబీరువా, క్రింద పడి పగిలిపోయిందండీ. ఏడేళ్లు అష్టకష్టాలు పడవలసి వస్తుంది గదా అని విచారంగా ఉంది.

భర్త: నాన్సెన్స్! ఇదంతా అబద్ధం. ఒకావిడ వెనక ఇల్లానే అద్దం బద్దలుకొట్టి అనుకుంది. కాని ఏడేళ్లూ ఎంతమాత్రంకష్ట పడలేదు.

భార్య: మరి!

భర్త: మూడో ఏడు సునాయాసంగా కాలధర్మం చేసింది.

యం. వి. సీతాపతిరావు, బందరు

భక్తి ప్రపత్తులతో, కృతజ్ఞతతో వినయాదికలతో చేసి మామగారూ ఆమెను అభినందనం ప్రారంభించేను.

ఆమె మొదట్లో నవ్వి, మా యిద్దరిముఖాలకేసి చూసుకు వెళ్లి, బల్లమీద యోగ రిజిస్టర్లో నా పేరున్న ముసలాయన్ని చూపెట్టింది

'తాతగారూ! మీకు మనవడు పుట్టేడు. ఉదయం మూడుగంటల - 6-14 నిమిషాలయింది. తల్లీ పిల్లాడూ హాయిగా వున్నారు. పురుడు చాలా సజావుగా అయింది—"

అంటే, నావంక తిరిగింది.

"మళ్లీ పది నిమిషాలించి నొప్పులు ప్రారంభమయ్యేయి. ఇంకో అరగంట వస్తాయేమో కొన్ని జాగ్రత్తగానే జరగవచ్చు - అధైర్యపడకండి."

మేమిద్దరం స్తంభాలయ్యాము. ఒకరొకరం కూడా చూసుకోలేదు.

కలియుగం ప్రథమ పాదం గడచి ద్వితీయ పాదంలో అడుగు పెట్టింది.

"పునర్జన్మమే అనుకున్నాం" అని ఏమైనా కండొకవేళ ఎవరికన్నా సందించబోతున్నట్లు ప్రవచించిన మామగారి సంకల్పం—"

విశేషంగా ఒక్కసారిగా ఒక సందర్భంలో అలా ఇలా తడుముతూ ప్రారంభించెను:

"నర్సుగారూ! ఓ రెండు మాత్రలిట్టు ఇప్పించండి ఇంక పడలేను ఇది అంతకన్న ఎంతికన్న బాధింపబడుతోంది... కాళ్లల్లో సత్తా పోతోంది అలా చూస్తారేం? వజ్రాయుధం.. రెండు మాత్రలు సూతికాభరణం .." ★

[illegible]

(మరాఠీ కథ)

రోజూలాగే వరణక్క చీకటితో నిద్ర లేచింది. తలుపు ఓరగా తీసుకొని ఉమ్మడి పంచపాళీలోకి వచ్చింది. ఎండిపోయిన మోడులాగా ఉంటుంది వరణక్క. ఎముకలగూడుపైన తోలు కప్పినట్లు వళ్ళంతా ముడతలుపడి ఉంటుంది. అయితే అంతమాత్రాన బలహీనంగా ఏమీ కనిపించదు. ముడికొయ్యలాగా గట్టివరస మనిషి. పీచు జుట్టంతా ముడిచి ఒకప్రక్కగా కొప్పు పెట్టుంది. ఆ కొప్పు వాలకంలోనే ఆమనిషి స్వార్థపరత్వం స్పష్టమౌతుంటుంది.

అలవాటుకొద్దీ అటూ ఇటూ నక్కి నక్కి దొంగచూపులు చూసి ఉమ్మడి స్నానాల గదికేసి బయలుదేరింది. తొందర తొందరగా, చిన్న చిన్న అడుగులు వేసుకుంటూ మునికాళ్ళమీద నడవటం ఆమెకు అలవాటు. ఎవరో వెంటబడి తరుముతుంటే తప్పించుకొని పారిపోతున్నట్లుఉంటుంది ఎప్పుడూ.

ఆ ఉమ్మడి పంచపాళీలో పారుగు భాగంలో ఉండే మధుకర్ దారికి అడ్డంగా పడి కాళ్ళు బారజాపి నిద్రపోతున్నాడు. వరణక్క నోటికి పని చెప్పేందుకు ఆమాత్రం కారణం నిక్షేపంలాసరిపోతుంది. దండకం ఆరంభించింది. "ఇదేం ఆగడమంట? కాస్త నడిచేటందుకన్నా దారి ఉండాలా అక్కర్లేదా? ఇదేం నలుగురూ తిరిగే పంచపాళీయా మరొకటా? అందరూ ఇచ్చేది వెండి రూపాయిలున్నూ నే నిచ్చేది చింతపిక్కలూనా ఏమిటి రాత? ఆ మాటకొస్తే అద్దె ఎవళ్ళిస్తున్నారో, ఎవళ్ళివ్వటం లేదో కూడా నాకు తెలుసు. ఇంకా కావాలంటే కొంతమంది రెండు నెలలనుంచి అద్దె ఇవ్వటం లేదు. ఆగుట్టు కాస్తా కనక బయట పెట్టానంటే..."

ఇలా ఎంతవరకు పోయ్యేదో కాని ఇంతలో ఆమె కళ్ళు మధుకర్ పక్కమీద పడ్డాయి. మరి మాటలు సాగలేదు. తలగడ క్రిందనుంచి మధుకర్ వాచీ బైటికి జారి ఒకపక్కన పడిఉన్నది. ఎరమీదికి దూకపోయే పిల్లిలాగా వరణక్క వంగి మెల్లగా దగ్గిరికి జరిగింది. కనురెప్పపాటులో వాచీ మాయమైంది.

సవ్వడి లేకుండా వరణక్క అక్కడినుంచి నీడలా కదిలిపోసాగింది. కాని ఇంతలో తట్టి లేపినట్లుగా మధుకర్‌కు తెలివి వచ్చింది. దిండు కిందికి చెయ్యి పోనిచ్చి చూశాడు. "వాచి, అయ్యో! నా వాచీ, దొంగ—దొంగ" అని కేకలు వేయటం మొదలుపెట్టాడు. వరణక్క నెత్తురు గడ్డ కట్టిపోయింది' రాతిబొమ్మల్లే నిలబడిపోయింది. బడితె దెబ్బలు తినటానికి సిద్ధంగా ఉన్న గొడ్డులాగా నడ్డి వంచి నిలబడింది. ఏ విధంగా ఈ విపరీత విపత్కర పరిస్థితినుంచి తప్పించుకు బయటపడాలా అని జిత్తులమారి బుర్ర ఉపాయం వెతుకుతునే ఉన్నది. కాని ఏదైనా మంచి ఉపాయం తట్టేదాకా ఉండబట్టలేకపోయింది. వెంటనే తోచిన ఉపాయం ప్రయోగించాలనుకున్నది. ఏమీ ఎరగనిదానిలా సన్నగా నవ్వుతూ "ఏం మధూ!

ప్రొఫెసర్ గంగాధర్ గాడ్గిల్

ఏమిటి బాబూ? పీడకల ఏమయినా వచ్చిందా?" అని అడిగింది.

ఉహూఁ! ఈ ఉపాయం ఏమీ పని చేయలేదు. బుర్ర పనిచేయటం లేదని, తుప్పు పట్టిపోతున్నదని అనిపించింది. దాంతో మరింత చీకాకు పడింది.

మధు కోపంతో మీదికి దూకినంతపని చేశాడు. "ఏదీ, నావాచీ ఎక్కడ పెట్టావు? చెప్పు. నావాచీ నాకిచ్చేయి" అని గట్టిగా, మొరటుగా అరిచాడు. వరణక్క గజగజ వణికిపోయింది. కాని తెలివితేటలుగా వెనుకపెట్టుకొన్న చేతుల్లోంచి వాచీని మెల్లిగా జారవిడిచింది. ఆ వాచీ అయినా నిశ్శబ్దంగా ప్రక్కమీద పడవలసింది. కింద పడింది. కొంచెం చప్పుడయింది. మధు ఆ చప్పుడు విని, ఆదరాబాదరా వాచీ పైకి తీశాడు. అమాంతం కొట్టబోయినట్లు చెయ్యి పైకెత్తి "అరవైఏళ్ళు వచ్చినాయి దేనికి ఛీ! సిగ్గన్నా లేదు నీ జన్మకాల" అన్నాడు.

వరణక్క పెద్దగొంతు పెట్టుకొని సగం ఏడుపుగా అరవటం మొదలుపెట్టింది. "అయితే నేను దొంగతనం చేశానంటావా ఏమిటి? లేనిపోనిది నాకు దొంగతనం అంటగట్టాలని చూస్తున్నావా! అరవైఏళ్ళ ముసలిముండను నన్ను దొంగదాన్ని చేస్తావా? అయ్యో. అయ్యో. దారిలో కాలికి అడ్డంగా తగిలినా నేను తీసుకొనేదాన్ని కాదు తెలుసా?"

దీంతో మధుకి మరింత మండింది. రెండు రెక్కలూ పట్టుకొని మనిషిని ఊపుతూ "నోరుమూస్తావా లేదా? నీ నంగనాచి వేషాలు నాదగ్గర వెయ్యబోకు" అన్నాడు.

వరణక్క ఉన్నపళంగా నేలమీద పడి "అమ్మోయ్! బాబోయ్! నన్ను వీడు చంపేస్తున్నాడురోయ్ - ప్రాణాలు తీస్తున్నాడురోయ్" అనికేకలు వేస్తూ గోల మొదలు పెట్టింది.

మధుకి ఏం చెయ్యాలో తెలియలేదు. మొగం వేలాడవేసుకొని నిలబడ్డాడు. చుట్టుపక్కల భాగాలవాళ్ళు కొంతమంది తలుపులు తీసుకొని ఏమిజరిగిందంటూ బైటికి వచ్చారు.

"వరణక్క దొంగతనంగా నా వాచీ ఎత్తుకుపోతున్న"దని మధు చెప్పాడు. ▪

★ విషవృక్షం ★

వరణక్క ఇంకా అలా అరుస్తూనే ఉన్నది. కాని వరణక్క మనసులో ఒక చిత్రమైన మార్పు వచ్చింది. తాను చేస్తున్నదంతా వట్టి నటనే నన్న విషయం మరిచిపోయింది. నిజంగా తన్ను మధు హాత్య చేస్తున్నట్లే మనస్సుకి తోచింది.

"ఒరేయి వినూ! వినయా!" అంటూ కొడుకును పిలిచింది. కొడుకు వచ్చాడు. "వాడు చూడు - వాణ్ణి పట్టుకొని తలకాయ చితకపాడు" అని మధుని చూపించింది.

వినూ చాలా నెమ్మదిగలవాడు, ఎవరి జోక్యమూ లేకుండా ఒంటరిగా ఏదో ఒక మూల పడిఉండాలనే స్వభావం కలవాడు. ఇటువంటి పరిస్థితుల్లో వినూ చేసేది, చేయగలిగింది ఏమీ ఉండదు. మొగం దేబిరించుకొని ఒకపక్కన నిలబడ్డాడు.

కొద్ది నిమిషాలపాటు అంతా తికమక అయిపోయింది. సరిగా అటువంటప్పుడే వరణక్క బుర్ర సరిగా పనిచేస్తే జారిపోవలసింది. కాని వరణక్కను ఏదో ఆవేశించినట్లయింది. నిజానికి నటనకి మధ్య చాలా సున్నితమైన హద్దుఉంది. వరణక్క మనస్సు తటపటాయించింది. నిజంగా తనకేదో పెద్దహాని జరిగిపోయినట్లు, భయంతో, కోపంతో, అరుస్తూనే ఉన్నది. జనం చాలామంది పోగైనారు. ఈవిధంగా వరణక్క వ్యవహారం చాలావరకు ముదరబెట్టింది.

చివరికి ఈ వ్యవహారాన్ని అక్కడికి చేరినవారిలో పెద్దవారు, కొస్త పలుకుబడి గలవారు పూనుకొని పరిష్కరించవలసి వచ్చింది. "ఇదిగో, ఈ తమాషా కనక ఇక్కడితో నీవు నిలుపుచెయ్యకుంటే పోలీసులను పిలిచి నిన్ను ఒప్పగించే మాట ఖాయం" అని స్పష్టంగా తేల్చి చెప్పేశారు.

ఈ ఆయుధం మహా బాగా పనిచేసింది. వరణక్క అంత గల్లంతు మాని ఒక్కసారి మళ్లీ ప్రపంచంలోకి వచ్చింది. పోలీసులంటే వరణక్కకు అపరిమితమైన భయం. తాను చేసిన ఇంత గొడవ కళ్లముందు కట్టినట్లు కనిపించింది. తన తెలివితక్కువ చక్కగా అర్థం చేసుకున్నది. తెగ గొణుక్కుంటూ, చప్పున లేచి, స్నానాల గది కేసి చరచరా వెళ్లిపోయింది.

ఈ గొణుగుడు వరణక్కకు మామూలుగా ఉన్న జబ్బే. పెద్దదిగదా కృష్ణా, రామా అంటూ జపం చేసుకుంటున్నదో, ఏమయినా మంత్రాలు చదువుకుంటున్నదో ఏమో లెమ్మని అంతా అనుకుంటారు. కాని నిజానికి అవన్నీ శాపనార్థాలు—తక్కిన వాళ్ళంతా నాశనమైపోవాలనే కోరిక.

స్నానాలగదినుంచి తిరిగివస్తూ మధుకర్ గుమ్మంముందు ఒక నిమిషం ఆగి, కొన్ని మేలురకం శాపనార్థాలు పరిశుష్టంగా వల్లించి, మరి అక్కడ నిలవకుండా గబగబ వచ్చి తనభాగంలో దూరింది. వరణక్క నివాసానికి రెండుగదులు ఉన్నాయి. గుమ్మంలో నుంచి లోపల అడుగుపెట్టటంతోనే తలుపు ధడాలున మూసి, ఎదురుగా కనబడిన కొడుకు మీదికి సాగించింది ఆ తక్కిన రోషాన్ని. "నువ్వూ ఒకమనిషివేనా? కనిపెంచినతల్లిని పట్టుకుని నలుగురిలో నానా అవమానంచేసి ప్రాణాలుతీయటానికి సిద్ధమౌతుంటే గుడ్లప్పగించి, దేబిరిగొట్టు మొగమేసుకొని నిలబడ్డావు. చీడపురుగును చూసినట్టు నన్ను నలుగురూ కొట్టి, తిట్టి, చీదరిస్తుంటే బడుద్ధాయిలాగా, మొగతనం లేనివాడులాగా తమాషాచూస్తూ నుంచుంటావుట్రా? అంత వాడికి గాజులు తొడిగించుకొని అఘోరించకపోయినావూ?"

వరణక్కకు కోపంతో తిక్క ఎత్తిపోయింది. తను పిలవగానే కొడుకువచ్చి ఏదో హడిచేస్తాడని అంత ఆశ పెట్టుకొన్నదయ్యో పాపం! వాడికోసం తాను అష్టకష్టాలుపడ్డది. కన్నది - పెంచింది - రెండక్షరం ముక్కలు చెప్పించింది. వాడికోసం - వాడుకావాలన్న దల్లా తెచ్చి ఇచ్చేటందుకు - అబద్ధాలాడింది. మోసం చేసింది - ఆఖరికి దొంగతనాలుకూడా చేసింది. ఇంత కష్టపడితే వీడు చివరికి వట్టి పనికిమాలిననావ అయినాడు. కోపం వచ్చి తిట్టిందంటే, మరి ఆమాత్రం తిట్టదూ?

వినూ ఈ తాకిడికి జంకిపోయినాడు. రెండు కణతలు చేతుల్లో పట్టుకొని, ఈ జడివాన ఇంకా ఎంతసేపటికి ముగుస్తుందా భగవంతుడా అనుకుంటూ ఒకచోట కూలబడ్డాడు.

పాపం వినూ చాలా నెమ్మదైనవాడు, ముభావంగా ఉండేవాడున్నూ. ఒక లాండ్రీలో పనిచేస్తున్నాడు. పగలంతా పనిచేయటం, రాత్రిపూట కొంచెంసేపు నలుగురు స్నేహితులతోను సరదాగా కాలక్షేపం చేయటం - అతని కార్యక్రమం అది. అంతా గుడిమండపం దగ్గర చేరి ఆ కబుర్లు, ఈ కబుర్లు చెప్పుకుంటూ తమ హాస్యోక్తులకి తామే నవ్వుకుంటూ పొద్దు వెళ్లబుచ్చుతుంటారు. రెండు బీడీలు తగలేసి, అదే పెద్ద మహారాజభోగంగా తృప్తి పడుతుంటారు. అలా కొంతసేపయిన తరువాత మెల్లిగాలేచి వినూ కొంపకు చేరుకొని, అమ్మపెట్టిన నాలుగు మెతుకులూ తిని పక్కమీదికి చేరతాడు. పక్కమీద వెల్లకిలా పడుకుని చిన్నచిన్న ఊహలు ఆలోచనలుచేస్తూ ఉంటాడు. కొంతసేపయ్యేసరికి మరి ఆలోచించేటందుకు ఏమీ లేకుండా పోతుంది. గుండె లోతుల్లోనుంచి ఏమిటో గుబులు బయలుదేరింది. కాని ఆ పాటికి జోకొట్టినట్లు నిద్ర వచ్చేస్తుంటుంది. తెల్లవారి లేచేసరికి మళ్లా లాండ్రీలో పని సిద్ధంగా ఉంటుంది.

అలాంటివాడు వినూ. తనదారిని తన్నేదో పోనిస్తూఉంటే వినూకి దిగులు, చింతా లేకపోను. వరణక్క నోరు ఊరుకోదు. అదనీ, ఇదనీ, మధ్య మధ్య చిన్నదీ పెద్దదీ దీవిస్తూనే ఉంటుంది. వినూకి ఇది బొత్తిగా ఇష్టంలేదు. ఏదోఒకటి చేసి ఈ విషయం ఏమిటో అంతుతేల్చుకోవాలని మనస్సులో అనుకుంటూ ఉంటాడు. కాని ఆమాత్రం గుండె ధైర్యం లేదు. లేదని కూడా తెలుసు. అందుచేత ఇంకోదారి లేక నోరు మూసుకొని అనుభవిస్తూ "దేనికైనా

రోజా రావాలి. అనాడు ఈవిషయ మేమిటో శాంతంగా కనుక్కుంటాను" అనుకుంటూ తృప్తిపడుతుండేవాడు.

ఆనాడు కూడా అలాగే ఆ రోజాకోసమే ఎదురుచూస్తూ, మాతృదేవి నోటినుంచి వచ్చే ఆ శాపనార్థాల జడివానలో నానుతూ కూర్చున్నాడు. కాని ఉండి ఉండి ఒక్కసారి బుర్రకి మెరుపులాగా ఒక ఆలోచన తోచింది. అసలు ఆ రోజాకోసం ఎందుకు వేచిఉండటం? ఎంతమాత్రం అవసరంలేదు. ఈ రోజే ఆ రోజా ఎందుకు కాకూడదు. దినాలలో పేరుకొనిపోయి ఉన్న కోపం అంతా కరిగి ఉప్పొంగింది. తుట్టె కదిలిస్తే తేనెటీగలు లేచినట్లు బుర్ర చిరచిరలాడింది. చాలా ప్రశాంతంగా, ఖచ్చితంగా తేల్చి చెపుతున్నట్లు తల్లికి చెప్పేశాడు. "అమ్మా! నేనొక మాట చెప్తున్నా విను. నీ గోల నూరీ భరించటానికి వీలు లేకుండా ఉన్నది. ఊరుకున్నన్నాళ్లు ఊరుకున్నాను. ఇక మీదట ఎంతమాత్రం ఊరుకునేది లేదు. నువ్వు ఇంకా ఇలాగే గొడవ చేశావా, ఇంట్లోనుంచి వెళ్లిపోతాను. నీ ఇష్టం."

వినూ జన్మలో ఇలా మాట్లాడతాడని వరణక్క [illegible]లోనైనా అనుకోలేదు. ఆశ్చర్యపడిపోయింది. భయం పుట్టింది. అయితే ఏదో ఒక సంచలనం కూడా వరణక్క మనస్సులో కలిగింది. ఒక్కగానొక్క కొడుకు - వాడికోసమే తాను ఎన్నిపాట్లు పడ్డాను, అలాంటి కొడుక్కు తనవల్లనే సుఖం లేకుండా పోతున్నది అని వరణక్కకు తెలిసివచ్చింది. కొడుకంటే వరణక్కకు ఎంతో ఆపేక్ష ఉన్నది. ఆ కొడుకు లేకపోతే తాను ఒంటరిదైపోతుంది. అప్పుడు తనకు సుఖమేమి ఉన్నది. ఒక నిమిషం పాటు వరణక్క మనస్సు ఆర్ద్రమైపోయింది. తన తప్పు ఒప్పుకోవాలనిపించింది. కొడుకును దగ్గరికి తీసుకొని తలను నిమురుతూ "నాయినా! నేను ఎందుకు ఇంత కష్టపడుతున్నాను? ఎందుకు ఒళ్ళు వంచి పనిచేస్తున్నాను. నీకోసం. నీకోసమేగదరా బాబూ. నువ్వే నన్ను వదిలిపెట్టి వెళ్లిపోతే, నేను బతకవలసిన అవసరమే ఉండదు. నాబతుకు తల్లి స్తూరాకుకన్నా కనా కష్టమైపోతుంది" అని చెప్పాలని తహతహలాడింది.

ఇంత ఆపేక్ష పొంగులాగా వచ్చింది కాని అలాగే పోయింది. వరణక్క చిన్నప్పటినుంచి సుఖంగా ప్రశాంతంగా బతికినమనిషి కాదు; ఎండి మోడైపోయిన ఆమె హృదయంలో ఇలాంటి సున్నితములయిన భావాలు, భావోద్రేకాలు ఎప్పుడైనా కలిగినా క్షణమో, అరక్షణమో నిలిచి పోయేవే కాని తిష్టవేసి ఉండవు. నిక్కృష్ట, అనుభూతులుపొంది జీవితంలో చేదుమేసిన వరణక్క మంచితనానికి, ఆపేక్షలకు మంచి ప్రయోజనాలు కలుగవని గట్టిగా తెలుసున్నది. ముగ్గురుపిల్లలు జాడ్యంవచ్చి ఒకరి తరువాత ఒకరుగా వరసనే చచ్చిపోయినారు. తాను కంటికి మంటికి ఏకధారగా ఏడ్చింది. ఆ కన్నీళ్లు దేవుడి రాతిగుండెను కరిగించలేకపోయినాయి. పైగా భర్తను కూడా ఎత్తుకొనిపోయినాడు. మరిది ఇంట్లోనుంచి తన్ని వెళ్లగొట్టాడు. తలదాచుకోవటానికి తన అన్న పంచనచేరితే, ఆ అన్న దాసీదాన్ని చూసినట్లు కుక్కను చూసినట్లు నీచంగా చూశాడు. ఇన్ని కష్టాలలో తన ఆపేక్షలు, మంచితనం దమ్మిడీఎత్తు అక్కరకు రాలేదు. చివరికి తాను బొంబాయి వచ్చి వంటమనిషిగా కుదిరినప్పుడో! తన మంచితనంవలన ఎర్రటిఏగాని ఎక్కువ రాలేదు. కాకపోతే తాను మంచిగా కనిపించినకొద్దీ, తనచేత చాకిరీ ఎక్కువ చేయించుకున్నారు. అంతే. మాయ మోసం తనకు కొన్ని లాభించినాయి. ప్రతివాడు ఒకచిన్న అనుభవాన్ని పట్టుకొని దాన్ని పట్టి ప్రపంచమంతా ఇంతేనన్నట్లు ఒక సూక్తితయారుచేసి,విజ్ఞానమంతా దాంట్లోనే ఉన్నదంటారు. వరణక్క తానూ కొంత అనుభవం గడించింది. తాను ఆ అనుభవాలని బట్టి నేర్చుకొన్నది ఇది. ఈ విషయంలో ఆమె ఎవ్వరికీ తీసిపోలేదు. స్వార్థం, జగడాలమారితనం ఆమె స్వభావంలో జీర్ణించిపోయినాయి.

అయితే ప్రతివారి స్వభావంలోనూ ఉన్నమాదిరే ఆమెకు అంతరాంతరాలలో కొడుకంటే ప్రేమగా ఉండాలని, ఆ ప్రేమను వెల్లడించి సంతోషపెట్టాలని ఉన్నది. వినూ తలవంచి కాలివేళ్ళకేసి చూస్తూ కూర్చున్నంతసేపు, కొడుకుపైన ఆమె కెంతో ప్రేమ పొంగిపొంగి వచ్చింది. మెల్లిగా, ఆ ప్రేమతోనే మాట్లాడాలని అనుకున్నది. కాని అలా మాట్లాడటం

★ విషవృక్షం ★

ఆమెను ఆదినుంచీ అలవడలేదు. ఆ అలవాటును కాదని కొత్తగా ప్రవర్తించటమూ ఆమెకు కుదరలేదు. అకస్మాత్తుగా వచ్చిన ఆ ఆర్ద్రభావం అణుమాత్రం మిగలకుండా ఇంకిపోయింది. తాను ఏం చేయదలిచిందీ, ఏమి చేస్తున్నదీ కూడా తెలియకుండా మామూలు ధోరణిలో మళ్ళీ ప్రసంగం ఆరంభించింది. “నువ్వు చచ్చినా పీడా వదిలిపోయేది. నీకోసం అడ్డమైన చాకిరీ చేసి నా ఎముకలు విరిగిపోతున్నాయి. నా నెత్తురు పంచుకు పుట్టినవాడివి. ఇప్పుడు నువ్వు పెద్దవాడివైపోయినావులే. ఇంకా నా అవసరం నీకేముంది? చిరిగిపోయిన చొక్కాను తీసేసినట్టుగా నన్ను తీసి పారేద్దామనుకుంటున్నావు. నువ్వు ఉట్టి పశువ్వి. గొడ్డువి”

రవణక్కకు కోపం ఆగలేదు. తల నేలకేసి బాదుకోవటం మొదలుపెట్టింది.

వినూకి ఓపిక క్షీణించిపోయింది. అక్కడ నిలబడలేకపోయినాడు. చటుక్కున లేచి నిలబడి “ఇదంతా నా తెలివితక్కువ. నాది పొరపాటు సరేనా? నీ కాళ్ళు పట్టుకొని సాష్టాంగ నమస్కారం చేస్తాను. నన్ను క్షమించు” అంటూ చొక్కా తొడుగుకొని, టోపీ పెట్టుకుంటూ బయిటికి వెళ్లిపోయినాడు.

ఈ జగడాలన్నీ వరణక్క చేసే పనికి అడ్డంరావు. పైగా పనులన్నీ ఇంకా చకచకా చేస్తుంది. అప్పటిదాకా వరణక్క దినకృత్యాలు చేస్తున్నది. వినూ వెళ్లిపోయిన తరువాతకూడా ఆ పనులు అలాగే సాగించింది. కాకపోతే మాట్లాడటం మాత్రం మానేసింది. అదే తేడా.

మామూలు పనులన్నీ చక్కబెట్టటం పూర్తిఅయింది. టీ కాచింది. వినూ ఇంకా రాలేదు. సాధారణంగా వినూ టీకి ఎప్పుడూ ఆలస్యం చేయడు. కాని ఆరోజున టీ చప్పగా చల్లారిపోయింది. అప్పటికీ వినూ రాలేదు. ఇలా అవుతుందని వరణక్క అనుకోలేదు. ఆదుర్దా ఎక్కువైంది. గాభరా పడింది. వంటగదిలోకి బయటికి పదిసార్లు తిరిగింది. మాటిమాటికి కిటికీలోనుంచి వస్తున్నాడేమో నని తొంగిచూచింది. ఒక నిమిషంసేపు మనస్సు ఆ మోసపు స్వభావం, దుశ్చింతనలనుంచి బయటపడింది. మారుపడిపోయిన చిన్నపిల్లలాగా గగ్గోలుపడి “ఇదంతా నా తప్పు” అని ఒప్పుకోవాలనిపించింది.

కాని, ఆమెది ఇటువంటి సరళమైన మనస్సుకాదు. ఒకవేళ ఎప్పుడయినా ఇటువంటి ఆలోచనలు వచ్చినా, వచ్చినవి వచ్చినట్లే తేలిపోతుంటాయి. ఇంతలోకే ఆమెకు ఒక అనుమానం పట్టుకున్నది. ఆ అనుమానం ఆమె మనస్సులోని మలిన, క్షుద్రభావాలలో తొలుచుకొని దారిచేసుకుంటూ పోయిపోయి, దుర్గంధ భూయిష్ఠమైన దురాలోచనలలో దూరి చోటు చేసుకున్నది.

ఎవరో తనకు చెరుపు కలిగించాలని ప్రయత్నిస్తున్నారు. తనకు కొడుకు ఉండటం, వాడు ప్రయోజకుడై, నాలుగు రాళ్లు సంపాదించి తనకు ముసలితనంలో ఆధారంకావటం ఎవరికో గిట్టటంలేదు. అందుచేత వాళ్లు తన కొడుకును తనకు కాకుండా చేస్తున్నారు. కొడుకుపైకి దుష్ప్రయోగాలు చేస్తున్నారు. ఈ విధంగా ఆ ఆలోచన సాగింది. అక్రిందటిరోజునే తన గుమ్మం దగ్గరగా దేవతకు బలిపెట్టిన అన్నం, కుంకుమ పడిఉండటం వరణక్కకు గుర్తువచ్చింది. అది తనపైకి ఏదో దుష్ప్రయోగం చేయటం కాకపోతే మరేమి అయిఉంటుంది. మొదనష్టపువాళ్లు, చూచి ఓర్వలేనివాళ్ళు పొరుగువాళ్ళే చేసిఉంటారు ఈ పని. ఆ బాపూ అతియా చూడరాదూ? కాని కొడుక్కు ఉద్యోగం సద్యోగం లేదు. వినూకి ఉన్నదీ ఇంకేం. చుప్పనాతి దానికి కళ్ళుమండి ఉంటాయి. భాగూ కాకా కొడుక్కు తండ్రి అంటే చిల్లిగవ్వంత లక్ష్యంలేదు. అందుకని వాడు ఎవరి కొడుకులయినా సరిగా ఉంటే కంట్లో కారం చల్లుకుంటాడు. ఇలాంటివాళ్ళు చాలామంది ఉన్నారు. వాళ్ల మొహాలు చూడటానికే అసహ్యం వేస్తుంది. వాళ్లందరూ కలిసి తనకు చెరుపు చేయాలని చూస్తున్నారు. వీళ్ల మొహాలు మండ. వీళ్ల మొహాన ఉమ్మేసినా పాపం లేదు. వరణక్కకు కోపం, పొంగిపొంగి తిట్లుగా విరుచుకు పడింది. ఈ ప్రవాహం ఉధృతంగా సాగుతున్నది. కాని మనసులో ఒక ప్రక్కనుంచి, జరిగిన దానికంతటికీ కారణం తానే నసే ఆందోళన, సంశయం మెలిత్రిప్పుతునే ఉన్నది.

వంటలక్కగా తన ఉద్యోగానికి పోవలసిన వేళ అవుతున్నది. ఆలస్యం అవుతున్నది. అలాగే కొడుకుకోసం కనిపెట్టుకొని కూర్చున్నది. ఈ పాటికి వచ్చేస్తుంటాడని ఆశ, అంతలోనే రాడేమోనన్న భయం, క్షణక్షణం ఎక్కువ అవుతున్నది. మనస్సు పట్టలేక పోతున్నది. ఎలాగైతేనేం వినూ వచ్చాడు. అదిరిపోతూఉన్న గుండెలు కొంచెం తేలికపడినాయి. ఒకే పరుగుగా వంటింట్లోకి వెళ్లింది. టీ వెచ్చబెట్టింది. తొందరతొందరగా తెచ్చి చేతికిచ్చింది. ఆప్యాయంగా కొడుకుతో మాట్లాడాలనుకున్నది. చేతనైనంత మృదువుగా మాట్లాడింది “చాలా ఆలస్యంచేశావునాయనా, గాభరా పడిపోయినాను ఇదుగో—టీతాగు— బాగున్నాయికదూ! నీకోసం ఇప్పుడే వెచ్చబెట్టి తెచ్చాను.” రహస్యం చెప్పినట్లుగా మెల్లిగా మాట్లాడుతూ చెప్పింది. “టీ చాలా బాగుంటుంది. ఇట్లా ఉంటే నీ కిష్టంకదూ! ఆ తేయాకు ఎంతమంచిదో తెలుసా? నేను పనిచేస్తున్నానే వాళ్ళ ఇంటినుంచి తెచ్చాను. గుప్పెడు ఆకు చీరకొంగు కింద ఎవ్వరికీ కనబడకుండా చాటుగా తెచ్చాను.” తన ప్రతిభను తానే మెచ్చుకుంటున్నట్లు సమర్థించుకుంటూ ఒకనవ్వు ఒలకబోసింది.

వరణక్క అనుకున్నట్లు ఈవార్త వినటం వలన వినూకి ఏమీ సంతోషం కలగలేదు. పైగా చాలాకోపంవచ్చింది. “అయ్యయ్యో! ఎలాగు నీతో ఇటువంటి దొంగతనాలు నీకెందుకు. చెప్పే నలుగురూ నువ్వు దొంగ

దానివని చెప్పుతుంటుంటె నేను తలకాయి ఎత్తుకొని తిరగలేకుండా ఉన్నాను."

ఇది వినూలో కొత్తగావచ్చిన మార్పు. వరణక్క సంపాదన వినూకి కావలసినతిండికీ, గుడ్డకి ఎంతమాత్రమూ చాలదు. అందుచేత వరణక్క అప్పుడప్పుడు అవకాశం పోగొట్టుకోకుండా ఇటువంటి పనులు చెయ్యవలసి వచ్చేది. ఇన్నిపేళ్ళు తల్లి తనని ఎలా పోషించిందో వినూకి తెలియకపోలేదు. అయితే, ఆ విషయమై ఎన్నడూ అతడు పట్టించుకోలేదు. తనకేవో కొన్ని విషయాలు కావాలి. ఆ జరుగుబాటు తనకి జరుగుతున్నది అంతే అతడు పట్టించుకొన్నది. కానిఇప్పుడు పరిస్థితులు మారినాయి. వినూకి లాండ్రీలో ఒక నిలకడైన ఉద్యోగం కుదిరింది. జేబులో నాలుగురాళ్లు చేతికి తగుల్తున్నాయి. తాను మర్యాదస్థుడిగా జీవించటానికి ఇప్పుడు అవకాశం ఉన్నది. సమాజంలో తనకూ

★ విషవృక్షం ★

ఒకస్థానం ఏర్పడిందనే విషయం అతనికి మనసులో మెదులుతున్నది. తాను సమాజంలో ఏ వర్గానికి చెందినవాడని తోచిందో, ఆ వర్గం వారి పద్ధతులు, అలవాట్లు ఒకటొకటే పట్టుబడుతున్నాయి. పెళ్లి చేసుకోవాలనే ఆలోచనకూడా అతనికి కలుగుతున్నది. తాను ఎవరుపడితే వాళ్లు పనిచేయించుకొనే వంటకత్తె కొడుకుమాత్రమే కాదు. ఇది అతని మనసులో కొత్తగావచ్చినమార్పు. ఈమార్పు ఒక శిశువువంటిది. శిశువును సాకినట్లు సాకితేనే ఇది బాగా కుదురుకుంటుంది. ఈ మార్పువలననే మొదటిసారిగా వినూ ఈరోజున తల్లిని కొద్దిగా ఎదిరించాడు. ఈసారి ఇంకా గట్టిగా ఎదిరించాలని వినూకి అనిపించింది.

వినూలో కలిగిన ఈ మార్పుకి వరణక్క దిగ్భ్రాంతి పొందింది. కుంగిపడింది. మళ్లీ జోరుగా తిట్లవర్షం కురిపించ సాగింది. "ఓరి గాడిదకొడుక! పుట్టగానే నువ్వు చచ్చినా పీడా వదిలిపోయేది. నన్ను దొంగదాని అంటావుట్రా? తల్లిని అనాల్సిన మాటేనా ఇది? ఎవడో నామీద నీకు లేనిపోనివన్నీ చెప్పి, విషం పెట్టున్నాడు. వాడి కళ్లు కాలిపోను! వాడి జిమ్మడ! ఒళ్లు హూనం హూనం అయ్యేటట్లు నీకోసం చాకిరీచేసి నేను చస్తుంటే, ఇదిట్రా నువ్వు నన్ను అనేమాట! నేను దొంగదాన్నా? నేను దొంగదాన్ని అయితే నువ్వెవడివిరా? నువ్వేం దొరవా? లాండ్రీకి వచ్చిన గుడ్డలు ఎత్తుకొచ్చి నీటుగా తొడుక్కొని తిరుగుతే నేరా? ఉతకటానికి వచ్చే గుడ్డలు వేసుకోవటం దొంగతనం కాదేం? నీ మంచితనం మాత్రం ఏ పేలాలు వేగింది?"

వరణక్క సంపాదించిన అనుభవం అంతా ఉపయోగించి ఈ విధంగా కొడుకు నోరెత్తటానికి వీలులేకుండా చించి చెండాడింది. వంచన, నేర్పు, నైచ్యం, అక్కసు అంతా చివరికి కన్నకొడుకుమీద కూడా ప్రయోగించి వాటిని సార్థకపరుచుకున్నది. ఇదంతా ఎందుచేత? తనకు అవమానం కలిగింది గనక! అందులో తన కొడుకుచేతిలో కనుక. కనీసం కొడుకయినా తనపట్ల సానుభూతిగా ఉండకపోతాడా అని ఆశించింది. అటువంటి కొడుకే అవమానించాడు.

వినూపై తెలియని కోపంలో తాను ఇంట్లో ఉన్నంతసేపు కొడుకుని తిట్టింది. వరణక్క ఇంట్లోనుంచి బయిటికి అడుగు పెట్టిన తరువాత వినూకి కొంచెం అవకాశం వచ్చింది. వినూ ఆత్మగౌరవం ముసలిదాని తిట్లతో తూట్లుపడింది. వినూ మళ్ళీ కాస్త తేరుకోవలసి ఉన్నది. అతనికి పట్టరాని ఉద్రేకం వచ్చింది. ఏదైనాసరే ఒకదాన్ని పట్టుకొని తుక్కుకింద కొట్టేయాలి. ఎవరైనాసరే - ఒకళ్లని డొక్కచించి డోలు కట్టేయ్యాలి. లేకపోతే అతనిలో కొత్తగా ఏర్పడిన ఆత్మగౌరవం దక్కదు. నిట్టనిలువుగా తన కాళ్లమీద నిలబడి, లోకానికంతటికీ ఎదురొడ్డి ప్రతాపం చూపించాలని తహతహలాడిపోయినాడు. జేబులో గలగలలాడుతూ చేతికి తగుల్తున్న ఆ నాలుగురాళ్లు తన్ను ఎంతో మెచ్చుకొనే ఆ పిల్ల - ఆ పిల్ల అతని స్నేహితుని చెల్లెలు - ఆ పిల్ల ముత్యాలలాంటి కళ్లు అవన్నీ కళ్లముందు మెదిలినాయి. ఏమయినాసరే ఊరుకోవటానికి ఎంతమాత్రం వీలులేదు. తల్లిపై మళ్లీ దెబ్బతీసి తీరాలి. ఈ దెబ్బతో తల్లి కుమిలి కుమిలి పోవాలి.

కొడుకు కుమిలిపోతున్నట్లే తల్లీ కుమిలిపోతున్నది. మనస్సు చెదిరిపోయింది. కన్నకొడుకుకూడా తన్ను దొంగదానిగా ఎందుకు కట్టాలో తెలియటంలేదు. తానేం కన్నాలు వేసిందా? బందిపోటు చేసిందా. దొరికిన వస్తువేదో చాటుగా ఎత్తుకొచ్చింది. ఆ పని ఎంతమందో చేస్తున్నారు. అప్పు చూడరాదు. పెద్ద ఉద్యోగస్థుడు - గొప్ప మర్యాదస్థుడు. అయితేనేం, బళ్లో చదువుకుంటున్న తన పిల్లలకి ఆఫీసులో పెన్సిళ్లు తెచ్చి ఇవ్వటంలేదూ? కష్టమ్స్ ఆఫీసులో పనిచేస్తున్న రఘూ కానుకలు తీసుకొని వచ్చి పెళ్లాని కివ్వటంలేదూ? రేషను షాపులో పనిచేస్తున్న సానూకాకా ఇంటికి పంచదార తెచ్చుకోవటం లేదూ? వీళ్లంతా దొంగలయినారా ఏమి? అదంతా మామూలు విషయమే. నలుగురూ అలాగే చేస్తుంటారు. తాను చేస్తున్నది అంతేగా! మరి నలుగురూ తనను దొంగదని ఎందుకనాలి? ఆఖరికి కన్నకొడుకు కూడా అలాగే అంటాడా? ఛీ. ఛీ. అంతా అన్యాయం, దౌర్జన్యం కాకపోతే ఏమిటి?

మనసులో సుడిగుండంలో ఈ ఆలోచన అంతా రేగుతునే ఉన్నది. వరణక్క ముని కాళ్లమీద విసవిస నడిచిపోతున్నది. మనస్సు చాలా చిరాకుగా ఉన్నది. నడుస్తూ ఉండగా ఎవరైనా తగిలితే వాడివంక కొరకొర చూస్తూ అరవటం సాగించింది. దారిన పోయే వాళ్లు ఇది పిచ్చిదని భయపడి గబగబ తొలగిపోవటం మొదలుపెట్టారు. వాళ్ళందరూ తన్ను చూచి భయపడటం గమనించి వరణక్క వికృతంగా నవ్వుకున్నది. కాని వాళ్లు తొలగిపోతూ తనవంక అనుమానంగా చూస్తున్న సంగతి మాత్రం గమనించలేదు.

వరణక్క వెలివేసినట్లు నడుస్తున్నది. రోడ్డుప్రక్కన ఒకచోట జనం గుమికూడి ఉన్నారు. ఏం జరుగుతున్నదో చూడాలనే కుతూహలం కొద్దీ ఆమె అక్కడికి పరుగెత్తుకొని వెళ్లింది. అటువంటి తరుణం దొరికితే ఎప్పుడు చేజారవిడిచే స్వభావం కాదు ఆమెది. దమ్మిడీ ఖర్చులేకుండా తేరగా మంచి తమాషా చూసే వీలు దొరికినప్పుడు పోగొట్టుకుంటే ఏమౌతుంది? మాటకువస్తే పాపం వరణక్కకు ఎన్నాళ్లనుంచో ఇళ్ళు తగలబడుతుంటే చూడాలని మహాసరదా. ఆ భాగ్యం ఎన్నడూ దక్కలేదు.

గుంపుదగ్గరకుచేరి వరణక్క కాలివ్రేళ్లమీద నిలబడి ఎగిరి ఎగిరిచూసింది. కాని ఏమీ కనిపించలేదు. ఏమి జరుగుతున్నదని అక్కడఉన్నవాళ్లను చాలామందిని అడిగింది. ఎవ్వరూ చెప్పారుకారు. దాంతో తనముందు నిలబడ్డ వాళ్ల అందరిమీద ఆమెకు ఒక్కసారి కోపంవచ్చింది. వాళ్లు అందరూ తనకు అడ్డంగా నిలబడ్డారు. అందరూ తనమీద కక్ష సాధించేవారే. అందరికీ తాను లోకువే. తానేమంత తక్కువదికాదు. "దారి ఇవ్వండర్రా! ఇదుగో అబ్బాయి! నీకే చెప్పేది కదలవేం అడ్డంగా నిలబడి? ఒక్కళ్లకీ మంచీ మర్యాదా లేవూ? ముసలిముండను కాస్త ముందుకు పోనీరా ఏం?" అంటూ మోచేతులతో జనాన్ని త్రోసుకుంటూ వరణక్క ముందుకుపోయింది. ఆడదికదా దయతలచి జనందారి ఇచ్చారు. అయితే ఇంతమందినీ నెట్టుకుంటూ పోయి ముందు నిలబడేసరికి అందరూ ఎగతాళిగా నవ్వటం మొదలుపెట్టారు.

వరణక్క ఇందుకు చీమకుట్టినంతయినా బాధపడలేదు. ఎందుకు పడాలి?" నవ్వుతారు. నవ్వనీ - వాళ్లపళ్లే బయటపడతాయి!

నాకు కావలసింకేమిటో అయింది. హాయిగా ముందు కూర్చొని కోతిఆట చూస్తాను," అనుకున్నది.

కోతిని ఆడిస్తున్నవాడు ఈ జరిగిందంతా చూస్తున్నాడు. సరదాగాతమాషా చెయ్యాలని వాడికి బుద్ధిపుట్టింది. కోతిని పిలిచిచెప్పాడు. "దేవిగారు! ఏమండోయి దేవిగారు! ఇలా వచ్చిచూడండి. ఇక్కడ చేరినవారిలో తమ గికి కానీకూడా కానుకివ్వని ముసలమ్మగారు ఉన్నారుట - ఆ అమ్మగారికి సలాం చెయ్యండి." అంటూనే వాడు కోతిమెడ తాడులాగి ఏ పక్కకు తిరగాలో చూపించాడు. కోతి అమాంతం చెయ్యెత్తి సలాం కొట్టింది. అక్కడ చేరిన జనం ఆ పక్కనుంచి ఈ పక్కదాకా గొల్లున గోలబెట్టి నవ్వారు. కుర్రకారు వాళ్లంతా చప్పట్లుకొట్టి ఈలలు వేశారు. ఒక కుర్రకుంక కాగితం ఉండచేసి వరణక్కమీదికి విసిరేశాడు.

వరణక్క కోపం తారస్థాయి అందుకుంది. అందరిమీన కలిపి కత్తిగట్టి జగడం ఆరంభించింది. "ఏముంది? అడుక్కుతినేవాళ్లూ- అడుక్కుతినేవాళ్ల బుద్ధులూ! వీళ్లంతా డబ్బులు ఇచ్చి చస్తున్నట్టే అక్కడికి - వీళ్లంతా టిక్కెట్లు కొన్నారూ - నేను కొనలేదు. ఇంతోసి కోతిఆటకి మహా పెద్ద సర్కసులాగా నీల్గి చస్తున్నారు."

వరణక్క ఏమంటున్నదో ఎవరికి కావాలి? వాళ్లఇష్టమువచ్చినట్లు వాళ్లు నవ్వుతునే ఉన్నారు.


కోపంవచ్చి వరణక్క అరిచినకొద్దీ పగలబడి వాళ్లు నవ్వుతూనే ఉన్నారు. వరణక్కకు కొద్దిగా భయం వేసింది. తిట్టుకుంటూ, అక్కడినుంచి బయలుదేరి వెళ్లిపోయింది. జనం ఇంకా విరగబడి నవ్వారు. చాలాదూరం వెళ్లేదాకా వరణక్కకు ఆ నవ్వు వినిపిస్తూనే ఉన్నది. ఆ తరువాత కూడా ఆనవ్వు చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉన్నది. వరణక్కకు ఇంకా తిక్కరేగింది. అందరూ తన్ను వెంటాడి వేధిస్తున్నట్లు తోచింది.

ఈ కోపంలో వరణక్కకు ఏవేవో పిచ్చిపిచ్చిఊహాలు రేగినాయి. అందరూ తన్ను హేళనచేస్తున్నారు. తనమీద కుట్రచేసి పగ సాధిస్తున్నారు. తన్ను ఏడిపించాలని, తనమీద రాళ్లు రువ్వాలని వాళ్ల ఉద్దేశ్యం. తనను, తన కొడుకును వేరుచేయాలని వాళ్ల ఆలోచన. ఈ ఆలోచన ఎంతమాత్రం కొనసాగనీరాదు. ఏది ఎలాపోయినా, తన కొడుకును తాను అంటిపెట్టుకొని ఉండాలి.

యజమానుల ఇంట్లో వంట చేస్తున్నదన్నమాటేకాని ఏవిధంగా కొడుకు కోపం పోగొట్టాలా అనే ఆలోచన ఒక్కటే మనస్సులో కదులుతున్నది. తన కొడుకు సుఖపడాలి. తన కోసే ఉండాలి. ఒక మంచి బీదయింటి పిల్లని వెతికి కొడుకుకు పెళ్లిచేయాలి. గుదిబండ మెళ్లో పడ్డట్లు అవుతుంది. ఇంట్లోనుంచి కదలకుండా పడిఉంటాడు. పైగా పెళ్లికాగానే సంసారం బాధ్యతా, ఖర్చు నెత్తినపడతాయి. కొడుకుకు వచ్చే కొద్దిపాటి జీతంతో ఎటుతిరిగీ సంసారం ఈదలేడు. అప్పుడు కొంతవరకు తన సంపాదనపైన కూడా ఆధారపడవలసి వస్తుంది. అందుచేత తను చెప్పినట్లు అణిగిమణిగి పడి ఉంటాడు. ఇలా కొడుకు తన్ను విడిచిపెట్టకుండా చేయటానికి కట్టుదిట్టంగా ఒక పథకం వేసింది. అయితే కొంచెం ఆలస్యమవుతుందేమో తప్ప ఈ పనంతా ఇలాగే చేసి తీరాలి. ఈలోపుగా భూతవైద్యుడి దగ్గరికి వెళ్లి తన కొడుకు మనస్సు విరిచేస్తున్న దుష్టప్రయోగానికి చికిత్స చేయించాలి.

ఇలా ఆలోచనలు చేస్తూనే పని అంతా ముగించింది. ఇంతసేపూ యజమానురాలు ఏమి చేస్తున్నదో కనిపెట్టుతూనే ఉన్నది. లేకపోతే ఏ ఏ వస్తువులు ఎక్కడెక్కడ పెట్టిందో తెలియట మెలా? హల్వా ఏ డబ్బాలో మూతపెట్టిందో కూడా వరణక్క కనిపెట్టింది. వరణక్కకు ఇంకా చిన్నపిల్లలాగా చిరుతిండి ధ్యాస ఎక్కువ. హల్వ డబ్బా అందుబాటులో ఉన్న సంగతి తెలిసినప్పటినుంచి వరణక్కకు నోరు తెగఊరుతున్నది. గుట్టుచప్పుడు కాకుండా కొంత తాను తిని, విసూకి కూడా కొస్త పట్టుకుపోవాలని అనుకున్నది. లోకంమీద ముఖ్యంగా యజమానురాలిమీద ఇలాగే కసితీర్చుకోవాలని వరణక్క మతం. యజమానురాలిమీద వరణక్కకు పట్టరాని అసూయ, అసహ్యం కలిగింది. బందిపోటు దొంగలు వచ్చి ఇంటిమీద పడి నల్లపూస మిగలకుండా దోచుకోవాలి. దయాదాక్షిణ్యం లేకుండా ఆవిడని పట్టుకొని రోడ్లవెంట ఈడ్చుకెళ్లాలి. అప్పుడు కాని తన కళ్లు చల్లబడవు. ఇలా కోరుకుంటున్నంతసేపు వరణక్క హల్వా డబ్బా సంగతి మాత్రం మరిచిపోలేదు.

చేయవలసిన పని అంతా పూర్తిఅయింది. చేతులు రెండూ కట్టుకొన్న బట్టకే తుడుచుకున్నది. వంటయింటి గుమ్మందాకా వెళ్లి, చప్పుడు చేయకుండా తొంగిచూసింది. యజమానురాలు నిద్రపోవటం లేదు. కుర్చీలో కూర్చొని అల్లికపని చేసుకుంటున్నది. అటువంటప్పుడు డబ్బా మూత దీయటం అట్టే మంచిది కాదు. మరొకసారి ఎప్పుడయినా హల్వా తీసుకోవచ్చునని ఊరుకుంటే బాగుంటుంది. కాని యజమానురాలిమీద అసూయ, కోపం అతిశయించిపోతున్నాయి. ఆ కోపంతో ఊరుకో బుద్ధి కాలేదు. డబ్బా తీసింది. డబ్బా మూత తీస్తున్నది. యజమానురాలు ఉన్నవైపు వీపు ఉంచి నిలబడింది. కాని యజమానురాలు పిలవనే పిలిచింది. ఇంకేముంది తాను బయటపడిపోయింది. కంగారుపడిపోయింది.



రూపచిత్రం

[చిత్రకారుడు: సి. ఎస్. ఎన్. పట్నాయక్; మద్రాసు ప్రభుత్వపు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో ఫైనలియర్ విద్యార్థి. వీరిచిత్రాలు ఇటీవల మూర్తిరాయం కొంటెమెరీ మెమోరియల్ హాల్‌లో ప్రదర్శింపబడి ప్రశంసలు పొందినవి.]



పుస్తకపఠనం —సి. ఎస్. ఎస్. పట్నాయక్.

విషవృక్షం

కాస్త తెప్పరిల్లి సన్నగా నవ్వుతూ వెనక్కి తిరిగి ఆవిడవంక చూసింది.

ఆవిడ దీక్షగా వరణక్కవంక చూస్తూ "ఆ డబ్బాతో ఇప్పుడేం పనివచ్చింది" అని అడిగింది.

వరణక్క నోరంతా తెరిచినవ్వింది. "బెల్లండబ్బా ఏమోనని. కాస్త బెల్లం కావాలి. సాయంత్రం వంటకి."

ఆవిడ ఏమీ తొందరపడకుండా మృదువుగానే చెప్పింది "నిన్ను డబ్బాలేవీ ముట్టుకో వద్దని చెప్పానా లేదా? నీకేమైనా కావలసి ఉంటే వచ్చి నన్ను అడగాలి."

"ఆమాట నాకు తెలుసు. పనిమీద ఉన్నారు గదా అని..."

"అయినా ఇప్పుడునీకు బెల్లంఎందుకు కావలసివచ్చింది. పొద్దునేగదా ఇంతగడ్డ తీసి, ఆ చిన్న డబ్బాలో పెట్టి నీకుఇచ్చింది."

దీనికి బదులు ఏమనిచెప్పాలి? నిజానికి తన తప్పును ఒప్పుకోవాలి. ఒప్పుకుంటే మరి గొడవఉండకపోను. వరణక్కవంటి మనిషికి అదిఏమంత కష్టమైనపనికాదు. ఇటువంటి సందర్భాలు ఆమెకు ఎన్నిసార్లో వచ్చాయి. వరణక్కకు కొంతకాలంనుంచి మతి స్థిమితంగాలేదు. పెద్దతనమే అందుకు కారణంకావచ్చు. ఇతరవిషయాలు అనేకం జతపడినాయి. మొత్తంమీద తన్ను తాను సంబాళించుకోలేక పోవటం, ప్రతిదానికీ యాగీచేయటం, వెలితికావటంజరుగుతున్నది. వరణక్కకు ఇప్పుడు ఏ ఒక్కరిమీదా కాదు కోపం; లోకమే ఆమెకు పగయిపోయింది. యజమానురాలు మృదువుగా మాట్లాడటంతో వరణక్క తలక్రిందులైనంత పని జరిగింది. "అనమ్మా అను. ఇంకా దాచెందుకూ? మొహాన స్పష్టంగా అనెయ్యరాదూ? నేను వట్టి దొంగదాన్ననేగా నీ ఉద్దేశ్యం? మీ హల్వా రెండు ముక్కలు తీసుకుంటే నా జన్మ వెళ్లిపోతుందా ఏమిటి?" అన్నది వరణక్క.

ఆవిడ ఏమీ తొందరపడకుండా అలాగే శాంతంగా చెప్పింది. "నేను అనవసరంగా ఎవరినీ ఏమీ అనేదాన్ని కాదు. ఒకటి మాత్రం చెపుతున్నా. ఏ వస్తువు ఇచ్చినా ఇప్పుడు మునుపు వచ్చినన్ని రోజులు రావటం లేదు. నేను నిన్నేమీ అనలేదు. నలుగురూ నాలుగు విషయాలు చెప్పుకుంటుంటే నాకూ చెవిని పడకపోదు"

వరణక్క చేతిలో ఉన్నడబ్బా ఎత్తి కిందపడేసింది. "ఏ మహామ్మవ్! నేను పెద్ద ఉద్యోగస్థుడి పెళ్లాన్ని కాకపోవచ్చు. వంటదాన్ని అయినంత మాత్రాన నాకూ మంచీ - మర్యాద లేకపోలేదు. నువ్విలా మాట్లాడితే పడాల్సిన అవసరం నాకులేదు తెలుసా? ఇంకోళ్లని దొంగ అనే తాహత్తు నీకు ఉన్నదా ఏమిటి? మీ ఆయన ఇంత డబ్బు ఎట్లా సంపాదించాడో నాకూ తెలుసు. గౌర్నమెంటు కాంట్రాక్టులో డబ్బుకు గడ్డికరిచి చాలామంది బాగుపడ్డారు."

ఆవిడ అడ్డువచ్చి కఠినంగా చెప్పింది. "చాలులే! ఇక్కడ నిలబడి ఇలాగే పిచ్చిపిచ్చిగా వాగితే ఊరుకుండేది లేదు. నీకు వచ్చేడబ్బు లేవో మొహాన పారేస్తాను. తక్షణం ఇక్కడినుంచి వెళ్లిపో ఊఁ!" అధికారస్వరంతో, గదమాయిస్తూ ఆవిడ వాకిటికేసి చెయ్యి చూపించింది.

వరణక్కకు నెత్తిన పిడుగు పడ్డట్లయింది. ఈ పని పోతే తన గతేమికాను? మళ్లీ పని దొరకటం మాటలా? ఒక్కొక్కసారి నెలల తరబడి పనిలేక అల్లాడవలసి వచ్చేది. అందుచేత ఎలాగో కాళ్లవేళ్లబడి పని నిలుపుకోవాలని అనుకున్నది. కాని పెద్దమ్మ నెత్తినెక్కి తొక్కుతున్నది. ఏదోదయ్యం పట్టినట్లు మారిపోయింది మనిషి. అర్థం పర్థం లేకుండా అందరిమీదా నోరు చేసుకోవటం ఒకటి ప్రారంభించింది. ఆ దయ్యం ఊరుకోనివ్వ లేదు.

"సరే - అలాగే పోతాలే. నీ పాపిష్ఠి సొమ్ము నాకేమీ అక్కరలేదు నువ్వే ఉంచుకో. ఆ పాపిష్ఠి డబ్బుతో ఇంకో మేడ కట్టించుకో."

వరణక్క మనస్సులో ఉన్న ఏహ్యభావం మరింత ఎక్కువైంది. అలాగే బయటపడి ఆవిడను అడ్డమైన తిట్లూ తిట్టుకుంటూ పోతున్నది. ఇంతలో ఒక్కసారిగా యామూ గుర్తువచ్చింది. అదే ఇప్పించింది ఈ పాడు ఉద్యోగం.

యామూది కూడా వరణక్క ఊరే. చిన్నప్పుడు ఇద్దరూ కలిసి ఆడుకున్నారు కూడా. ఇద్దరూ బీదరికం అనుభవించారు. కాని యామూ అదృష్టం పండింది. విష్ణుపంత్‌కు ఇచ్చి యామూకు పెళ్లి చేశారు. మొదట తన్నే ఆయనకు ఇద్దామనుకున్నారు. ఏదో పేచీ వచ్చింది - ఆ అదృష్టం యామూకు పట్టింది. వరణక్కకు వేరే పెళ్లి అయింది. భర్త పోయినాడు. యామూకు చక్కగా సంసారం పిల్లా జెల్లా, సుఖం, శాంతీ అమరినాయి. సిరి ఎత్తుకున్నది. ఆ మధ్యనే పాపం పక్షవాతంవచ్చి ఒకపక్క పడిపోయింది. అయినా ఇంటిల్లపాదీ ప్రేమతో సేవచేస్తున్నారు. దేవుడు యామూని చల్లటికంట చూశాడు. తన బతుకు ఇట్లా కాలింది. అక్కడా ఇక్కడా పడిఉండి, అందరికీ చాకిరిచేసి ఎన్నో అవస్థలు పడవలసివచ్చింది. ఇదంతా మనసులో మెదిలేసరికి వరణక్కకు పట్టరాని ఆగ్రహం వచ్చింది. ఆ ఆగ్రహంలో పిచ్చిపిచ్చి చేష్టలు చేసింది. పళ్లు కొరుకుతూ బిగ్గరగా తనలో తాను మాట్లాడటం సాగించింది. దారినపొయ్యేవారంతా ఆమెవంక వింతగా చూశారు. ఎవరో అననుగూడా అన్నారు. పిచ్చిదానిలాగా ఉన్నదని.

వరణక్కకు ఈ మాట వినిపించింది. భయంతో వణికిపోయింది. కుర్రకుంకలంతా తనపైన రాళ్లు రువ్వి ఏడిపిస్తారేమో? తాను జాగ్రత్తగా ఉండాలి. తాను ఇలాగే పిచ్చిదానిలా ఉండగూడదు. అణకువగా, శాంతంగా ఉండాలి. ఏమయినాసరే వినూ చెప్పుచేతల్లో పడిఉండి, వాడినే కనిపెట్టుకొని ఉండాలి. వాడి ఇష్టప్రకారమే తాను నడచుకోవాలి.

భయంతో వణికిపోతూ వరణక్క కొంప చేరుకున్నది. కాళ్లు తేలిపోగా, ఒకమూల కూలబడింది. తనకు తెలియకుండానే, ఇంకా ఏమేమో వాగుతున్నది. కొంతసేపటికి తెలివొచ్చి వాగుతున్నట్లు గుర్తించి భయపడిపోయింది. రెండుచేతులతో నోరు గట్టిగా మూసుకొని కూర్చున్నది.

వినూ భోజనానికి వచ్చాడు. ప్రొద్దుటినుంచి అలాగే తల్లి చేతిలో చివాట్లు తిన్నందుకు ముఖం ముడుచుకొని ఉన్నాడు. ప్రొద్దున తన ఆత్మగౌరవం దెబ్బ తిన్నది. ఇకమీదటనైనా తాను నిలబెట్టుకోవాలి అనుకున్నాడు.

"ఇంకా అలాగే కూర్చున్నావేం నేనింటికి వచ్చిందికూడా కనబడటం లేదా? తిండేమయినా పెట్తావా లేదా?"

వరణక్కకు బొత్తిగా కదిలే ఓపిక లేకపోయింది. "నాకు ఒంట్లో బాగాలేదు. నేను లేవలేను" అని చెప్పింది. ఈ రెండు మాటలూ జాలికొలిపేటట్లు చెప్పాలని ఆమె ఉద్దేశ్యం. కాని అలవాటువల్ల అలా చెప్పలేకపోయింది. వినూ సానుభూతి పొందాలని ఆమె అనుకున్నది. కాని ఆ మాటలు అలా చెప్పలేదు. శతమొండిగా చెప్తున్నట్లుఉన్నది కాని ఆమాటలు అనేటప్పుడు ఆమె మొహం నిజం చెప్తున్నట్లు లేదు.

వినూ ఈమాటలు చెప్తుండగా వరణక్క ముఖం చూడలేదు. ఆ మాట్లాడినతీరునుబట్టి తరువాతకూడా చూడాలని అనిపించలేదు. ఒకమూలగా కుప్పల్లే కూలబడిపోయిఉన్న ఆమెనిచూస్తే వినూకి ఆమెస్థితి అవగతమయ్యేది. కాని అతడూ తన గొడవలోనే తల మునిగి తాటిప్రమాణంగా ఉన్నాడు. అందుచేత రుసరుసలాడాడు "అయితే? నువ్వనేమాట ఏమిటి? నన్ను పస్తుపడి ఉండమంటావా? బాగుంది. చాలా బాగుంది. పని చేసిచేసి డొక్కలో మాడుతూ ఇంటికివస్తే తిండికికూడా ప్రాప్తిలేదన్నమాట. ఎందుకూ ఇంకా ఇల్లని ఏడవను?"

"పెళ్లి చేసుకోకూడదూ? వచ్చేసరికి ఇంత వండి వడ్డిస్తుంది గదా" అన్నది వరణక్క. మాతృప్రేమ అంతా ఉబికేలాగా బుజ్జగించి చెప్పాలని వరణక్క అభిప్రాయం. "నీకో మంచిపిల్లని చూసి పెళ్లి చేస్తాను. పై ఎత్తున ఏమికావాలన్నా నేను ఉంటాను" అనికూడా చెప్పాలనుకున్నది. కాని చెప్పిన మాటల్లో, ఆప్యాయత, మృదుత్వం ఏకోశానా లేవు. పైగా కంఠస్వరంలో ఎత్తిపొడుపు, కాఠిన్యం ధ్వనించినాయి. ఓడిపోయిన దానిలాగా ఉద్వేగం పొందింది. పరుషంగా మాట్లాడింది.

పెళ్లిసంగతి ఎత్తేసరికి వినూకి కోపం ఎక్కువైంది. కొంత కాలంనుంచి పెళ్లి చేసుకోవాలన్న ఆలోచన వినూకి ఉన్నది. తనకి పెళ్లి కావాలంటే తల్లే అంగుకు ఆటంకం అనికూడా వినూకి తోచింది. అందువలననే ఇప్పుడు కోపం ఎక్కువైంది. ముత్యాలలాంటికళ్ళు—ఆ పిల్లని తలచుకొనేసరికి తల్లిపైకోపం ఇంకాఎక్కువైంది. ఇంతలో కాలికి ఏదో ఎదురుదెబ్బ తగిలింది. అంతకుముందు తల్లికి ఎదురుతిరిగి మాట్లాడటానికి లేని ధైర్యం ఈ దెబ్బతో చేకూరింది. పెద్దగొంతుపెట్టుకొని తల్లిమీద అరవటం సాగించాడు. "పెర్రిట పెర్రి. ఇల్లాంటి అమ్మ ఇంట్లో ఉండగా పెళ్లికూడా నా మొహానికి? యజమాన్లు తినగా మిగిలినవన్నీ ఎత్తుకొచ్చే ఇల్లాంటి వంటలక్క కొడుక్కి పిల్లనిచ్చే వాడెవడూ? నువ్వు శతముండదానివని, గయ్యాళి గంపవని, జగడాల మారివనీ లోకానికంతకీ తెలుసు. నువ్వు దొంగదానివని ఇంత కీర్తి సంపాయించి పెట్టావు. ఇల్లాంటి అత్తగారి మొహంచూసి, ఎంత తలకు మాసిన వాడైనా కూతురుగొంతు కోయడు. యాభై ఏళ్లొచ్చినాయి - ఇంకా బుద్ధిలేకపోయె. పైగా నన్ను పెళ్లిచేసుకోమంటున్నావా?" కాస్త ఊపిరి తీసుకోవటానికి ఒక్కనిమిషం సేపు ఆగి, తల్లివంక చూశాడు. తల్లి గుడ్లప్పగించి రాతిబొమ్మలా కదలకుండా కూర్చోవటం చూసి వినూకి మరింత కోపంవచ్చింది. "నువ్వు చావనైనా చావవాయిరి. నువ్విట్లా చస్తావు. నేను తలకాయి ఎత్తుకొని తిరిగే యోగంలేకుండా ఇంకా పదేళ్ళయినా బతుకుతావు."

ఇలా ఇష్టం వచ్చినట్లు సాగిపోయింది ధోరణి. ఇది అనవచ్చు ఇది అనకూడదని లేదు.

ఇంతకంటే వరణక్కకు వేరే చావు లేదు. ఎంత చెడ్డా తాను తల్లి; కన్నది, పెంచింది - వాడికోసం తాను దొంగతనం చేసినా, బానిసలాగా బ్రతికినా, తన్ను కష్టతేర్చవలసినవాడు వాడొక్కడు. తన ముసలితనంలో - తనకు అండకావలసిన రోజుల్లో వాడు ఎదురుతిరుగుతున్నాడు.

వరణక్క గుండె చెరువైంది. శూన్యమై పోయింది ఇంకా ఏముంది ఏది ఏమయితే నేమిటి ఇంకా తనకు? తనకు, ప్రపంచానికి ఉన్న బంధం అది ఒక్కటే, అదీ తెగిపోయింది. వరణక్క మనసులో మిగిలిన భావాలన్నీ నశించిపోయినాయి. అసహ్యం, అందరిమీద అసహ్యం అది ఒక్కటి మిగిలిపోయింది. ఆ భావం ప్రవాహంలాగ ఉద్ధృతంగాపొంగియావత్ప్రపంచాన్ని సర్వనాశనం చెయ్యాలనిపించింది. ప్రపంచంలోని ప్రతివిషయం ఆమెకు విపరీతంగా, విరుద్ధంగా కనిపించింది. ఈ స్థితినే నలుగురూ పిచ్చి అనేది.

గొంతు చించుకొని అరుస్తూ వెళ్లి కొడుకుమీద పడింది. "పో—వెళ్లిపో— నీ మొహం నాకు చూపించబోకు. నాకు కొడుకు లేడు. వాడు చచ్చాడు. తల్లి చావాలని కోరుకుంటున్నావట్రా? నోట్లో పురుగులుపడి చచ్చిపోతావు. వళ్లంతా పుచ్చి పురుగులు పడతాయి. అందరూ నీ నోట్లో ఉమ్మేస్తారు..." ఇష్టం వచ్చినన్ని సాగ్గి కొడుకు మొహాన ఉమ్మివేసింది. అపరిమితమైన ఈ కోపానికి, ఆమె మొహం రూపు మారిపోయింది. గొంతు మారిపోయింది. గుడ్లు పీకెయ్యటానికి సిద్ధమైంది. ఈ వాలకం అంతా చూసేసరికి వినూకి గుండెలు చెదిరిపోయినాయి. విరక్తి పుట్టిపోయింది. "సరేలే. పోతున్నా. ఇప్పుడే పోతున్నా. మళ్లీ గొంతులో ప్రాణం ఉండగా ఈ గడప తొక్కను. జన్మలో నీ మొహం చూడను. నువ్వు చచ్చినా, నీ మొహాన కొరివి పెట్టను. తెలిసిందా" వినూ ఇంట్లోనుంచి వెళ్లిపోయినాడు.

వరణక్క వెంటపడి పంచపాళీలోకి వెళ్లింది. వినూ కళ్లు అమితమైన బాధను వ్యక్తం చేస్తున్నాయి. వెళ్లిపోతున్నాడు. వరణక్క నిలబడలేకపోయింది. నిలుచున్నపాళంగా కూలిపోయింది. ఆవు అడిలిపోయినట్లు, అడిలిపోతూ ఏడవటం సాగించింది. తన ఏకాకితనం, జీవితం అంతటా పడినబాధ తలుచుకున్నది. ఒక్కక్షణంసేపయినా ఏ ప్రక్కనుంచి ఎవరి ఆపేక్షా పొందలేకపోయినందుకు కుమిలిపోయింది.

ఇరుగుపొరుగువారంతా బయిటికివచ్చి చుట్టూ చేరారు. అందులో ఎవ్వరికీ వరణక్క అంటే ఇష్టంకాదు - అయినా ఆమె పడుతున్న బాధకు కరిగిపోయి జాలిపడ్డారు. కాని ఒక్కరూ ముందుకువచ్చి వరణక్కను ఓదార్చటానికి ప్రయత్నించలేదు. పైగా హేళనచేస్తూ అంతే కావాలన్నట్లు కొంత సేపు ప్రవర్తించారు. ఆ తరువాత ఇంకా ఏమిచేయాలో తోచక చూస్తూ నిలబడి పోయినారు.


భానూతాయి చూస్తూ ఊరుకోలేక పోయింది. భానూతాయి పెద్దది. స్థూలకాయురాలు. పిల్లలగన్న తల్లి. అందుచేత జాలి మనసు గలది. వరణక్కకు వచ్చిన ఆపత్తుకు విచారపడుతూ ఓదార్చటానికి స్థూలకాయం ఊపుకుంటూ ముందుకు వచ్చింది.

భానూతాయి రావటం వరణక్క చూసింది. ఆమె స్థూలకాయం నీళ్లునిండిన తన కళ్లతో చూస్తుంటే ఆ సందర్భంలో మరింత స్థూలంగా వరణక్కకు కనిపించింది. ప్రశాంతంగా ఉండే సంసారజీవితంలోని సౌఖ్యం భానూతాయిలో ఆ పాదమస్తకం కనిపించింది. వరణక్కకు అనుమానం వేసింది. భానూతాయికి ఇంతమంది పిల్లలు ఉన్నారు. ఇంకా కావాలనే ఉద్దేశ్యంతో తన కొడుకునుకూడా తనకు కాకుండా తీసుకుపోయి ఉంటుంది.

వరణక్క ఉద్రేకంగా లేచింది. భానూతాయిని నోటికి వచ్చినట్లు తిట్టుతూ మీదికి పోయింది. మొహం బరకపోయింది. జుట్టు పీకపోయింది. చుట్టూఉన్నవారంతా భానూతాయిని రక్షించటానికి పరుగెత్తుకువచ్చారు. అందరి మొహాలు వరణక్కకు అస్ఫుటంగా కనిపించాయి. అందరూ ఒక్కటే అనుకున్నారు. అందరూ కలిసి తనకొడుకును తనకుకాకుండా చేశారు. ఇప్పుడు వాడిని తీసుకెళ్లి చంపాలనే అందరి ఉద్దేశ్యం. వరసపెట్టి అందరినీ తిట్టటం ఆరంభించింది. అందినవాడినెల్లా రక్కబోయింది.

పెద్దగోలఅయిపోయింది. కొంతమంది వరణక్క చేతులు రెండూపట్టుకున్నారు. కొంతమంది ఆప్రక్కకీ ఈప్రక్కకీ లాగారు. ఒకటీ రెండూ దెబ్బలుకూడా తగిలించారు. వరణక్కకి కళ్లముందు పచ్చగా ఎర్రగా నీడలుగా కనిపించినాయి. అందరూ తన పైకి ఏదో దయ్యాన్ని పంపిస్తున్నట్లు చేతబడి చేస్తున్నట్లు అనిపించింది. అన్ని పక్కలనుంచి నిమ్మకాయలు కోసి విసురుతున్నట్లు, కుంకుమ చల్లుతున్నట్లు కనిపించింది. వెర్రి ఆవేశంతో కేకలు వేయటం మొదలుపెట్టింది. అందరూ వరణక్కకు పిచ్చి ఎత్తిందని చెప్పుకున్నారు.

★



13

మొగల్రాజపురం కొండమీది శిథిలమండపం మీద, సాయంత్రంపూట, వరదరాజూ ఏడుకొండలూ, ఇంకో నలుగురూ కూర్చుని మాట్లాడుకుంటున్నారు. చిరుచీకట్లు ఆవరిస్తున్నాయి. చల్లగాలి వీస్తోంది. మండపానికి అల్లుకున్న తీగెలు ఊగుతున్నాయి. బీడీలు కాలుస్తున్న వెలుగూ, పడమర దిక్కున అత్యల్పమైన నీలి ఎరుపు కాంతుల ఆధారంతో, వరదరాజు, పర్సులో నుంచి డబ్బు తీసి లెక్క చూస్తున్నాడు.

వరదరాజు పక్కనే నిలబడ్డ వెంకటప్పడు, "ఈయాల భలే ఛాన్సులే. గవర్నర్ పేట సెంటర్ కాడ నిలబడ్డా...ఆ పెద్ద హోటల్ లేదు ఆ మూలమీద ఓ కళ్లజోడు ముసలాయన ఏందో ధ్యాసగా పోతా పోతా, హోటల్ కాడ సిగిరెట్టుకి నిలబడ్డాడు. పక్క జేబులో పర్సు కనిపిస్తోంది. చుట్టూ చూసినా. ఎవరు చూసినా జనమే.. వీటుకాడ పోలీసోడు కూడా నిలబడివుండాడు. మెల్లగా ముసలోడి పక్కగా పోతా పోతా ఏటయితే అదే అయితదని జేబులో చెయ్యేసినా. మన కరము బాగుండాది. పర్సు చేతికొచ్చినాది. గబుక్కున హోటల్లోకి దూరి, లోపలికి పోయినా..."

వరదరాజు తలెత్తి వాడి ముఖంలోకి చూస్తూ, "హోటల్లోకే పోయినా! తెలివే! ఎవడన్నా నువ్వు లోపలికొస్తే బోనులో ఎలకలే దొరికిపోవంట్రా యెదవా!" అని మందలింపుగా ప్రశ్నించాడు.

వెంకటప్పడు "ఓసి! నాకీపాటి తెలవదంటా! ఆ హోటల్లో 'క్లీనరు,' మా మామకొడుకే. అడిగిచ్చేసి, అరగంట కూసున్నా. జాలీగా కాఫీతాగి, డబ్బు లాడి మొగాన పారేసి, డబ్బు తీసుకుని మెల్లగా వొచ్చేసినా. ఓరూ నూత్తైదులే" అని ముగించాడు తన ప్రతాపం.

వరదరాజు తీక్షణంగా పర్సునంతా గాలించాడు. రెండొందల రూపాయలున్నాయి. చిల్లర పావలావుంది. అవిగాక రెండు బ్రాకెట్ అంకెలు కట్టిన చీట్లున్నాయి. పర్సు ముందువేపు అది ఎవరిదో వారి పేరు రాసిన అట్టముక్క ప్లాస్టిక్ షీట్ కింద వుంది. వరదరాజుకి అక్షరాలు గురు తెలేవు. అందుకని, పక్కనవున్న ఇంకొకణ్ని, "ఓరే ఏడుకొండలూ, ఇదేందో చదవరా," అని పర్సు చేతికిచ్చాడు.

ఏడుకొండలు అక్కడ ఉన్న సమావేశమైనవారందరిలోకి కొంచెం అక్షర జ్ఞానం కలవాడు. మూడో తరగతో నాలుగో తరగతో చదివాడు చిన్నప్పుడు. అతను, పర్సును వెలుగుపడేట్టు పట్టుకుని అక్షరాలు కూడబలుక్కుంటూ చదవసాగాడు, "వెంకట-ర-ం-గ-య్య. ఎం. ఏ. తెలుగు టీచరు ... హైస్కూలు—విజయవాడ..." అని పూర్తిచేశాడు.

వరదరాజు మొహం ఆ క్షణంలో కొంచెం వికృతంగా మారింది. "మళ్లీ చదవరా" అన్నాడు. ఏడుకొండలు మళ్లీ చదివి వినిపించాడు.

వరదరాజు సంశయం రూఢి చేసుకున్నాడు. ఇది రంగయ్యగారిదే...పాపం, ఎంతో మంచివాడు, పిల్లలుగలవాడు, బీదవాడు, తనంటే ఎంతో ప్రేమగా వుంటాడు...ఆయన జేబు కొట్టేశారే! వాళ్లకేం తెలుసును, ఆయన మంచితనం! తెలియ నవసరంకూడా లేదు. తిరిగి రంగయ్యగారికిచ్చేస్తే? ఎట్లా ఇవ్వాలి? అసలు ఇవ్వటానికి వీళ్లొప్పుకుంటారా? [illegible] .. వీళ్ల కొంత కదిలించి చూద్దాం...

వరదరాజు, ఆలోచన కట్టేసి, "ఈయన ఎవరో తెలుసురా, ఏడుకొండలూ?" అని ప్రశ్నించాడు మెల్లగా.

"ఎవరైతేం?.. ఆఁ...గుర్తుకొస్తోంది .. రోజూ బ్రాకెట్ కంపెనీకాడకొస్తడే, పంతులు .. ఆయనా? కళ్లజోడు పంతులు?..." అని ప్రశ్నించాడు ఏడుకొండలు, ఎందుకీ ఈ వివరం, అన్నట్టు చూస్తూ.

మిగతావాళ్ళు వింటున్నారు తొమ్మిది భాగాలేసినా, పది రోజులకి జల్సాగా సరిపోతుంది డబ్బు. ఈరాత్రికి తను ప్రేయురాల్నో, భార్యల్నో—నిర్విచారంగా ఎళ్ళి కలుసుకోవచ్చు... కడుపునిండా తినొచ్చు, తాగొచ్చు.

వరదరాజు, డబ్బు మొత్తాన్ని చేతిలోకి తీసుకుని, పర్సు జేబులో పెట్టుకుని, "పాపం, పిల్లలు గలోడ్రా! [illegible] నెలజీతం కామాలా!" అన్నాడు సానుభూతిగా.

"అయితే ఏందీ సోది! ఏమంటావు నువ్వు? పాపం తిప్పి ఇచ్చేద్దామంటావా?" అన్నాడు వెటకారంగా, ఏడుకొండలు, వరదరాజు చేతిలో డబ్బుకేసి చూస్తూ గుటకలు మింగుతూ.

"ప్రాణాలకి తెగించి జేబు కొడ్తే, తిరిగి యిస్తారికేనా యేటి?" అన్నాడు వెంకటప్పడు. అతని కళ్లముందు, అతని ప్రేయసీ, అన్నం వడ్డించిన కంచం కనపడుతున్నాయి.

వరదరాజు "ఏం ఇచ్చేస్తే! రేపు ఇంకోఛాన్సు మాస్తే రి పోద్ది! ఏందంటా!" అన్నాడు ధీమాగా. కాని, ఈ సలహా అందరికి నచ్చుతుందో నచ్చదో అని బెరుకుగానే వుంది. ఆ కొద్దిపాటి వెలుగులో అందరి మొహాల్ని పరీక్షగా చూస్తున్నాడు.

"ఏడ్స్నట్టుందిలే నీకలా రెండొందల రూపాయలు దొరికితే ఇచ్చొస్తాడంటా! తొమలపాకుల్లో పెట్టి ఇచ్చిరా, పోంగానే పోలీసుల్ని పిల్చి అప్పగిస్తడు నీతిక్కా, మాతిక్కా కుదురిద్ది. జాతేస్తంటేం పాపం జాలి!" అన్నాడు ఏడుకొండలు కసిగా.

వరదరాజు ఇక పైన మాట్లాడ్డానికేమీ లేదు. వీళ్లందర్నీ వ్యతిరేకించి అతను చేయగలిగిందేమీ లేదు. దొంగలైనా వాళ్లల్లో వాళ్లకి వృత్తిరీత్యా ఒకనీతీ, న్యాయం ఏడ్సింది మరి. ఎవడెక్కడ ఏరకంగా డబ్బు సంపాయించినా, తలాకాస్త పంచుకోవాలి... ఇప్పుడూ అంతకంటే, అన్యథా జరగటానికి వీల్లేదు. వరదరాజు జటిలమైన తర్కంలో పడ్డాడు. ఇప్పుడు తను అధికారం వుపయోగించి ఈ డబ్బు తీసుకెళ్లి రంగయ్యగారికియ్యవచ్చు... బాగానే వుంది. కాని, ఈ కూర్చున్న వాళ్లూ, ఇక్కడికి రాకుండా వున్న ముగ్గురూ, ఈ డబ్బుమీద ఆధారపడి వున్నారు. అందులోనూ రాకుండావున్న ముగ్గుర్లో ఒకడు రైల్లోనించి కిందపడి మోకాలు విరగ్గొట్టుకుని ఆస్పత్రిలో పడివున్నాడు. వాడి సంసారంగతీ వాడిగతీ ఏంకావాలి? ఇప్పటికి వారంబట్టి ఒకటీ అరా, లాటరీలో సంపాయించి పంపుతున్నాడు... మిగతా ఇద్దర్నీ పోలీసులు చచ్చేట్టు ఉతికి వొదలిపెట్టారు. వాళ్లిద్దరూ, ఆ గుడిశెల్లో పడివున్నారు మూలుగుతూ. ఇంకో పదిహేనురోజులకి లేచినా లేచినట్టే... వాళ్లు.

వాళ్లేనా? ఈ కూర్చున్న వాళ్లు? వాళ్లకీ ఎంత ఆశగా వుంది! వారంనించీ చస్తున్నారు ఎండరోజుల్లో వొంటిపూట తిండితో, బీడీలు లేకా, టీలు లేక, ఇళ్లల్లో పెళ్లాలూ, పిల్లలూ—అవి లేనివాళ్లు 'ప్రేయురాళ్లూ' అల్లాడుతున్నారు...

తనో! తనువున్నా లేకపోయినా, వసంతం దగ్గిర తెచ్చుకుని— తింటున్నాడు! ఎన్నాళ్లు?... కానిపాపం రంగయ్యగారు!! ఎంత మంచివాడు! తనేదో పెద్దమనిషినని నమ్మి, ఆయన తన గొడవ గూడా చెప్పుకొచ్చాడొకనాడు. లేకపోతే తనకేం తెలుస్తుంది గాని,...

వరదరాజు ఆలోచన మానేసి, రెండొందల్నీ తొమ్మిది భాగాలు చేసి, ఐదుగురికి ఐదుభాగాలూ గైరుహాజరైన ముగ్గురి భాగాల్ని ఏడుకొండలు చేతికిచ్చేసి, తనభాగం జేబులో వేసుకుని, "పదండిరా పోదాం. ఒరే ఏడుకొండలూ! నువ్వు రేపు లాటరిపెట్టూ?..." అనేసి, గబగబ మండపం దిగి, మెట్లు దిగసాగాడు. ఏడుకొండలు ఖాళీపర్సును కొండదిగువకి విసిరేసి, బయల్దేరాడు, మిగతా వాళ్ళతో కలసి.

వరదరాజు మనస్సు కలతగావుంది. నడుస్తూనే ఆలోచిస్తున్నాడు. బాగా చీకటిపడిపోయింది. మొగల్రాజపురం పొయ్యే కార్లూ, వొచ్చే కార్లు, ప్రసరిస్తున్న ఫ్రంటులైట్ల కాంతీ, రోడ్డు దీపాల కాంతీ, చీకటిని కొంతవరకూ పోగొట్టుతున్నాయి.

వరదరాజు బుర్రలో ఏకకాలంలో అనేక ఆలోచనలు రేగాయి. అతనెప్పుడూ, ఎవరిమీదా ఇంత జాలిపడి ఎరగడు. రంగయ్యగారి అమ్మాయికి సుస్తీగా వుండటం, ఆయన కళ్లు సరిగ్గా లేక, అవస్థపడడం, కూతురు పెళ్లికి చేసిన అప్పు పెరిగి పెద్దదై ఆయన్ని ఏ క్షణాన్నైనా మింగటానికి సిద్ధంగా వుండటం— ఇవన్నీ ఆయన నోట విన్నప్పుడు తనకి మహా జాలేసింది. అంత చదువుకున్నవాడికి ఎన్ని కష్టాలు! తనకి అవకాశం వుంటే ఎంతో సహాయపడాలని వుబలాటం వేసిందప్పుడు. కాని జరిగిందేమిటి. ఆయన డబ్బే కొట్టేసి, ఏమి చెయ్యటానికీ వీల్లేక చూస్తూ వూరుకోవల్సి వొచ్చింది...

వరదరాజు గవర్నర్ పేట సెంటర్‌కి వొచ్చేసరికి, ఎనిమిది గంటలయింది. అతను, యథాలాపంగా, అమూల హోటల్ వైపు చూశాడు. స్తంభించిపోయినాడు. ఎవర్ని గురించి ఇంతసేపణ్ణించీ ఆలోచిస్తూ వొస్తున్నాడో ఆ రంగయ్యగారే, ఫుట్‌పాత్ మీద తిరుగుతూ వెతుకుతున్నాడు, పర్సు ఎక్కడైనా పడిపోయిందేమోనని. ఆయనకింకా అనుమానమేనా కలగలేదు, తన జేబు ఎవరో కొట్టేశారని. జారిపడిపోయిందనే ఆయన ఊహ.

వరదరాజు మెల్లిగా, ఆయన దగ్గిరగా వొచ్చాడు. వరదరాజును చూడగానే రంగయ్యగారు, రెండు నిమిషాలు కళ్లజోడు గుండా, నిదానించిచూసి, గుర్తించి, "నువ్వటోయ్! ఇదిగో, ఇక్కడే నా పర్సు పడిపోయింది... కాస్త చూద్దూ! నాకు సరిగ్గా చూపు ఆనటంలేదు" అన్నాడు బాధగా.

వరదరాజుకి చాలా జాలేసింది. ఏమిటి చెయ్యడం! వెతికినట్టే వెతికాడు ఐదునిమిషాలు. తిరిగి, "అయ్యగారికి పిచ్చిగానీండి, ఈపాటి ఈ జనంలో పర్సుపడితే వుంటదా! ఎవడికి దొరికిందో! చంకబెట్టుకుని పోయివుంటడు..." అన్నాడు తెలివిగా.

"అంతే నంటావా?" అని ప్రశ్నించాడు రంగయ్యగారు ఉసూరుమంటూ. కాని నిజమే! ఇక్కడ ఈ జనసమ్మర్దంలో బడితే సూదైనా తిరిగి దొరుకుతుందా? అనిపించిందాయనకి అదీగాక కొంచెం సిగ్గేసింది గూడాను. నడిబజార్న వెతుక్కుంటూ కూర్చోటమా! అనిపించింది

"పద నాయనా, వెళ్దాం. ఏది ఎవరికి ప్రాప్తమో అది వాళ్లకి పోతూంటుంది..." అంటూ ఇంటివేపు నడవసాగాడు.

వరదరాజుకి వొళ్లంతా జెర్రులు పాకినట్టయింది. ఈయన సొమ్ము! కష్టపడి సంపాయించివుంటాడు!... కానీ.. వరదరాజుకి ఈ ఆలోచన అట్టే నిలకడగా నిలవలేదు. "పంతులుగారూ! నే యెల్లొస్తా... జాగర్తగా యెల్లండి బళ్లొస్తాయి" అని హెచ్చరించాడు.

రంగయ్యగారు, "పర్వాలేదులే. కళ్లింకా అంత దుస్థితికి రాలేదు నాయనా. వెళ్లగల్ను..." అంటూ ఏదో జ్ఞాపకం వొచ్చి

వంటలక్క పనిమీద పొరుగూరు పోతూ ఆ ఒక్కపూటకీ వంట చెయ్యటానికి కూతురిని పంపించింది. తిరిగి రాగానే ఆదుర్దాగా కూతురిని పిలిచి "ఏమమ్మా! వంట బాగా చేశావా? భోజనాల దగ్గర వాళ్లు ఏమన్నా అన్నారా?" అని అడిగింది.

"లేదమ్మా. బాగుందనికాని, లేదనికాని ఒక్కమాటైనా మాట్లాడలేదు. కాని భోజనం చేసే ముందు మాత్రం ఒక నిమిషం సేపు కళ్లుమూసుకొని దేవుణ్ణి ప్రార్థించారు."

* * * *

"ఇరవైఏళ్లు దాటితే సాధారణంగా ఇక ఎత్తు పెరగరని మా మాస్టారు చెప్పారు మరి నువ్వు ఇంకా ఎత్తు పెరుగుతున్నావేం నాన్నా?"

"పెరగటంలేదే! ఎవరు చెప్పారు పెరుగుతున్నానని?"

"మరి జుట్టులోనుంచి నీ తల ఇదివరకు కనపడేదికాదు ఇప్పుడు ఎత్తుగా బయటపడుతున్నదిగా!"

★ అపస్వరాలు ★

నట్టు వరదరాజును తనతో రమ్మని సౌంజ్ఞచేశాడు. వరదరాజు ఆశ్చర్యపడి ఆయనవెంట వెళ్లాడు. ఇద్దరూ గవర్నర్ పేట సెంటర్ దాటి ఓ సందుమలుపు తిరిగారు, రంగయ్యగారు ఆగాడు. వరదరాజుకి మాత్రం వినపడేలాగా, "నా పర్సులో నిన్నటి బ్రాకెట్ చీట్లు రెండున్నాయే! ఇవ్వాళ పొద్దున్నే వద్దామనుకుంటే వీలు చిక్కిందిగాదు; అందులో నెంబర్లు నాకు జ్ఞాపకమే లే. వకవేళ బ్రాకెట్ వచ్చేటట్టయితే 'షే' ఇస్తాడా అతను?" అని ప్రశ్నించారు, ఆదుర్దాగా.

వరదరాజు "ఇయ్యాల ఫైవ్ జీరో వొచ్చిందండి. మీరేం నెంబర్లు వేసారేమిటి? రాత్రి నేను ఆలస్యంగా వొచ్చా. అయ్యగారు వొచ్చివెళ్లారని చెప్పారక్కడ." అన్నాడు.

రంగయ్యగారు నిరుత్సాహంగా, "పోనీ, వెధవ ఫైవ్ జీరో వొచ్చిందీ! మనకి అదృష్టం బాగాలేదోయ్. నెలనించీ ఒక్క బ్రాక్కెట్ తగిల్తే వొట్టు. ఛా! దీన్ని వొదిలించుకోవాలి..." అని విరక్తిగా అనేసి, "వెళ్లు నాయనా పొద్దు పోతోంది" అన్నాడు.

"అయితే అయ్యగారియ్యాల ఓ పెనింసు కట్టటానికి కూడా రారూ?" అని ప్రశ్నించాడు వరదరాజు.

"రాను నాయనా. ఇంకా గానికోలికి రాను. ఆ ఆశ అంతరించింది. పోనీ దాం దుంపతెగ." అన్నాడు రంగయ్యగారు విరక్తిగా, ప్రతిజ్ఞ చేసేవాడిలాగా.

వరదరాజు ఆయనవంక వింతగా చూశాడు. బ్రాకెట్ పిచ్చి సామాన్యంగా వొదల్దు. ఈయన ఇంత త్వరలో క్షణంలో మానేస్తాను అంటున్నాడే! సాధ్యమా! చూద్దాం! ఇది శ్మశానవైరాగ్యంలా తాత్కాలికం అయివుండొచ్చు...వరదరాజు చెయ్యెత్తి రంగయ్యగారికి నమస్కరించి వెనక్కి తిరిగి వెళ్లిపోయినాడు.

రంగయ్యగారు మెల్లిగా నడిచి ఇంటికి చేరుకున్నాడు. ఆయన అంతర్యంలో ప్రబలమైన సంఘర్షణ బయల్దేరి తుపానులా వీస్తోంది. భాగవతం రాయటం మొదలెట్టాక ఇవ్వాళ, వేళకి కూర్చుని రాయటం మానవల్సి వచ్చింది. దానికి ఎన్నో కారణాలున్నా, మనస్సు పీకుతోంది. తనకేమో, కళ్ళు సరిగ్గా కనపడక, అమ్మాయి చేత రాయిస్తున్నాడు వారంనుంచి. అమ్మాయి మళ్లీ ఇవ్వాళ తిరిగి మైకంవొచ్చి పడిపోయింది. నిక్షేపంలాంటి పిల్ల, నిత్యం అల్లరిగా, వికసించిన పువ్వులా నవ్వుతూ తిరిగేపిల్ల వాడిపోయి, దిగులుగా వుంటూవుంది ఈమధ్య. ఆవేళ, సదానందం గదిలో పడిపోయిం తర్వాత అట్లాఅయింది. డాక్టర్కి చూపిస్తే, "ఏమీలేదు. ఇది శారీరకమైన వ్యాధేమీ గాదని తేల్చిచెప్పాడు. అయినా ఎందుకేనా మంచిదని, ఏవో ఇంజక్షనులు రెండుచేశాడు. టానిక్కు రాసి ఇచ్చాడు. టానిక్కు తాగుతూనే వుంది...అయినా మళ్లీ ఇవ్వాళ మైకంవొచ్చి వంటింట్లో, పడిపోయింది...అదొక కారణం, అది రాసేస్థితిలో లేదు. తను.. వీలుకాక...బాధపడుతూనే రాయటం ఈ పూటకి మానుకోవల్సి వచ్చింది...

దానికివ్వాళ మైకం ఎందుకొచ్చిందో!...

రంగయ్యగారు, తన నెలజీతం పోయినందుకేనా విచారించటం లేదు. కూతురు జబ్బేమిటో తేలక బాధపడుతున్నాడు.

(ఇంకా వుంది)

వనితాలోకం

ప్రాచీనభారత మహిళాత్రయము

ఇల్లిందల సరస్వతీదేవి

భారతనారీ మహోజ్జ్వల చరిత్ర ఇల్లు వెడలగొట్టబడిన దీనురాండ్ర గాథలు, చేత కాసులేని అనాథల అధోగతీ, విద్యాగంధమెరుగని అజ్ఞానురాండ్ర అవస్థలు, పురుషులచేతిలోని కీలుబొమ్మల జీవితాలతోనే నిండిలేదు; దేశానికీ జాతికీ అధినేతలుగా ప్రజలచే ఆరాధింపబడిన స్త్రీరత్నాలజీవితాలతోను, వేదశాస్త్రాలు, వేదాంత తాత్విక నీతిశాస్త్రాలు, ఆర్థిక సామాజిక వ్యవస్థలనుగురించీ పండితులతో, వాగ్వివాదములుసలిపిన ప్రజ్ఞాధురీణల పుణ్యచరిత్రలతోను, పురుషులకంటె శాంతియుతముగా అతినైపుణ్యముతో దేశాలను పాలించిన మహారాణుల చరిత్రలతోను ప్రకాశించుచున్నది


వేదాంత నీతి తత్వశాస్త్రములలో యాజ్ఞ్యవల్క్యునితో సమానముగా వాగ్వివాదము సలుపగలిగిన విదుషీమణి గార్గి. చర్చలో యాజ్ఞ్యవల్క్యుని అనేక చిక్కు ప్రశ్నలు వేసి విషయాంతరగతుని చేయజాలిన నేర్పరి. సమకాలికులలో ప్రముఖురాలు.

బౌద్ధమతాభిమానీ ప్రచారకుడూ అయిన అశోకచక్రవర్తికుమార్తె సంఘమిత్ర. ఈమె అవివాహితగానే భిక్కుణిఅయి బౌద్ధమత ప్రచారము చేసింది. ఈమె సోదరుడైన మహేంద్రుడు సింహళదేశములో బౌద్ధ భిక్షువుగా సంచారము చేస్తున్న కాలములో ఆదేశపురాణి పరస్త్రీలను అయిదువందల మందిని చేర్చుకొని ఉపదేశము చేయవలసినదని భిక్షువు నర్థించింది. దాని కతడు తనకు స్త్రీల కుపదేశించునధికారములేదనీ అది భిక్కుణి నిర్వర్తింపవలసిన ధర్మమనీ నచ్చచెప్పి సంఘమిత్రను పిలువనంపాడు. పదకొండుమంది భిక్కుణులతో సంఘమిత్ర నౌకాయానముచేసి సింహళము చేరుకున్నది. తన మృదుమధురవాక్కులతో సునాయాసముగా బౌద్ధమతప్రచారముచేసి ఆదేశములో పన్నెండు బౌద్ధమతవిహారాలనుస్థాపించింది. ఆమె తిరిగి తనదేశము చేరుకోలేదు. తన అరవైతొమ్మిదవయేట భౌతిక దేహము చాలించేవరకూ బౌద్ధమతమును వ్యాప్తము చేస్తూనే కాలము గడిపినది.

మూడవ భారత మహిళారత్నము ఉభయభారతి. ఈమె వ్యవహారనామము ఉంబి. ఉభయభారతి భర్త మండనమిశ్రుడు గొప్ప కర్మిష్ఠి. ఈమె సకలవిద్యాపారంగతురాలైన ఆదర్శగృహిణి.

అద్వైత మత స్థాపనాచార్యులైన శంకరులు పరమానందప్రాప్తికరమైన సన్యాసమును, తన్నిర్ణాయకమైన వేదాంతమును ప్రచారముచేయునుద్దేశ్యముతో సంచారము చేస్తూ ఉండేవాడు. మాహిష్మతీ పురనివాసి అయిన మండనమిశ్రునితో వాదించి, గెలిచి తన మతము స్థాపించవలెననే కోరికతో ఆయనను వెదకుకుంటూ వచ్చాడు. మండనమిశ్రుని వాకిటిముందర చిలుకలే పండితగోష్ఠి సలుపుతుండగా చూసి శంకరుడు నివ్వెరపోయాడు. లోపలికివెళ్ళి తనను తెలుపుకొని వాదభిక్షకొరకు వచ్చినట్లు చెప్పుకున్నాడు.

ఆ మరునాడు గొప్ప పండితసభ ఏర్పాటయింది. పండితుల వాగ్వివాదాలు ఎవరికింపుగావు? సభ జనసందడితో కిటకిటలాడుతున్నది. ఆ సభలో పండితులమధ్య ఒక అలజడి కలిగింది; ఆ సభకు అధ్యక్షత





—పి. నాగేశ్వరరావు.

సహింపజాలిన వ్యక్తి ఎవరన్న సమస్య బయలుదేరింది. వివాదాంశము చక్కగా గ్రహించి తీర్పు చెప్పగలవా రెవరన్నది చిక్కు ప్రశ్నగా కొంతసేపు బాధించింది.

సరిగా ఆ సమయములో ఒక సభ్యుడికి తోచింది 'మన ఉభయభారతి నిర్ణయ కర్త్రిణిగా ఉండతగినవిదుషి' అని. వెంటనే అందరూ ఆమోదించారు; తమ కామె పేరు మొదట స్ఫురించనందుకు నొచ్చుకొన్నారు.

ఉభయభారతి పతి ఆజ్ఞకొరకు మండన మిశ్రుని ముఖావలోకనము చేసింది. అనుజ్ఞ లభించగానే అధ్యక్షపీఠ మలంకరించింది. ఆమె అధ్వర్యములో శంకరాచార్యులు మండనమిశ్రునితో రమారమి పదిదినములు చర్చించాడు. తుదకు గెలుపు శంకరులకు లభించింది.

ఈ వివాదానికి ముందు ఇద్దరు పందెము వేసుకొన్నారు; మండనమిశ్రుడు గెలిచినట్లయితే శంకరాచార్యులు తన కాషాయ వస్త్రాలను విసర్జించాలి, ఒకవేళ శంకరాచార్యులే గెలిచినట్లయితే మండనమిశ్రుడు సన్యాసాశ్రమముస్వీకరించి యతికి శిష్యుడై పోవాలి

భర్తఓటమితో ఉభయభారతికి ముచ్చెమటలు పోశాయి; కొంతసేపటికి తెప్పరిల్లుకొని "మీరు గెలిచినది అర్థభాగము నే. 'ఆత్మనోర్ధం పత్నీ' అన్నారు పెద్దలు. వాదములో నన్నుగూడా ఓడించి వారిని మీ శిష్యవర్గములో చేర్చుకోవచ్చున"న్నది.

శంకరాచార్యులకు ఆశ్చర్యము కలిగింది; ఆమె మాటలకు నవ్వు వచ్చింది. "నీభర్త ఓడిపోవటముచేత మనసు కలవరపడినట్లున్నది." అన్నాడు

ఉభయభారతికి శంకరాచార్యుల మనోగతము అర్థమైనది "స్త్రీ వివాదయోగ్య కాదని మీఅభిప్రాయము కాబోలు! యాజ్ఞవల్క్యుడు గార్గితో వేదచర్చలు సలుపలేదా? జనకమహారాజుతో సులభ చర్చించలేదా? పాండిత్యానికికూడా స్త్రీ పురుష భేదమున్నదా?" అని సవాలుచేసింది.

దానితో శంకరాచార్యులకు సందేహము తీరిపోయింది. సంకోచమూ వీడిపోయింది.

శంకరాచార్యులతో ఉభయభారతి పదిహేనుదివాలు శాస్త్రచర్చ జరిపింది. కడపటి సమావేశములో గృహస్థాశ్రమములోని చిక్కు ప్రశ్నతో శంకరాచార్యులను ఎదుర్కొన్నది. శంకరాచార్యుల వాక్ప్రవాహము దానితో టక్కున నిలిచిపోయింది. ఆమె వేసిన ప్రశ్న ఆయనకు అనుభవాతీతమైనది. ఆయన బాలసన్యాసి. ఆమె అవకాశమును వినియోగించుకొంది; సభ్యులందరు భారతమ్మ సమయస్ఫూర్తికి మెచ్చుకొన్నారు.

శంకరాచార్యులు తన ఓటమిని అంగీకరించలేదు. తన కొకనెల గడువు కావలెనన్నాడు. ఆ నెలలోపల పరకాయప్రవేశముతో కావలసిన అనుభవముగడించి ఆమె పునర్దర్శనము చేశాడు.

ఉభయభారతి ముందుగానే తన కపజయము కలుగబోతున్నదని గ్రహించింది. భర్త సన్యాసి అయినతరువాత తను జీవింద దలచలేదు. సంసారబాధ్యత కుమార్తెకూ అల్లునికీ ఒప్పగించింది. సంసారబంధాలను ఒక్కొక్కటె సడలించుకోవటానికి పూనుకొన్నది

"నా పతితోడిసాంగత్యమున నే నాజన్మ పావనమైనది. మీ తోడ వివాదముతో మరింత పావనమైనది" అంటూ శంకరాచార్యులపాదాలకు నమస్కరించింది

శంకరాచార్యు లామెను వారించి "ఉభయభారతీ! నీవు అసమాన ప్రజ్ఞాధురీణవు. నీవంటి విదుషితో చర్చించు అవకాశము లభించినందుకు నేను ధన్యుడను. భారతమ్మా! నీవీలోకానికే కాదు - బ్రహ్మలోకానికికూడా భారతమ్మవే!" అని ప్రశంసించాడు.

ఆమె మండనమిశ్రునికి పాదాభివందనము చేస్తూనే భౌతికదేహము వీడిన మహాయిల్లాలు.

ఆమె దేహత్యాగముతో శంకరాచార్యులకు ఆమెయెడ గౌరవము ఇనుమడించింది. ఉభయభారతి ప్రాచీన భారత మహిళాలోకములో అగ్రగణ్య ★

వనితా లోకం:

అన్నపూర్ణమ్మ అనుభవం

"ఆంట్ సీరియస్ స్టార్ట్ ఇమీడియట్లీ" అని టెలిగ్రాం అందగానే, సంసార సమేతంగా, రెక్కలు కట్టుకుని వాలాడు, కృష్ణుడు.

"అన్నయ్యా, వొదినా వొచ్చేరే?" అన్నాడు రాముడు. సీత లేచి, వాళ్ళకు కాళ్ళు కడుక్కుందుకు నీళ్లందించింది. ఆగంతుకులంతా లోపల ప్రవేశించారు.

"ఏం అక్కా? ఎలా వుంది?" అన్నాడు కృష్ణుడు.

అరవై ఏళ్ళు పైబడ్డ అన్నపూర్ణమ్మగారు గదిలో ఓ మూలగా మంచంమీద పడుక్కొని వుంది. ఆఖరి సందర్శనంకోసం అక్కడ చేరిన భాస్కరం, వాడి భార్యా; సూరమ్మా, ఆవిడ పిల్లలూ, అంతా తలో మూలా కూచున్నారు. ఆవిడ సోదరులు కూడా త్వరలోనే వొస్తారని భావించబడింది.

అందులో కొందరికి దొడ్డమ్మా, పెద్దత్తగారూ, చెల్లెలూ ఈవిధంగా ఆవిడతో తలో వరుసా వున్నా, అందరూ ఆవిడ్ని అక్కా అనే పిలుస్తారు దాని క్కారణం ఆవిడ తండ్రి రెండు పెళ్ళిళ్ల బాపతూ పదిమంది చెల్లెళ్ళూ, పదిమంది తమ్ముళ్లూ వుండడమే. వాళ్ళు 'అక్కా' అని పిలుస్తుంటే అందరికీ అదే వరుసైంది

"ఇప్పటికి చావకుండా ఇలా వున్నాను" అంది ఆవిడ మూలుగుతో.

కృష్ణుడు మంచంపై కూచున్నాడు. అతని భార్య రుక్మిణి "టెలిగ్రాం చూసి హడలెత్తిపోయాం; మిమ్మల్ని చూడగలుగుతా మనుకోలేదు" అంది.

"వీడికోసమే అన్నట్టు ప్రాణాలు నిలిచి వున్నాయి. వాడి గొంతు వినపడింది. ఇంక నాకు నిశ్చింతే. కావాల్సిందేమీ లేదు" అంది అన్నపూర్ణమ్మగారు.

కృష్ణుడు అందుకుని, అదేమిటే అక్కా అలాఅంటావ్. నువ్వింకో పదేళ్ళైనా బతుకుతేనేగా మా పిల్లల బాగోగులు చూడగలిగేది. అప్పుడేగా నీ కానందం కలిగేది" అన్నాడు.

"ఆనందం" అని బాధగా నవ్వింది అక్క. అందరి గుండెలూ ఝల్లుమన్నాయ్.

"అదేమిటండీ అత్తగారూ? మీ ఆసరా చూసుకునేగా మేమంతా కాలాన్ని గడుపుతుంటా" అంది సీత.

భాస్కరం "అవునే, అక్కా, వొదిన చెప్పింది నిజమే. మమ్మల్నందర్నీ పెంచి పెద్దచేశావు, నువ్వే మా ఆరాధ్య దైవం" అన్నాడు.

"బాగా చెప్పారు" అంది భాస్కరం భార్య భానుమతి.

"ఏరిరా? నీ పిల్లలేరీ? ఇలా తీసుకురా" అంది అన్నపూర్ణమ్మగారు.

కృష్ణుడు వాళ్ళను దగ్గరికి తీసుకువెళ్లాడు. చేతుల్తో తడుముతో ఇలా సణిగింది: "ఏం

శొంఠి కృష్ణమూర్తి

పిల్లలో? ఏం పెంపకాలో? అంతా చిక్కిపోయారు. పట్నవాసాల్లో మీ విలాసాల్లో పడి పిల్లలపోషణ గురించి జాగ్రత్తపడడమే లేదన్నమాట."

అందరూ మౌనం వహించారు. గోడమీది గడియారం మూడుకొట్టింది రాముడు కనుసైగ గ్రహించిన సీత వంటింట్లోకి వెళ్లింది. మరో పదినిమిషాల్లో అందరూ కాఫీలు తాగసాగారు.

ఆ చుట్టుపక్క లెవ్వరూ అన్నపూర్ణమ్మగార్ని ఎరగనివాళ్ళు వుండవుండరు. అందరూ "ఆవిడ మహా ఉత్తమురాలు; నిస్వార్థురాలు; ఇతరుల సేవలో కండల్ని కరిగించుకున్న ధీరురాలు" అంటారు.

జైలుకు వెళ్లలేదు; లాటీదెబ్బలు తినలేదు; ఎమ్. ఎల్. ఎ. కాలేదు. ఐతే ఏమిటి ఆవిడ గొప్పతనం అనిపించవచ్చు మీకు. ఎవళ్లి కుటుంబసేవ వాళ్ళు చేసుకోవడమూ ఘనకార్యమేనా అని ప్రశ్నిస్తే నేనూ జవాబుచెప్పలేను. ఏమైనా నా దృష్టిలో స్వార్థత్యాగం ఎప్పటికీ గొప్పదనే!

భారత స్త్రీల స్వార్థరహిత సేవాభిలాష లోని గొప్పతనం మామూలు కొలతలకి అందని విలువగలది.

భాస్కరం వెళ్లి మందులు అందించసాగాడు. భాస్కరం భార్య భానుమతి అల్లరి చేస్తున్న పిల్లలకి ఆటవస్తువు లందించి బయటకు పంపేసింది.

"చూడరా కృష్ణుడూ, నాకెందుకు ఈ మందులూ, మాకులూ, డబ్బు వృధా"

"అదికాదే నీకంటె ఎవ్వరికి ముఖ్యం?"

అంతలోకి ఊరి పెద్ద శ్రీ శంకరశాస్త్రిగారొచ్చారు. అందరూ లేచి నిలబడ్డారు. ఆయనది అన్నపూర్ణమ్మగారి వూరే. చాలా

★ అన్నపూర్ణమ్మ అనుభవం ★

హూరకు చుట్టరికం. అయినా ఎంతో ఆత్మీయత వున్నట్టుగా వుంటాడు. ఆయన్నసలు 'గ్రామబంధు' అనవచ్చు. ఆ వూళ్లో ప్రజలకు కలిగే కష్టనష్టాలలో ఆయన భాగ స్వామి కాకుండా వున్న కేసులు చాలా తక్కువ.

"ఏమే పూర్ణా! చాలా జబ్బుపడ్డావుట. ఎలావుందో చూద్దామని వచ్చాను" అన్నారు.

అన్నపూర్ణమ్మ "శివసాలం లెక్క స్తున్నా" నంది.

"ఎన్యగాలివి. తల్లీ తండ్రీ లేని పిల్లల్ని ఆగుతుని పెంచి పెద్దవాళ్లను చేశావు వాళ్ల చేతుల్లోనే సుఖంగా నీ ఆఖరి తృణాలు

గడుపుతున్నారు. అంతకంటె కావాల్సిందేముంది?"

అన్నపూర్ణమ్మగారు నీరసంగా - "నేను వుండేది - భగవంతుడి దయ" అందంతే!

"వస్తానర్రా" అని ఆయన లేచి, తక్కిన వాళ్ళతో "అవసరమైతే మళ్ళీ కబురు చెయ్యండి" అని, "పూర్ణా! మందులు తప్పక తీసుకో. వాళ్లకు నీకన్నా పెద్ద దిక్కెవ్వరు? నువ్వెంత ఎక్కువ కాలం బతికితే అంత నయం వాళ్లకు" అని పూర్ణమ్మను హెచ్చరించి, వెళ్ళిపోయారు.

కాసేపు నిశ్శబ్దం—అన్నపూర్ణమ్మ వొగర్పు తప్ప కొద్దిసేపట్లో అదీ క్షీణించింది. అందరి మొహాలు దిగాలుపడి వున్నాయి—యుగాంతాన్ని ఎదురు చూస్తున్న ప్రజల మొహాల్లా.

ఉండుండి అన్నపూర్ణమ్మగారు "ధన్యురాల్నిట!" అని ఫక్కున నవ్వింది-మృత్యుగహ్వరంలోనుండి వినవస్తున్న నవ్వు - 'యముని కోరెనుబోతు మెడలోని ఇనుపగంటలు మోగి'నట్టున్న నవ్వు.

అందరూ ఉలిక్కిపడ్డారు.

"డెలీరియం కాదుకదా!" భాస్కరం అనుమానించినాడు.

"చూద్దాం ఉండు" అని రాముడు పరిశీలనలో పడ్డాడు.

"అదేమిటే ఆ నవ్వు" అన్నాడు కృష్ణుడు.

"అత్తగారూ అలా నవ్వకండి, ఆయాసం ఎక్కువవుతుంది" దని హెచ్చరించింది సీత.

[illegible] ఆవిడ్ని పట్టుకొని చూస్తోంది.

"ఎందుకు నవ్వుతున్నారు? అదృష్టవంతులు గాక మీకేం లోటు?" అంది భాస్కరం భార్య భానుమతి.

అన్నపూర్ణమ్మగారు నవ్వు ఆపింది. అందరూ వింతగా చూడసాగారు.

కొంతసేపున్నాక "ఇలా అంతా మంచం చుట్టూ కూచోండర్రా" అంది ఆవిడ. అందరూ మంత్రముగ్ధుల్లా ఆసీనులయ్యారు.

అన్నపూర్ణమ్మగారు ఆగి ఆగి, లేని ఓపిక తెచ్చిపెట్టుకుంటూ చెప్పసాగింది.

"అవును. మీ అందరికీ అలాగే అనిపిస్తుంది - నేను ధన్యురాల్నని, అదృష్టవంతురాల్నని. అందులో అబద్ధం ఏమీ లేదు. నా ఆఖరిరోజు లీవిగా వెడతాయని ఎవరూ అనుకోలేదు. అందుకే నేనూ సంతోషిస్తున్నా.

"కాని.. నా జీవితం మీకు పూర్తి తెలీదు-ఏదో అక్కడెక్కడా ఏవో కొన్ని సంఘటనలు కొందరికి మాత్రమే తెలుసు.

"ఈ తుదిఘడియలో మీకు నా హృదయంలో దాగిన ఆరాటాన్ని, మీకు తెలీని విషయాల్ని, చరిత్రకందని అంశాల్ని చెప్పి నా మనోభారం తగ్గించుకుందామని వుంది."

ఆగి వూపిరి తీసుకుంది. సీత గ్లాసోడు నీళ్లు అందించింది. అందరి ఆసక్తి అధికమై తల్లో, చెవులూ పెద్దవిచేసుకుని ఏకాగ్రతలో ఆలకిస్తున్నారు.

అన్నపూర్ణమ్మగారు మళ్లా అందుకుంది: "మాది చాలా గొప్ప కుటుంబం. చాలా ఆస్తిపరులు కూడా! మా వంశం పేరు దేశదేశాల్లో మారుమోగింది. మా యింట్లో రెండు ఆవులూ, మూడు గేదెలూ వుండేవి. నాకు జ్ఞాపకం వున్నంతవరకూ ఎప్పుడూ రెండు గాదెలకు తక్కువ కాకుండా ధాన్యం వుండేది. వచ్చిన నలుగురూ 'లేదు' అనే మాట వినకుండా భోజనంచేసి వెళ్లేవారు.

"నాకు పదేళ్ళు వచ్చేవరకూ మా స్థితి అంత మహోన్నతంగా వుండేది.

"తర్వాత పరిస్థితి దిగజారింది. నాన్న ఏదో బెల్లపు వర్తక మారంభించి పెద్ద దెబ్బతిన్నాడు. అదిగాక కొంతమంది ఆయన్ని పేకాటలోకి దింపారు. దాంతో ఆయన పాండిత్యమంతా గంగలో కల్సింది. మైసూరు మొదలైన సంస్థానాలు దర్శించి పొందిన 'గౌరీశ తీర్థోపాధ్యాయ' మున్నగు బిరుదులు నిష్ప్రయోజనాలయ్యాయి. త్వరలోనే ఆస్తి కరిగిపోయింది. ఉన్న ముప్ఫై ఎకరాలు ఎవరికో అమ్మి ఇల్లుమాత్రం దక్కించుకున్నాడు.

"ఆదుర్భరపరిస్థితుల్లోనే నాకు పెళ్ళి చెయ్యాలని తలుచుకున్నది మా మేనత్త. మా నాన్నాకి [illegible], తగిన సంబంధాలు ఏవీ సంబంధాలు దొరకపోతూ [illegible] రికి వయస్సు వారి బావకే ఇవ్వాలనుకున్నారు. అదే మా మేనత్తవేసిన ఎత్తుకూడా.

"మా బావ అమాయకుడు; అర్భకుడు; అనారోగ్యంతో ఎప్పుడూ బాధపడుతూ ఉండేవాడు. ఆయన్ని మా నాన్నే చదివించాడు. నాకు పెళ్లి చెయ్యాలనే భారాన్ని నాన్నపైనించి తొలగించి, ఆయనకు కృతజ్ఞత చూపాలనే వుద్దేశంతో, బావ మా వివాహానికి అంగీకరించాడు. మా పెళ్ళి వైభవంగా జరిగింది.

"కొన్నేళ్లు గడిచాయో లేదో, ఆయనకు జబ్బుగా వుందనే నాకుమీద నాన్న నన్ను వాళ్లవూరు తీసుకువెళ్లాడు. ఆయన మరణశయ్యపై పరుండే చిరునవ్వుతో నన్ను ఆహ్వానించారు. నాకు దగ్గరకు వెళ్లి సేవ చెయ్యాలనిపించేది. కాని అత్త ఒప్పలేదు. పైగా సిగ్గు.

"కొద్దిరోజుల తర్వాత ఆయన నా జీవితంలో నిప్పులుపోసి అంతర్థానమయ్యారు. నాకు పిచ్చెత్తినట్టయి విలపించాను. అంతే! అదే నా జీవితపు పునాదుల్ని కూల్చిన సంఘటన. నా కాళ్ళు నరికి వేయబడ్డట్టయింది. నాన్న ఎంతో దుఃఖించాడు - నా గొంతు కోసేనని. ఇంక నా అవస్థ దుర వస్థే! పన్నెండేళ్లకే వైధవ్యం సంప్రాప్తం కావడం కన్నా ఏ స్త్రీకిగాని జరగాల్సిన ఘోరం ఇంకేముంది?"

అన్నపూర్ణమ్మ గారి చెంపలపై నీటి ముత్యాలు దొర్లసాగాయి - కాసేపు ఆగి ఓపిక తెచ్చుకోసాగింది. మిగతా వాళ్లు ఆలోచనలు కట్టివేయబడినట్టు తెల్లబోయి చూస్తున్నారు.

"నేను మళ్ళీ అత్తారింటిముఖం తొక్కలేదు నాన్నదగ్గిరే వుండిపోయాను. నా భర్త పోవడం అమ్మకి భోగంపట్టినట్టయింది నాలుగు నెలు తిరగడంతోనే అంత పని నాకు అప్పగించి తను రాచిప్పలా కూచునేది. అది చూసిన నాకు తల్లిమీదే హేయభావం కలగనాగింది.

"కాలక్రమంగా మా నాన్న నా తరవాత మరో నలుగురికి పెళ్ళిళ్లు చేశాడు. మా మామయ్యలు కూడా చదువులు పూర్తై వుద్యోగాల్లో చేరారు. అంత బీదతనంలో వుండీ అందరికి ముత్తంమీద గొప్ప సంబంధాలే తెచ్చాడు—అంటే పెద్ద వుద్యోగస్తుల సంబంధాలు! ఆ పెళ్లిళ్లలో ఎక్కడా నా మొహం ఎవరికీ కనపడ నివ్వడానికి వీల్లేకపోయింది. 'శుభమన్లే పెళ్ళి వాదొస్తుంటే నువ్వెందుకే ఎదురు?' అనే వారు అంతవరకూ చాకిరి చేసినా, గత్యంతరం లేక ఓ మూల కూర్చొని బాధపడాల్సి వచ్చేది.

"అకస్మాత్తుగా మా అమ్మ పాము కరిచి చావడంతో [illegible] నాన్న దుఃఖసాగరంలో మునిగాడు. [illegible] పోయింది.

"అప్పటికి నాకు పాతికేళ్ళు దాటాయి. తన తమ్ముడు ఆచారానికి పనికిరాదని నా జుట్టు తీయించాలని కూచుంది మా అత్త! నేను ప్రతిఘటించాను. కాని వాళ్లు పంతం మానలే. నానా మాటలూ అన్నారు. చివరికి లొంబడక తప్పలేదు.

"ఆ వేళ ఎవరూ చూడకుండా అద్దంలో మొహం చూసుకున్నా—మళ్ళీ పది నాళ్లు తర్వాత. తల తీసినట్టయింది. 'ఛీ, ఏం ఆచారాలు!' అనిపించి, కొత్తగా భర్త పోయినట్టుగా విలపించాను. రాత్రి కలలో ఆయన కనపడ్డారు: 'ఇంకా బతికున్నా వెందుకు?' అని ప్రశ్నిస్తూ. ఆత్మహత్య చేసుకుందామనుకున్నా. కాని నాన్న? నాన్నకు దిక్కెవరు??

"ఏ దారి తొరిగి వచ్చిందో లేదో, ఏ శైశవ్వు నించిన నాన్న, ఇంటిమీద వెయ్యి రూపాయలు తెచ్చి, మళ్లీ పెళ్ళిచేసుకు వచ్చాడు. ఇంట్లో పాతికేళ్ల కూతురి వైధవ్యం తనకు పట్టనేలేదు - తన సుఖం గురించి ఆలోచించుకున్నాడంతే!

"ఆ దుర్గమ్మగారు వచ్చి నా చేతి పెత్తన

★ అన్నపూర్ణమ్మ అనుభవం ★

మంతా లాక్కుంది - ఇక్కట్లు బాపడానికి వచ్చిన ఇల్లాలుగా, ఏం చెయ్యను? అంతా కాస్తగతం చేశాను. నాన్నని పూర్తిగా లోబర్చుకుంది. అందరి రాకపోకలు, తిండి తిప్పలు ఆవిడ దయా ధర్మ భిక్షాలమీద ఆధారపడేవి. ఆవిడకి పిల్లలు పుట్టడం ఆరంభమవడంతో మా నాన్న మాకు ఇంకా దూరమయ్యాడు. మా పిన్నమ్మ అక్క పేరు జగ్గమ్మ. ఆవిడా విధవావిడే! చెల్లెలు సహాయానికి వొచ్చింది - లేనిపోని దుర్బుద్ధులు కొన్ని నేర్పి పెట్టడానికి. "ఈదుర్బుద్ధులతో బాటు నాన్న దారిద్ర్యంకూడా అధికమువ సాగింది.

"ఈ మధ్యలో పురుళ్లకనీ, పుణ్యకార్యాలకనీ ఆడ సహాయం కావల్సినవాళ్లకల్లా నేను తేరగా కనపడేదాన్ని.

"మీ అమ్మకు జబ్బుగావుంటే వచ్చాను. మళ్లీ మీ ఇల్లు విడవడం పడనేలేదు. మీ అమ్మ హాస్పిటల్‌లో పోయింది - మిమ్మల్ని నా చేతుల్లో వొదిలి.

"మరో మూడేళ్లలో మీ నాన్న హృద్రోగంతో మరణించాడు. వెంట వెంటనే భాస్కరం తల్లి, నా ఆఖరి చెల్లెలు రోగగ్రస్తులై మరణించారు.

"అప్పటికి మీతో మా నాన్న పూరు చేరాను. ఆయనకు ఎంతో కన్నుకుట్టింది. మీ ఆదరణభారం తలపై వేసుకుని మీ ఆస్థి కాజెయ్యాలనుకున్నాడు. భాస్కరం తండ్రి మళ్లీ పెళ్లాడాను.

"వరుసగా ఇన్నికష్టాలు ఎవరికీ సంప్రాప్తించవనుకుంటాను - భర్తా, తల్లీ, ముగ్గురు చెల్లెళ్ళు. ఇంతమంది పోవడం. ఒక్కొక్కళ్లి మరణం నామీద ఓ పిడుగులా పడేది. దిక్కులేని మీకోసం అహోరాత్రాలు విలపించేదాన్ని. దానితో కళ్ళకు పోట్లారంభమైనాయి. నాన్నని అడిగితే ఏదో కాటుక ఇప్పించాడు. నెలలో మసక చూపే మిగిలింది.

"విశాఖపట్నంలో ఒక్క కన్ను బాగు చేస్తామన్నారు. ఏవో జలగలూ అవీ పట్టించారు. ఆఖరికి వున్న చూపు పోగొట్టుకుని ఇంటి ముఖం పట్టాను. తర్వాత తోట్టి వైద్యాలు అవీ. కళ్లురాలేదు; ఖర్చు అయిందంతే!

"అలాగే అంధురాలై ఈ ఇరవైఏళ్ళు మిమ్మల్ని పెంచి పెద్దవాళ్లను చేశాను. మీ రంతా ఇప్పుడు వుద్యోగాల్లో వున్నారు. పెళ్లిళ్ళై పిల్లతండ్రు లయ్యారు. నా శరీరంలోని దారుఢ్యమంతా మీకే వినియోగించాను. అందులో అబద్ధంలేదు. అందుకే నన్ను అన్నివిధాలా అందరూ ప్రస్తుతించేది. మీకోసం మా నాన్నని కూడా ధిక్కరించాను."

అన్నపూర్ణమ్మగారు మళ్ళీ కాసేపు విశ్రాంతికని ఆగింది. అందరూ నిట్టూర్చి మళ్లీ పాత గాథల్ని వినడానికి సిద్ధమవసాగారు. భాస్కరం మరో డోసు మందు అందించాడు.

"కాసేపు విశ్రమించు. అనక చెప్పవచ్చులే" అన్నాడు రాముడు.

కాని అన్నపూర్ణమ్మగారు వెంటనే ఆరంభించింది: "ఇంక చెప్పాల్సిందేమీ లేదు. అంతా ఐపోయింది. ఈవేళ ఈ మృత్యుశయ్యమీద ఉన్న నన్ను 'నువ్వు సాధించిందేమిటి?' 'ఏమిటే నీ ఘనత?' అంటే ఏమీ లేదనే అనాలి. నేను చేసిందంతా నా 'విధి' గానే కన్పడుతుంది.

"నిజం చెప్పాలంటే నా బాల్యంలో ఆ పదేళ్ళూ ఏం సుఖపడ్డానో అంతే! మళ్ళీ సుఖమనేదే ఎరగను. ఏ స్త్రీ జీవితంగాని ఇంత కష్టభూయిష్ఠమై, ఇన్ని సమస్యలతో నిండివుంటుందనుకోను. జీవితంలో స్వంత సుఖమనేది ఎరగను. భర్తను ఎరగను. భర్తతోటి జీవితాన్ని ఎరగను. బిడ్డల్ని కనడం, సాకడం అసలే ఎరగను.

"అంతే కాదు. నా జీవితంలో అన్నిటికంటె ఆశ్చర్యకరమైన విషయం నా కన్యాత్వం చెడకపోవడమే. ఆడది జీవితమంతా కన్యగా జీవించడం ఎంత కష్టసాధ్యమైన విషయమో మీ ఊహల కతీతమైంకే! అదే నా జీవితంలో దారుణం! అవనిలో అతివ లెవరూ అనుభవించరాని అపూయిత్వం ఇది!

"మొగాళ్లు చెడ్డవాళ్లయితే ఆడవాళ్లు బాధపడ్డం ఉంటుంది. అకాల మరణం పొందుతారు; తల్లి తండ్రుల, అన్నల అనాదరణకి పాత్రులవుతారు; ఆస్తిలేక మలమల మాడిచస్తారు; అత్తల అధికార మధాంధతకీ, ఆడబడుచుల పోరుకీ బలిఅవుతారు; ముష్టి ఎత్తుకు బతుకుతారు; డబ్బుకోసం వ్యభిచరించి కని కష్టపుబతుకు బతుకుతారు. కాని ఇటువంటి అపూయిత్వం ఏ స్త్రీ జీవితంలోను ప్రాప్తించివుండదు.

"ఈ జీవితంలో భర్తా, భర్తతోటి సాంసారిక జీవితం చవిచూడకుండా నిష్కళంకంగా కన్యగా నా జీవితం ముగించాలని నన్ను సృష్టించడంలో భగవంతుడి ధ్యేయమై వుంటుంది."

అన్నపూర్ణమ్మగారు చెప్పడం ఆపింది. అంతసేపూ ఆవిడ కళ్లె వెంబడి కన్నీటిధారలు కారుతూనే వున్నాయి.

తక్కినవాళ్లంతా అశ్రుజలపూరిత నయనాల్తో, నోట మాటరాక కొయ్యబొమ్మలైయ్యారు.

అదీ కథ! తర్వాత కథతో మనకి ప్రసక్తి లేదు - ఆవిడ అనతికాలంలోనే శాశ్వతనిద్ర చెందిందనీ, తక్కినవాళ్లు దుఃఖితులయ్యారనేది మనకి ఊహాతీతమైన విషయం కాదు!

ఆనాటినుండి ఈ కథ విన్నవాళ్లు 'పాపం!' అని కన్నీటి ముత్యాలు రాల్చనివాళ్ళు లేరు. ★

వనితాలోకం:

అభిమానం

అనూరాధను పదకొండోఏట దసరా శెలవులకు పెత్తల్లి గారింటికి వాళ్ళమ్మ పంపడమే ఒకవిధంగా ఆపిల్ల మనస్తత్వం మారడానికి కారణమయింది. అంతవరకు స్కూల్లో చాలామంది పిల్లలు ఆమెకన్నా ఖరీదైన గుడ్డలు వేసుకుని వచ్చేవారు. ఆ వూరిలోనే చదువుకుంటూన్న పెత్తల్లి కొడుకు అప్పుడప్పుడు ఇంటికి వచ్చినప్పుడు ఆమెతండ్రికన్నా మంచి బట్టలు వేసుకుని వచ్చేవాడు. ఆమెకు, తమ్ముడికి ఏవేవో కొనితెచ్చేవాడు. అయితే అప్పుడంతా ఆమె మనస్సుకు ఏమీ తోచేదికాదు. కాని ఆమె వెలిసిపోయి అక్కడక్కడ చిరుగులు మాసికలతో వున్న పరికిణీలు చొక్కాలు వేసుకోవడం పెత్తల్లి గారి అమ్మాయిలు మంచిమంచి పువ్వుల పరికిణీలు అవీ ధరించడం; వాళ్లకు బోలెడు నగలు పట్టుబట్టలువుండడం, ఆమెకుమాత్రం ఒక్కటే ఒక్క మంచిపరికిణీ వుండడం, ఇలాటివన్నీ గమనించింది. దాంతోటి ఆమె మనస్సుకు ఆందోళన కలిగింది. ఇంతే కాదు. పెత్తల్లి గారింట్లో వంటకు, మిగతా పనులకు పనిమనుష్యులున్నారు. వాళ్ల ఇంట్లో అమ్మే వంట చెయ్యాలి. అనూరాధ అమ్మకు ఎంతో సహాయం చెయ్యాలి. అమ్మ పనిగావుంటే తమ్ముణ్ణి ఆమే ఆడించాలి. బజారుకువెళ్లి సామాన్లుకూడా తెస్తుంది అప్పుడప్పుడు. మరి ఇక్కడ పెత్తల్లి గారి అమ్మాయిలకు పనేలేదు. ఎప్పుడూ ఆట పాటలతో గడిచిపోతుంది. పెత్తల్లి భర్త, పెద్ద ఆఫీసరూ, బాగా డబ్బుగలవాడనీ, తన తండ్రి నూరురూపాయిల జీతంతో సంసారం ఈదాలనీ ఇంత ఆలోచన చేయలేకపోయింది ఆమె. కాకపోగా, ఈవైభోగమంతా వాళ్లకు వుండడమూ, తమకు లేకపోవడం, దీనిలో పెత్తల్లిదేవో తప్పుగా తోచింది. అంతే, దానితో ద్వేషం అంకురించింది.

పండగకు తన పిల్లలతోపాటు అనూరాధకుకూడా కొత్త పరికిణీ, చొక్కా కుట్టించింది పెత్తల్లి. కాని అవి వేసుకుందుకు ఆమెకు మనస్కరించలేదు. అందులో తనకేదో పెద్ద అవమానమనిపించింది. అయితే తనకు వేరే మంచిబట్టలు లేకపోవడంచేత అవి వేసుకోక తప్పలేదు. దానితో తన అశక్తత తలచుకుని వుడుకుమోత్తనం జాస్తీ అయింది. ఈవిధంగా అన్నిట్లోను 'అవమానం' అన్న ఒక్క భావమే వెతుకుతూ దసరాశెలవులంతా వ్యథతోను, వుక్రోషంతోనూ గడిపి శెలవు లాఖరుకాకముందే 'అమ్మను చూడాలని వుం'దని మారాంచేసి ఇంటికి వచ్చేసింది. అప్పటినుంచీ పెత్తల్లికొడుకు ఇంటకివస్తే అంత సరదాగా మాట్లాడేది కాదు. అతను ఏదైనా తెచ్చిఇచ్చినా, తప్పుగానే కనపడేది. తీసుకునేది కాదుకదా తనతమ్ముడు ఇసంతా తెలియక తీసుకుంటే వాణ్ణి కోప్పడేది. ఆపై దసరాశెలవులకుమళ్ళీ తనను పంపమని పెత్తల్లికోరినా తను వెళ్లలేదు.

కాలక్రమేణ ఆమె వయస్సుతోపాటు ఈ ద్వేషంకూడా పెరిగి, "నిజంగా వాళ్లు

వి. సుందరి

మనల్ని అవమానంచేస్తున్నారా? లేక మనమే వాళ్ల సదభిప్రాయాన్ని తప్పుగా తీసుకున్నామా? ఈ తారతమ్యానికి వాళ్లెలాగ బాధ్యులు?" అనే విచక్షణాజ్ఞానానికి చోటివ్వకుండా చేసింది. ఆమధ్య వాళ్ల నాన్నకు చాలా జబ్బుచేసి సంసారం గడవడంకూడా కష్టంగావున్నప్పుడు పెత్తల్లి డబ్బు పంపిస్తే అది తీసుకున్నందుకు తన తల్లిని తూలనాడింది. 'నాకు వుంది. మీకు లేదు'అని చూపేందుకు గర్వానికి ఈవిధంగా సహాయంచేస్తూన్నట్లు నటిస్తుంది పెత్తల్లి, అని చీదరించుకుంది. ఇట్టి అపోహ తగదని వాళ్లమ్మ ఎంత నచ్చచెప్పచూచినా ఆమెకు ఆగ్రహం హెచ్చిందేకాని వేరేలాభం లేకపోయింది.

తన పెండ్లికి పెత్తల్లివస్తే ఆమెతో ముక్తసరిగా ఏవో నాలుగు మాటలు మాట్లాడి ఊరుకోవాలనుకుంది. అయితే పెండ్లి కానుకగా ఆమె తెచ్చిన బంగారుగొలుసు చూడగానే తలకొట్టేసినంతఅవమానమనిపించింది. ఏమంటే తండ్రి తనకు తెచ్చిన సంబంధం తమతాహతుకు తగినదేకాని, పెద్ద డబ్బున్నవాళ్లు కారు. తన అత్తింటివాళ్ళు, పుట్టింటివాళ్ళుకూడా పెట్టలేని నగ తన పెత్తల్లి ఇచ్చి, 'అందరిలోను ఇదిగో చూచారా నాగొప్ప' అని చాటుకుంటున్నదని అక్కసుపడి క్రుంగిపోయింది. దాంతో అనగ వేసుకోనూలేదు, ఇంక పెత్తల్లితో మాట్లాడనూలేదు.

భర్త సంపాదన తక్కువే అయినా, పొదుపుగా సంసారంచేస్తూ, నేర్పుగా ఇల్లు సరిదిద్దుకుంటూ భర్త ఆదరాన్ని మెప్పును పొందింది. ఆమె అదృష్టమే కావచ్చు. భర్త కృషిఫలితమే కావచ్చు. అతనికి త్వరలోనే ప్రమోషనై ఆమెకు మంచిరోజులు వచ్చినాయి. ఆమె కిప్పుడు అష్టైశ్వర్యాలు లేకపోయినా రోజులు హాయిగా గడుస్తున్నాయి.

ఇంతలో అనూరాధ తండ్రి హఠాత్తుగా కాలంచేశాడు. తమ్ముడు గుమాస్తా గిరీకి అప్లికేషను దాఖలు చేస్తానన్నాడు. తనకిది ఎంతమాత్రమూ ఇష్టంలేదు. తనకు బిడ్డా, పాపలేరు. భగవంతు డింత ఇచ్చాడు. తమ్ముణ్ణి తాను పెద్ద చదువు చదివించి, గొప్ప ఉద్యోగవంతు డయ్యేట్లు చూస్తానంది. తమ్ముడు మండిపడ్డాడు. "నీకీనాడు దశ వచ్చింది. మేము తక్కువస్థితిలో వున్నామని మమ్మల్ని అవమానం చేస్తావా? నీముష్టి మాకక్కర్లేదు"ని ఛీత్కరించాడు. అనూరాధ నిశ్చేష్టురాలైంది. తల్లితో తమ్ముడు తననీవిధంగా అపార్థం చేసుకున్నాడని చెప్పి ఏడ్చింది.

"అవును. నీకు తమ్ముడువాడు. నువ్వు మీ పెత్తల్లిచేసిందంతా అపార్థం చేసుకోలేదా? నాకష్టం చూడలేక అది సహాయం చెయ్యబోతే అభిమానంతో నువ్వు ఆగ్రహపడలేదా! ఇప్పుడు నీవు సద్బుద్ధితో చెయ్యబోయినా నీతమ్ముడు అదే అభిమానంతో అపార్థం చేసుకున్నాడు. నేనేంచేసేది" అంది తల్లి. కోపంతోను, దుఃఖంతోను, ఇంటికి వెళ్ళిపోయింది అనూరాధ. కాని రోజుకురోజు ఈ సంఘటన ఆలోచించగా తనతప్పు తనకు స్పష్టమైంది. ఇన్నాళ్ళకు బుద్ధి వికసించి ద్వేషాన్ని మాపుకోగలిగింది.

ఆనాడు విజయదశమి. దాదాపు పదిహేనేళ్ళతర్వాత అకస్మాత్తుగా అనూరాధ పెత్తల్లి గారింటికి వెళ్ళింది. పెండ్లిలో పెత్తల్లిఇచ్చిన నగ, ఆమె మెడలో ఆరోజు క్రొత్తవెలుగులు మెరిపిస్తుంది. తలవని తలంపుగా లోపలికివస్తూన్న అనూరాధను చూచి, పలకరించేందుకైనా నోటమాట రాలేదు ఆ పెత్తల్లికి. దగ్గరికి వచ్చి నమస్కరించబోతూన్న అనూరాధనుమాత్రం హృదయానికి హత్తుకుంది. ★

మరాటీ కథ

కవిరావు

★

ఎప్పుడూ పనియంచు
తప్పుకొంటుంటావు
కాదనక నేడైన
కథచెప్పవే, అమ్మా!
    ఎప్పుడూ పనియంచు
    తప్పుకొంటుంటావు.
ఆడుకొనుటకు నాకు
ఆసక్తిగా లేదు,
ముసురు క్రమ్మెను పైన
మసక బడిపోయింది.

మేఘాలు గర్జించి
మీద బడుతున్నాయి,
ముసురు, ఈదరగాలి
కసరి కొట్టుచునుండె;
పిడుగు పడుననిలోన
బిడెము బిడెముగవుంది.
ఒడిలోనె కూర్చుందు
విడిచిపోవను నిన్ను;
    కాదనక నేడైన
    కథచెప్పవే, అమ్మా!
ఏడు సంద్రాలవల
దీవిలో నొకపుట్ట,
పుట్టపైనొక మఱ్ఱి
చెట్టు వుంటుందనీ;

మఱ్ఱిచెట్టున నున్న
తొఱ్ఱలోగా పోగ
కోటలో 'మాయలమ
రాటి' వుంటాడనీ;

కోడెత్రాచులు చుట్టు
కొనిన పంజరమనీ,
అందులో ఒకచిలుక
అతని ప్రాణంబనీ;

చిలుక ప్రాణము దీసి
చెఱలోన పడియున్న
రాకుమారిని గావ
రాకుమారుడు వచ్చు.

కారు మేఘాలలో
ఘోర వర్షంబులో
ఢోర గుఱ్ఱము నెక్కి
స్వారి చేస్తూ తుదకు,

చీమల్లు దూరని
చిట్టడవులను దాటి,
గండ భేరుండాలు
గల యరణ్యముగడచి,

అతడు వెదుకుచువచ్చు
ఆరోజు నేటివలె
ఉండునిజముగ దాని
నూహించు కొనగలను
    కాదనక నేడైన
    కథచెప్పవే, అమ్మా!

కారుమేఘాలిట్లె
గర్జించు చున్నపుడు,
మెఱుపు మెఱుపుకు కండ్లు
చిరుతలాడే వేళ;
తండ్రి చెఱయుండుంచ
తనమీదె ప్రాణాలు
పెట్టుకొని, బాధతో
కొట్టుమిట్టాడుచు కుమిలి
ముక్కిపోయిన పాడు
మొక్కజొన్నలు తినెను
తల్లినప్పుడు తాను
తలచుకొనదా? అమ్మా!
    కాదనక నేడైన
    కథచెప్పవే, అమ్మా!
ఆకాశమున మబ్బు
లావరించుచు నుండె,
భీకరముగా చిమ్మ
చీకటులు క్రమ్మినవి.
పనిపాటలను మాని
ప్రజలెల్ల మబ్బులను
చూర్లక్రిందుగ తొంగి
చూచుచుండిరి రదుగో!

పుస్తకాలను దాచి
పెట్టియుంచితి నమ్మ
చదువు, నేతర్వాత
చదువుకొందును లేవె,

చదువు చదువని నన్ను
చంపకే ఓయమ్మ!
నేను నాన్నంతైతే
నేర్చుకో గలనపుడె
    కాదనక నేడైన
    కథచెప్పవే అమ్మా!
    ఎప్పుడూ పనియంచు
    తప్పుకొంటుంటావు

—ఆధారం: టాగోర్



బొమ్మరిల్లు సీరియల్

టామ్‌సాయర్ ప్రపంచ యాత్ర

మూలం మార్క్‌ట్వేన్

ఈ సీరియల్ టామ్‌సాయర్, హకల్ బెరీఫిన్ నవలలకు తరువాత జరిగిన కథను తెలుపుతుంది. "హకల్ బెరీఫిన్" నవలలో మాదిరిగానే ఈ నవలలో కూడా హకల్ బెరీఫిన్ అనే కుర్రవాడే కథ చెబుతాడు. ఈ నవలలో టామ్‌సాయర్ అనే మరో కుర్రవాడూ, హకల్ బెరీఫిన్, వీళ్ళ స్నేహితుడైన జిమ్ అనే నీగ్రో ముఖ్యపాత్రలు. టామ్‌సాయర్‌కు ఎప్పుడూ ఏదో సాహసం చేస్తూనే వుండాలని, తన పేరు దేశదేశాల్లో మోగిపోతూ వుండాలనీ కోరిక. అంచేత ఇదివరకు చేసిన సాహసాలతో తృప్తిపడక, కొత్తవాటికోసం చాలా ప్లాను వేస్తాడు. కాని మిగతా వాళ్ళిద్దరూ అతని ప్లాన్లు అన్నిటినీ తోసివేస్తారు. ఏంచేయడానికీ పాలుపోకుండా వున్న సమయంలో, ఒక ప్రొఫెసరు బెలూన్‌లో యూరప్ ఖండానికి బయలుదేరనున్నట్టు వాళ్ళకి తెలుస్తుంది. అది చూసివద్దామని వెళ్ళిన టామ్, హక్, జిమ్ ముగ్గుర్నీ ప్రొఫెసరు లోపలికి రానిచ్చి హఠాత్తుగా బెలూన్‌ను బయలుదేర దీస్తాడు. యూరప్ ప్రయాణమై పోతున్న విమానంలో ముగ్గురు మిత్రులు నిర్ఘాంతపోయి కూర్చున్నారు. మార్గమధ్యంలో ప్రొఫెసరు తెగ తాగి సముద్రంలో పడి మరణిస్తాడు. బెలూన్ నడపడం టామ్ నేర్చుకున్నందున ప్రయాణం క్షేమంగానే సాగింది. కాని విమానం యూరప్ పోవడానికి బదులు సహారా ఎడారిలో ప్రవేశించింది. ఆ దారిలో వారికి సింహాలగుంపు ఒకటి, వర్తకుల బిడారం, దొంగల సమూహం మొదలైనవెన్నో ఎదురయ్యాయి. ఒకసారి వారికి అమితమైన దాహం వేసింది. ఎంతో దూరంపోగా, ఎంతో అవస్థపడగా చివరికొక చల్లని జలాశయం కనబడింది. అక్కడ సేదదీర్చుకున్నారు.

12

ఇసక పారబోయడం పూర్తవడంతో ఆకలి దహించుకు పోసాగింది. కాని మేము దాచుకున్న భోజన పదార్థాలనిండా ఇసక పడింది. అలాగే దులుపుకుని తిన్నాము. ఆకలి మండిపోతున్నప్పుడు ఇసక, మట్టి అడ్డం వస్తాయా? ఆకలిగా లేనప్పుడు ఎంతమంచి పదార్థాలు తిన్నా తృప్తికలగనట్టే, ఆకలిగా ఉన్నప్పుడు ఏ చెత్తతిన్నా తృప్తిగా వుంటుంది.

చివరికి మేము ఎడారి తూర్పు కొనచేరుకున్నాము. ఇసక అంతమైపోయినచోట మూడు కట్టడాలు కనిపించాయి. గుడారాలవలె పైకి పోనుపోను

కోసుదేరివున్నాయి. వాటిని చూడగానే టామ్ "అవిగో ఈజిప్షన్ పిరమిడ్లు," అన్నాడు.

నాగుండె ఝల్లుమన్నది. నేను ఎన్నోసార్లు పిరమిడుల బొమ్మలుచూశాను. వాటినిగూర్చి చెబుతుండగా విన్నాను. కాని హఠాత్తుగా, అనుకోకుండా వాటిని యథార్థంగా చూడడం, అవి ఊహాకల్పితాలు కాదని, నిజంగా భూమిమీద ఉన్న కట్టడాలేనని గ్రహించడం ఎంతఆశ్చర్య జనకమైనదో చెప్పలేను. ఒక మహాపురుషుణ్ణిగూర్చి, లేక ఒకఅద్భుత వస్తువును గూర్చి కొన్నివందలసార్లు వినగావినగా, ఆమహాపురుషుడు కేవలం కల్పితవ్యక్తియేమో, ఆ అద్భుతవస్తువు ఊహాజనితమేమో అనిఅనుమానం బయలుదేరుతుంది. జార్జివాషింగ్టన్ అనేమనిషి అసలు నిజంగా ఉండేవాడా లేక కట్టుకథల్లోనివాడా అని నాకిప్పటికీ అనుమానం. అలాగే ఈపిరమిడులను గూర్చికూడా సందేహంగా వుండేది.

ఆ సందేహం కలగడానికి బలమైన కారణాలున్నాయి. ఒకసారి ఒకాయన మాబళ్లోకివచ్చి పిరమిడులనుగూర్చి ఉపన్యాసమిచ్చాడు. అన్నిటిలోకి పెద్దదైన పిరమిడ్ పదమూడెకరాల స్థలం ఆక్రమించుకుని వుంటుందని, అయిదువందల అడుగులఎత్తు వుంటుందని, అది రాతిపలకలతో కట్టబడిందనీ, ఒక్కొక్క పలక పెద్ద బీరువాఅంతవుంటుందనీ, వాటిని ఒక దాని మీద ఒకటిగా మేడ మెట్లలాగాపేర్చి పోనుపోను కోసుదేలి వుండేటట్లు కడతారనీ ఆయనచెప్పాడు. ఒక్కకట్టడానికి పదమూడెకరాలా? అంటే ఒకపెద్దపొలమంత స్థలమా? ఎవడన్నా నమ్ముతాడా? నేనుమాత్రం నమ్మలేదు. పైగా పిరమిడ్‌లో మధ్యగా ఒకబిలం వుంటుందట. ఆ బిలంలోకి కాగడాలు పట్టుకుని పోవచ్చునట. అలా పోగాపోగా పిరమిడ్ మధ్యభాగంలో ఒక పెద్దరాతిపెట్టెవుంటుందట. అందులో నాలుగువేల సంవత్సరాల కిందటి రాజుగారు ఇంకా వుంటాడట. ఇంతపచ్చి అబద్ధం ఇంకెక్కడన్నా వుంటుందా? నాలుగువేల సంవత్సరాలు ఏమనిషన్నా బతుకుతాడా అసలు?

ఎడారి చివరకు వస్తున్నకొద్దీ ఎడారి అంచూ, అవతల పచ్చికమైదానపు పచ్చనిఅంచూ దేనికది విడివిడిగా కనిపించాయి. పచ్చని మైదానం మధ్యలో పాములాగ మెలికలుతిరిగిన ఒకగీత కనిపించింది. అది నైలునది అన్నాడుటామ్. నాగుండె మళ్ళీజల్లుమంది. ఎందుకంటే నైలునదికూడా కల్పించినదేగాని నిజంగా వున్నదనినే నెప్పుడూ అనుకోలేదు.

అది నిజంగా ఈజిప్టుదేశమేనని నమ్మకంకుదిరిన తర్వాత జిమ్ టోపీ తీసేసి భక్తి వినయాలతో నమస్కరించాడు. ఈజిప్టులాంటి పవిత్రదేశంలోకి తనలాంటి నీగ్రోవాడు నుంచుని ప్రవేశించడం పాపమన్నాడు. ఏదేశంలో మోజెస్, జోసెఫ్, ఫరావో మొదలైన దైవభక్తులు ఉండేవారో ఆ దేశం కళ్లారా చూడగలిగినందుకు తన జన్మ తరించిపోయిందన్నాడు. "ఆహా! ఈజిప్టును ప్రత్యక్షంగా చూడగలుగుతున్నాను. ఏమి నాభాగ్యం! ధన్యుణ్ణి!" అని వెక్కివెక్కియేడ్చాడు. జోసెఫ్, మోజెస్, జేకబ్ మొదలైన ప్రవక్తలందర్నీ తలుచుకున్నకొద్దీ ఈజిప్టుదేశాన్ని చూడగలిగినందుకు అతని ఆనందం అతిశయించింది. టామ్‌కూడా ఆనందం పట్టలేకపోయాడు. కాని అతని ఆనందానికికారణం మోజెస్ వగైరాలుకాదు. నూరుద్దీన్, బద్రుద్దీన్, పెద్ద పెద్దరాక్షసులు, మాంత్రికులు, భూతాలు నివసించేదేశాన్ని చూడగలిగినందుకు అతడు సంతోషపడ్డాడు. వారందరూ అరేబియన్ నైట్సుకథల్లోని మనుషులు. అవన్నీ కల్పితాలని నాకు పెద్ద అనుమానం.

ఇంతలో పొగమంచు వ్యాపించడం మొదలెట్టింది. ఈ పొగమంచునుదాటి ఇంకా ఎత్తుగా పోయి ప్రయాణం చేద్దామనుకున్నాము కాని అలాగైతే ఈజిప్టును చూసే అవకాశం కలగదు. అందుచేత అప్పుడే పొగమంచులో అదృశ్యమైపోతున్న పిరమిడులకేసి దిక్కుచిని అమర్చుకుని, బాగా కిందుగా విమానాన్ని పోనిచ్చాము. టామ్ విమానం నడుపుతున్నాడు. పొగమంచు అంతకంతకు దట్టంగా అలముకుంటోంది. అలా నెమ్మదిగా ఒక గంటసేపు పోగా పోగా పొగమంచు ఉన్నట్టుండి విచ్చిపోయింది. జిమ్ భయవిహ్వలుడై వెర్రికేక వేశాడు.

"టామ్ గారూ! ఆగండి. విమానం వెనక్కి పోనివ్వండి. ఇక్కడేదో పెద్ద బ్రహ్మరాక్షసి వుంది.

"మనమీదికే వస్తోంది," అంటూ జిమ్ వెనక్కి త్రుళ్లి పడ్డాడు.

టామ్ ఇంజను ఆపుచేసి నెమ్మదిగా వెనక్కి పోనిచ్చి మళ్లీ ఆపాడు. మాయెదురుగా ఒక పెద్ద దయ్యం తలకాయ కనిపించింది. ఆతల పరిమాణం సరిగ్గా ఒక పెద్దయిల్లు అంత వుంది. కళ్లు కిటికీలవలె తెరుచుకుని మాకేసే చూస్తున్నాయి. చూసీ చూడగానే నేను కిందపడి చచ్చిపోయాను. ఒకనిమిషమో రెండునిమిషాలో అలా చచ్చిపోయి మళ్లీ తేరుకుని లేచాను. టామ్ ఒక పొడుగాటి కర్రను దయ్యం కింది పెదవిలో నొక్కిపట్టి విమానాన్ని నిలబెట్టాడు. దయ్యంకేసి తీక్షణంగా చూసి పరిశీలిస్తున్నాడు. జిమ్ మోకరించి తీవ్రంగా ప్రార్థన చేస్తున్నాడు. కనికరించమని దయ్యాన్ని బతిమాలుకుంటున్నట్టు ఏదో గొణిగాడు. నేనొక్కసారి తలెత్తిచూసి మళ్లీ దాక్కున్నాను. ఇంతలో టామ్ ధైర్యంగా ఇలా అన్నాడు: "అది మనిషీ కాదు, దయ్యమూ కాదు. స్ఫింక్స్ అంటారే? అదీ. ఇది విగ్రహంతప్ప మరేం కాదు. మనకేం భయం లేదు."

టామ్ ఒక చిన్న నలుసులా కనిపించాడు. దానికి కారణం అతని ఎదురుగా వున్న తలకాయ బ్రహ్మాండమైన పరిమాణంలో వుండడమే. అబ్బ, ఎంత పెద్దతల అని చెప్పను! చిత్రమేమంటే అది అంత పెద్దదిగావున్నా భయంకరంగా లేదు. దాన్ని చూస్తుంటే భయంకన్నా పూజ్యభావమే ఎక్కువ కలుగుతుంది. ఏదో అవ్యక్తమైన విషాదం, గాంభీర్యం ఆముఖంలో గోచరమవుతున్నది. మనకేసిచూస్తున్నట్టు కనబడినా మనని గూర్చి ఆలోచిస్తున్నట్టు అనిపించలేదు. మనకంటె ముఖ్యమైన, విశాలమైన, ఉన్నతమైన విషయాలాలోచిస్తున్నట్టు అనిపించింది. అది రాతి విగ్రహం. ఎర్రటి రాతి విగ్రహం. ముక్కు చెవులు కాలప్రభావానికిలోనై దెబ్బతిన్నాయి. ఎవరో దానికి అన్యాయం చేసినట్టు జాలి కలిగింది.

కొంత దూరం వెనక్కి వెళ్లి విగ్రహం చూశాము. తరవాత దానిచుటూ ఒకసారి తిరిగాము. మరొకసారి విగ్రహానికి పైగా విమానాన్ని నిలిపి చూశాము. ఎటునుంచి చూసినా అది అద్భుతంగా వున్నది. అది మానవ శిరస్సువలె, బహుశా స్త్రీ శిరస్సువలె కనిపిస్తున్నది. శిరస్సుతప్ప మిగతా శరీరమంతా సింహపు శరీరం. దాదాపు నూటపాతిక అడుగుల పొడవైన శరీరం వున్నది. ముందరిపాదాల మధ్య ఒక చిన్న దేవాలయం వున్నది. ఇంతకు పూర్వం కొన్నివందల సంవత్సరాలకాలం, బహుశా కొన్నివేల సంవత్సరాల కాలమైనా అయివుండవచ్చు, ఆ విగ్రహ శరీరం ఇసకలో పూడిపోయి వుండేదట. ఈ మధ్యనే అదంతా తవ్వి తీశారట.

ఆ శిరస్సు పైభాగాన జిమ్‌నుదింపి నుంచోమన్నాము. అది పరాయిదేశం కనుక అతనికెవరూ ఏహానీ చేయకుండా అమెరికన్ పతాకం చేతుల్లో పట్టుకోమని చెప్పాము. ఆతర్వాత మేము ఏకోణంలోచూస్తే ఎలావుంటుందో, ఎంత దూరంలో వుండిచూస్తే ఎలా వుంటుందో పరిశీలించడానికి విగ్రహానికి దూరంగా పోయాము. మా పరిశీలనకు వీలుగా జిమ్ రకరకాల భంగిమలలో నుంచున్నాడు, కూర్చున్నాడు.

మేము దూరంగా పోయినకొద్దీ జిమ్ చిన్నవాడైపోయి, స్ఫింక్స్ గంభీరంగా కనబడింది. చివరికి ఒక కొంతదూరంలో నిలబడిచూస్తే జిమ్ ఒక గుండుసూదిలాగ కనబడ్డాడు. విగ్రహం ఇదివరకటి కంటె అద్భుతంగాను, సుందరంగాను కనబడింది. దూరాన్ని బట్టి పరిమాణ తారతమ్యం బాగా బోధపడుతుందని, వస్తువు పెద్దదైనకొద్దీ దూరంనుంచి చూడాలనీ టామ్ అన్నాడు. "జూలియస్ సీజరు దగ్గిర పనిచేసే నౌకర్లకు అతడి గొప్పదనం తెలియదు. ఎందుకంటే వాళ్లు అతని దగ్గిరే నిత్యమూ మసులుతూ వుండేవారు కనుక," అన్నాడు.

ఇంకాదూరం పోయాము పోగా పోగా జిమ్ అసలు కనిపించనేలేదు. శిరస్సుమాత్రమే ఉదాత్తంగా, ఏవో ఏకాంత గంభీర భావాలు భావిస్తూ ఉన్నట్టు కనిపించింది. చుట్టూ విశాలమైన నైలునది మైదానం పరుచుకొని వుంది.

అక్కడే ఒక అరగంటసేపాగి విగ్రహంకేసి చూస్తూ, ఆలోచిస్తూ కూర్చున్నాము. ఆ శిరస్సు ఆప్రదేశంలో కొన్నివేల సంవత్సరాలనుండీ ఏం చేస్తోందో ఎవరికి తెలుసు?

నేను దూరదర్శిని తీసుకుని చూశాను. ఏవో చిన్న చిన్న నల్లని జంతువులు విగ్రహంచుట్టూ కదులుతూన్నట్టు, విగ్రహంమీదికి ఎక్కడానికి ప్రయత్నిస్తున్నట్లు, ఉండి ఉండి తెల్లని పొగవస్తు

న్నట్టు కనబడింది. టామ్‌తో చూడమని చెప్పాను. అతడుకూడా చూశాడు.

"ఆ, ఏంలేదు. నల్లులనుకుంటాను. అరె! కాదు, ఆగు. అవి నల్లులు కాదు, మనుషులు. అవిగో గుర్రాలుకూడా కనిపిస్తున్నాయి. కొందరు పెద్దనిచ్చెన తీసుకొస్తున్నారు, విగ్రహం మీది కెక్కడానికిగావును. చిత్రంగాఉందే? అదేమిటి పొగ వస్తోంది? హాక్! అవితుపాకులు! వాళ్లు పేలుస్తున్నారు. అన్నట్టు జిమ్‌ఉన్నాడుగదూ? ప్రమాదంలో పడ్డాడు. పదపద," అంటూ విమానాన్ని బయలుదేర దీశాడు. రెండునిమిషాల్లో అక్కడికి చేరుకుని మనుషుల మీదుగా పోనిచ్చాము మమ్మల్ని చూడగానే జనం చెల్లాచెదరై తలోదిక్కూ పారిపోయారు. విగ్రహం మీదికి నిచ్చెనలు వేసి ఎక్కబోతున్నవాళ్లు విమానం కంటబడగానే హాహాకారాలు చేస్తూకిందబడి పోయారు. జిమ్ మేమతన్నివదిలిపెట్టి వెళ్లినచోటనే వున్నాడు. కాని నోటమాటరాక వగరుస్తూన్నాడు. రక్షణకోసం అరిచిఅరిచి అలిసిపోయివున్నాడు కొన్ని వేలమంది జనం తన్ను చుట్టుముట్టిఫిరంగులు పేల్చారనీ, "వారంరోజులుగా" ఆముట్టడిమధ్య ఇరుక్కుపోయి అవస్థ పడ్డానని జిమ్ అన్నాడు తుపాకిగుండ్లు తగలకుండా అతడు విగ్రహం నెత్తిమీద పడుకున్నాడట. ఎన్ని సార్లు తుపాకులు పేల్చినా అతనికి తగలక పోవడంచూసి ఆమనుషులు నిచ్చెనలు తెచ్చి పైకెక్కడానికి ప్రయత్నించారట. నిచ్చెనలు తేవడం చూసి తనపని ఆఖరేనను కున్నాడటజిమ్. మేము సమయానికి కనిపెట్టిరాకపోతే నిజంగా అతనిపని ఆఖరయివుండేదే. వారి అనాగరిక ప్రవర్తనకు టామ్‌కు చాలా కోపంవచ్చింది. "అమెరికన్‌జెండాఎత్తి చూపకపోయావా? హడిలిపోయి పారిపోయివుండేవాళ్లు!" అని అడిగాడు. జిమ్ తను జెండా చూపించాననీ, అయినా వాళ్లెవరూ దాన్ని లెక్క చెయ్యలేదనీ అన్నాడు. టామ్ తీవ్రంగా ఆలోచించి ఈ సంగతి వాషింగ్టన్ వెళ్ళినతరువాత ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలన్నాడు.

"మన జెండాను అవమానించినందుకు వాళ్లు క్షమాపణ చెప్పుకొనేట్లు, పరిహారంకూడా చెల్లించు కునేట్లు చేస్తాను చూడు," అన్నాడుటామ్

"పరిహారంఅంటే ఏమిటిటామ్‌గారూ?" అడిగాడుజిమ్.

"డబ్బు" అన్నాడుటామ్.

"ఎవరికి వస్తుందిడబ్బు?"

"ఇంకెవరికీ? మనకే"

"క్షమాపణ ఎవరికి?"

"అమెరికా ప్రభుత్వానికి. మనఇష్టం. ఏది కావాలంటే అదే తీసుకోవచ్చును. క్షమాపణ కావాలంటే క్షమాపణే తీసుకుని డబ్బు ప్రభుత్వానికిచ్చి వెయ్యవచ్చును."

"ఎంతడబ్బిస్తారు టామ్‌గారూ?"

"ఇప్పుడు మనకి జరిగిన అవమానం చాలా తీవ్రమైంది కనుక, కనీసం మూడుడాలర్లయినా ఇస్తారనుకుంటాను. ఇంకా ఎక్కువిచ్చినా ఇవ్వవచ్చు."

"ఇంకేం? అదిచాలు వెధవక్షమాపణ ఎవడికాావాలి? డబ్బేతీసుకుందామండి మనం. ఏమంటావు హాక్?"

కొంతసేపు చర్చించిన మీదట డబ్బుతీసుకోవటానికే అంగీకరించాము అసలు ఈ క్షమాపణ, పరిహారం వ్యవహారం నాకు కొత్తగావుంది. అందుకని టామ్‌ను అడిగాను, తప్పుచేసిన దేశాలు విధిగా క్షమాపణ కోరుకోవలసిందేనా అని.

"అవును చిన్నదేశాలయితే విధిగా కోరుకుంటాయి," అన్నాడు టామ్

పిరమిడులను పరీక్షిస్తూ కొంతసేపు వాటి చుట్టూ ప్రదక్షిణాలు చేశాము. అన్నిటికంటె ఎత్తుగా వున్న ఒక పిరమిడ్ మీద చదునుగావున్న భాగం చూసి అక్కడ వాలాము. పైనుంచి చూస్తే, అది మేమిదివరలో విన్నవిధంగానే వుంది కింద విశాలంగా ప్రారంభమవుతుంది, పైకి రానురాను కోసుగావుంటుంది. మెట్లుమెట్లుగా అమర్చబడిన రాతిపలకలతో పిరమిడ్ కట్టబడినది ఆమెట్లుమేడమెట్లులాగానే వుంటాయి. కాని సులభంగా ఎక్కడానికి వీలుండదు. ఒకమెట్టు మీద నుంచుంటే పైమెట్టు సరిగ్గా మనంత ఎత్తున వుంటుంది వెనకనుంచి ఎవరన్నా మనిషి ఎత్తితేగాని ఎక్కలేము. మరోరెండు పిరమిడులు కొంతదూరంలో వున్నాయి వాటిమధ్య ఇసుకమీద నడుస్తున్న మనుషులు మేమున్న ఎత్తునుంచి చీమల్లా కనిపించారు.

టామ్ తన అదృష్టానికి సంతోషం పట్టలేక పోతున్నాడు. ఏ ప్రదేశంనుంచి అయితే అరేబియన్ నైట్సులోని రాజకుమారుడు కంచు గుర్రంమీద ఎక్కి పైకి ఎగిరిపోయాడో ఆ ప్రదేశంలోనే తానిప్పుడు నుంచోడం ఎంతో గొప్ప అదృష్టమని ఉప్పొంగిపోయాడు. అతన్ని చూస్తే ప్రతిరోమకూపంనుంచీ చారిత్రిక సంఘటనలను వెలిగక్కుతున్నాడా అనిపించింది. ఒకానొక రాకుమారుడికి ఎవరో ఒక కంచు గుర్రాన్ని బహూకరించారట. ఆ గుర్రానికి ఒక చెవిలో ఒక మర వున్నదట. ఆ మర తిప్పితే గుర్రం ఆకాశంలో పక్షిలాగా రివ్వున ఎగిరి పోతుందట. ఆ మరద్వారా గుర్రాన్ని ఎటు పడితే అటు పోనివ్వ వచ్చునట. కిందికి దిగాలన్నా, పైకిపోవాలన్నా ఆ మర తిప్పితే చాలట. ఈ విధంగా టామ్ ఆ గుర్రాన్ని వర్ణించాడు. ఈ వర్ణన విన్నతరవాత అందరం మౌనంగా వుండిపోయాము. టామ్ చెబుతున్నది అబద్ధమని మాకు తెలుసు, అతనికీ తెలుసు తెలిసికూడా మమ్మల్ని నమ్మించడానికి అతను ప్రయత్నించడం, తనుకూడా నమ్ముతున్నట్లు నటించడంచూస్తే మాకు చాలా విచారం కలిగింది. అలా కొంతసేపు ఎవరం మాట్లాడలేదు. టామ్ ఒకనిమిషంపాటు నావంక తీవ్రంగా చూశాడు.

"హాక్! ఆ చెప్పదలచుకున్నదేదో చెప్పెయ్య రాదూ?"

"టామ్! నువ్వు చెప్పేదానిమీద కనీసం నీకైనా నమ్మకం వుందా?"

"ఎందుకు నమ్మకం వుండకూడదూ? నేను చెప్పిన దాంట్లో అసంబద్ధం ఏముంది?

"అలా జరగడం అసంభవమని నా ఉద్దేశం," అన్నాను.

"ఎందుకు జరగకూడదు?"

"ఎందుకు జరగాలో చెప్పునువ్వు."

"ఇదుగో ఈవిమానం ఆకాశంలో ఎగరడంలా? అలాగే గుర్రమూ ఎగురుతుంది"

"ఎందుచేత?"

"ఎందుచేతేమిటి నీ మొహం ఈ విమానానికి, కంచుగుర్రానికీ ఆకారంలో తేడాతప్ప ఇంకేమి తేడ వుంది?"

నాకు ఈ వాదం వితండవాదంగా కనిపించింది.

నేను కలత్తాలా పెద్దసాన్నగారి ఇంటికి వెళ్ళాడు. కలత్తాలు అయిపోవస్తుంటగా నేలుని తీసుకు పోటానికి వచ్చారు. నేలునిదగ్గరికి పిలిచి ముద్దుగా అడిగారు.

"ఏం బాబూ! పెద్దసాన్న గారింటి దగ్గర బావుందా?"

"ఉంది సాన్నా. వంటింటి గుమ్మంలో నుంచి దొడ్లోకిపోతే అక్కడఉంది. రోజూ చక్కగా దాంట్లో రాళ్లువేసి చప్పుడు అవుతుంటే ఆడుకుంటూ ఉంటాను.

* * *

ఆయన ఇంట్లోఏదో మాట్లాడుతూ, మాట్లాడుతూ పొరాటుగా ఒకమాట అన్నారు. ఆమెకు కోపంవచ్చింది.

"చాలులెండి. ఏమిటా మాటల అసహ్యంగా! పిల్లలముందు అలా మాట్లాడితే వాళ్ళూ నేర్చుకోరూ.?"

"నాన్నరు కోప్పడకు అమ్మా! నేను ఇందాక మాట్లాడుతుంటే విని నేర్చుకున్నారు కాబోలు. ఇక ఎప్పుడూ నీ ముందు మాట్లాడను లే."

"చాలా తేడావుంది ఒకటి విమానం, రెండోది గుర్రం. రెంటికి చచ్చేంత తేడావుంది ఇంకా నీవాగితే అత్తా, చెట్టూ ఒకటే నంటావుకూడాను"

టామ్ మాట్లాడలేదు. జిమ్ చప్పట్లుచరిచి "ఆ, అదీ హాక్ మళ్లీ పడగొట్టాడు టామ్‌గార్ని. మా బాగాఅయింది," అన్నాడు.

"నోరుముయ్ జిమ్! పట్టి తెలివితక్కువ చవట దద్దమ్మలు బయలుదేరారు. ఇదిగో చూడుహాక్! నేను విడమర్చి చెబుతాను. ఆకారంలో తేడావున్నప్పటికీ రెండువస్తువులకీ మూలసూత్రం ఒకటే. మూల సూత్రం ఒకటైనప్పుడు రెంటికీ తేడా ఏమీవుండదు. తెలిసిందా?"

కొంచెం ఆలోచించిఅన్నాను!

"టామ్, నువ్వు సమర్థించుకోడానికి ప్రయత్నించకు. మూలసూత్రం ఒకటే కావచ్చు. నేను కాదనను.

కాని మనం ఎగరగలిగితే గుర్రం కూడా ఎగరాలని ఎక్కడుంది?"

"అబ్బ. ఎంత చెప్పినా నీకు బోధపడదేం కర్మ? ఇంత చిన్న విషయం అర్థం కాకపోతే ఎలా చెప్పేది. అదిగాదు హాక్! మనం గాలిలో ఎగరటం లేదా?"

"అవును."

"సరే. మనం మన ఇష్టం వచ్చినప్పుడల్లా పైకి, కిందికి ఎలాగడితే అల్లావిధానాన్ని పోనిచ్చామా లేదా?"

"ఊం."

"మన ఇష్టం వచ్చిన చోట, ఇష్టం వచ్చినప్పుడు దిగామా లేదా?"

"దిగాము."

"బెలూనని ఎల్లా తిప్పగలిగాము?"

"మీటలు నొక్కడంవల్ల తిప్పగలిగాము."

"ఆ, ఇప్పుడు బోధపడిందను కుంటాను నీకు. కంచుగుర్రంలో మరతిప్పడంవల్ల గుర్రాన్ని పైకెగిరించడం, అటూయిటూ తిప్పడం సాధ్యమయింది. మనం మీటలు నొక్కితే, రాకుమారుడు మర తిప్పాడు. దానికీ దీనికీ ఏముంది తేడా? ఏమీ లేదు. ఇప్పుడు తెలిసిందా? నువ్వు మరీ అంత మట్టిబుర్రవి కావని నాకు తెలుసు. కొంచెం వివరంగా చెబితే నువ్వు గ్రహించగలవు."

టామ్ సంతోషంతో ఈలవేయసాగాడు కాని నేనూ, జిమ్ మౌనంగా వున్నాము. టామ్ ఆశ్చర్యపడి "హాక్! ఇంకా అర్థం కాలేదా?" అని అడిగాడు.

"టామ్ సాయర్! నిన్ను కొన్ని ప్రశ్నలు అడగదలుచుకున్నాను."

"నిరభ్యంతరంగా అడుగు" అన్నాడు. జిమ్ జాగ్రత్తగా వినడానికి దగ్గిరికి జరిగాడు.

"నువ్వు చెప్పిందాన్ని బట్టి మీటలూ, మరలూ తప్ప ఇంకేమీ తేడా లేదని స్పష్టమైంది. మీట ఆకారం ఒకరకంగానూ, మర ఆకారం ఇంకోరకంగానూ వుంటుంది, కాని అదేమంత పెద్ద తేడా కాదు. అవునా?"

"అవును. రెండూ చేసేపని ఒకటే అయినప్పుడు వాటిలో పెద్ద తేడా ఏమీ లేదు."

"సరే. కొవ్వొత్తి, అగ్గిపుల్ల చేసేపని ఏమిటి?"

"మండుతాయి."

"రెండూనా?"

"అవును"

"సరే. నేను ఒక గడ్డివాములో అగ్గిపుల్లగీచిపడేస్తానుకో. మండుతుందా?"

"మండుతుంది."

"కొవ్వొత్తి వెలిగించి ఈ పిరమిడ్‌ను అంటిస్తానుకో. మండుతుందా?"

"ఊహూ."

"అగ్గిపుల్లలోనూ, కొవ్వొత్తిలోనూ మండించేగుణం వున్నప్పుడు గడ్డివాము ఎందుచేత మండుతుంది, పిరమిడ్ ఎందుచేత మండదు?"

"పిరమిడ్‌కు మండేస్వభావం లేదుకనుక."

"అలాగే గుర్రానికి ఎగిరే స్వభావం లేదు"

"అర్రె! అర్రె! మళ్ళీ బోల్తాకొట్టించాడు హాక్. అబ్బ! బలేగొప్పవాడివి హాక్! బలే దెబ్బతీశావు. ఆ హెయ్, ఆ హెయ్!" అని జిమ్ చిందులు తొక్కాడు.

జిమ్ పగలబడి నవ్వుతూ, చిందులు తొక్కడం చూసి టామ్ మండిపడ్డాడు. నేను అతన్ని బురదలోకి దింపినట్లు మెల్లిగా తెలియకుండా వాదంలోకి దింపి నిలువులోతున కూరుకుపోయేట్టు చేశాను. అదొక అవమానమూ, అది చాలదన్నట్లు జిమ్ వేళాకోళం చేస్తూ గంతులు వెయ్యడం ఇంకో అవమానమూ. టామ్ ముఖం ఎర్రగా కందగడ్డలాగా అయింది. జిమ్‌తోనూ, నాతోనూ వాదనకు దిగినప్పుడల్లా తనకు మానవజాతి అంటేనే అసహ్యం, జుగుప్స కలుగుతోందన్నాడు టామ్. కాని నేను సమాధానమివ్వలేదు. ఏమన్నా అంటే ఇంకా కోపం వస్తుందని నేను మాట్లాడలేదు. ఒక మనిషిని ఆవిధంగా మట్టికరిపించాక క్షమించి వదిలెయ్యడం ఉత్తమ వీరోచిత ధర్మం. అంతేగాని చుట్టూ కేరింతలు కొడుతూ ఇంకా అవమానించబూనడం కాపురుషలక్షణం. అతని స్థితిలో నేనే గనక వుంటే నాకెలా వుంటుంది? అందుచేత అటువంటి విజయ సమయాల్లో ఉదారంగా ప్రవర్తించడం ఉత్తమని నా నమ్మకం.

(ఇంకావుంది)

శేషయ్యగారి కుక్కపిల్ల

ప్రొద్దున ఆఫీసరు గారింట్లో భోజనాలు. పేటలో చాలామందిని పిలిచారు. ఆఫీసరుగారి పేరు శేషయ్య గారు. ఆయన చాలామంచివాడు - యోగ్యుడు. ఆఫీసరునన్న అహంభావం ఎంతమాత్రం లేదు. అందుచేత ఆఫీసులో వారందరికీ ఆయనంటే అమితమైన గౌరవం. "ఆయనా? మహారాజు! చెయ్యెత్తి దండం పెట్టవచ్చు గదండీ!" అంటారు ఆయననుగురించి ఎవరిని అడిగినా. ఉద్యోగరీత్యా ఆయనకి వచ్చే జీతం రెండొందలమాట అటుంచి పైన సాలీనా అయిదువేల రూపాయల అగుబడి వచ్చే భూవసతి కూడా ఉన్నది. శేషయ్యగారు తానింత తిని, నలుగురికి పెట్టేవాడే కాని కానీఖర్చుకి, దమ్మిడీఖర్చుకి వెనుదీసే వాడు కాడు. అందుచేత శేషయ్య గారింట్లో భోజనాలనే సరికి అందరికీ చాలా సంతోషం కలిగింది. ఆ భోజనాన్ని తలుచుకుంటూ చాలామంది గెంతులు వెయ్యటం ఆరంభించారు.

పన్నెండు గంటలు కొట్టే వేళకి "విస్తళ్లు వేశారు, త్వరగా రండి" అని అందరికీ కబుర్లు వెళ్లినాయి. వచ్చిన వారిని అందరినీ శేషయ్యగారు స్వయంగా పలకరించి, మర్యాద చేసి కూర్చోబెడుతున్నారు.

శేషయ్యగారికి పిల్లాజెల్లా లేరు. కాని పిల్లలకంటే ఎక్కువ ప్రేమతో పెంచుతున్న కుక్కపిల్ల మాత్రం ఒకటి ఉన్నది. శేషయ్యగారిని విడిచి పెట్టకుండా ఆ కుక్కపిల్ల వెంటబడి తిరుగుతుంటుంది. దానిసంగతి అందరికీ తెలుసు. ఎవరైనా దానిని పొగిడితే, శేషయ్యగారు పరమానందం పొందేవాడు. "ఇదండీ! మనిషికి కూడా ఉండవండీ దీని తెలివితేటలు! మనమేం మాట్లాడినా తెలుసుకుంటుంది" అని అమాంతం దాన్ని ఎగరేసి ఒళ్లో కూర్చోబెట్టుకుని ముద్దుపెట్టుకొనేవాడు.

శేషయ్యగారు భోజనానికి వచ్చిన అతిథులని ఆహ్వానిస్తూ ఇంట్లోకిబయటికి తిరుగుతూ ఉంటే, కుక్కపిల్లకూడా ఆయన కాళ్లకు అడ్డంపడుతూ చెంగుచెంగున ఎగురుతూ, తోక ఆడించుకుంటూ తిరుగుతూనే ఉన్నది. విస్తళ్లువేసిన చోటకూడా మధ్యగా ఆ కుక్కపిల్ల తిరగటం చూసి కొందరికి లోపల లోపల కోపంవచ్చింది "భోజనాలు చేసేచోట కుక్కపిల్లదేనికి? ఎంత ముద్దయితేమాత్రం పదిమంది భోజనానికి వచ్చినప్పుడయినా కాస్త కట్టేయ కూడదాఏమి?" అని కొందరు గొణిగారు. కాని పైకి ఏమీ అనలేకపోయినారు.

వడ్డన ఆరంభమైంది. వచ్చిన వారంతా సుష్టుగా భోంచేస్తున్నారు. శేషయ్యగారికి గారెలంటే చాలా ఇష్టం. అందుచేత గారెల వడ్డనకి స్వయంగా ఆయనే పూనుకున్నారు. "అయ్యో! ఇంకా రెండు గారెలు వేయించుకోండి. తింటే గారెలుతినాలి అన్నారు పెద్దలు. ఇదుగో మాంచి కరకరగా ఉడికింది. చేతులు తీసెయ్యకండి. వద్దంటే ఎలా?" అని బలవంతపెడుతున్నారు. అప్పుడు కూడా ఆకుక్కపిల్ల ఆయనని విడిచిపెట్టలేదు. ఆయన ముద్దుగా మధ్యమధ్య దానితో మాట్లాడుతూ ఒక గారె ముక్కలుచేసి అప్పుడప్పుడే దానిముందు పడేశారు. ఆఫీసరుగారి ప్రీత్యర్థం ఒకరూ, ఇద్దరూ ఆ కుక్కపిల్లను పిలిచి ఎడమచేతితో దాన్ని దువ్వి "ఏం కుక్కపిల్లండీ! శేషయ్యగారూ? ఎక్కడ సంపాదించారో కాని భలే కుక్కపిల్లనండీ? చూశారా? పిలవగానే వచ్చింది" అని తెగ మెచ్చుకుంటూ తమవిస్తళ్లలోని గారెముక్కలు కూడా దానికి పెట్టడం మొదలెట్టారు. ఎలాగైతేనేం, అతిథులందరూ సుష్టుగా భోజనంచేసి ఒకరివెంటఒకరు బ్రేవు బ్రేవున త్రేపుకుంటూ లేచేవేళకి, కుక్కపిల్ల కూడా గారెలు కడుపు నిండా ఆరగించింది. శేషయ్య గారిని, వారిఇంట్లో ఆనాడుచేసిన వంటరుచిని మెచ్చుకుంటూ అందరూ తాంబూలాలు వేసుకుంటుంటే శేషయ్యగారు ఆకుక్కపిల్లని చంకన వేసుకొని ఆనందంతో

శేషయ్యగారి కుక్కపిల్ల

వింటూనిలబడ్డారు. ఆ తరవాత శేషయ్యగారు వసారాలో జంప కానాలు పరిపించి "అందరూ తాంబూలాలు వేసుకుంటుండండి నే నిప్పుడే భోజనం చేసివస్తాను." అన్నారు. భోజనాలకు వచ్చిన వారిలో ఒకపెద్ద "అవశ్యం. మీరు పాపంచాలా శ్రమపడ్డారు. ముందు భోజనం చెయ్యండి. ఆ తరవాత మాట్లాడు కోవచ్చు అందరమూ అలా తాంబూలాలు వేసుకుంటూ కూర్చుంటాము" అన్నాడు

శేషయ్యగారు భోజనంచేస్తూ ఉండగానే కుక్కపిల్లకు కూడా తిండి పెట్టడం మామూలు. అయితే ఆ నాడు కుక్కపిల్ల కడుపునిండా గారెలు తినటంవలన, తిండికి రాకుండా ఇంట్లోనించి ఎక్కడికో వెళ్లిపోయింది శేషయ్యగారు గబగబభోజనం ముగించారు. అటు బయట వాళ్లందరూ కనిపెట్టకొని ఉన్నారన్న తొందరలో, గారెలే పదిసార్లువడ్డించుకొని తిని బయట పడ్డారు. అందరితోపాటు కూర్చుని పిచ్చాపాటి ఆరభించారు.

అధికంగా భోజనం చేసినవాళ్లు ఆయాసంతో ఆవసోపాలు పడుతున్నారు. ఇలా ఎవరిఅవస్థవారు పడుతుండగా పొరుగింటి వాళ్ల అబ్బాయి ఆఫీసుగారిదగ్గికి ఒక దుర్వార్త తెచ్చాడు.

శేషయ్యగారికుక్కపిల్ల అవతలి బజారులో ఒకప్రక్కన పొట్టఉబ్బి చచ్చిపడిఉన్నది ఈ మాటచెప్పగానే ఆయన కళ్లనీళ్లపర్యంత మైనాడు. ఆయనను ఎలా ఊర



గపచిప్! —ఫొటో: లంకసుదర్శనం, అవనిగడ్డ

డింబాలోత్తోచక, అందరూ తెల్లబోయినారు.

"ఇంతలో ఉన్నది ఏమయినా ఇప్పటిదాకా బాగానే ఉండేదే"

"ఇంతలో ఎందుకు చచ్చిపోయిందండీ పాపం. నేను గారె ముక్క వేస్తే బాగానే తిన్నది ఇందాక."

ఇలా నలుగురూ నాలుగు ముక్కలు అన్నారు ఈ మాటలన్నీ వింటే ఒకమూలకూర్చోని, భుక్తాయాసంతో బాధపడుతూ, బొజ్జ నిమురుకుంటున్న బట్టతల ఆయన ఒక చిన్న నిర్ణయానికి వచ్చారు. గారెలు తిన్నది, అందుచేత చచ్చిపోయింది అని. ఆమాట విని ప్రక్కనవున్న మల్లికన్నాయన గారెలు తింటే పొట్ట పగిలి చచ్చిపోయిందా? గారెలు బాగానే ఉన్నాయే అయినా, ఎందుకో ఆగారెలు తిన్నప్పటినుంచి నాకూ గొంతు ఒకటే మండుతున్నది" అన్నాడు బట్టతలఆయన చప్పున లేచి గాభారాగాచూస్తూ "మీకూ మండుతున్నదీ? నాకు పొట్టకూడా ఉబ్బుకొస్తున్నది. ఇదేం ఖర్మమండీ? అని వాపోయినాడు. కొద్దిసేపట్లో ప్రతిఒక్కరికి అనుమానం ఆరంభమైంది అంతాకలిసి గారెలో పప్పురుబ్బేటప్పుడో ఎప్పుడో ఏదో విషపదార్థం కలిసిఉంటుందని నిశ్చయానికి వచ్చారు. శేషయ్యగారు నిలువునా వణికిపోయినాడు ముచ్చెమటలు పోసినాయి ఇంతమందికి విషంపెట్టిన పాపం తనమీదికి వచ్చిందే అని నెత్తినోరుకొట్టుకున్నాడు వాళ్లందరిముందూ తల ఎత్తుకు నిలబడలేక పోయినాడు ఇంట్లోకివెళ్లి ఆగారెలు ఇంకెవ్వరూ తినకుండా కట్టుదిట్టంచేసి భార్యని పదిలిట్టి, వచ్చాడు. గబగబనౌకరుని పిలిచి, అవతలబజారులో ఉన్న డాక్టరుగారికోసం కబురుచేశాడు.

డాక్టరుగారు ఆదరా బాదరా పరుగెత్తుకువచ్చాడు. ఆయనకూడా భోజనానికి రావలసినవాడే అయితే ఎక్కడో ఒక అర్జంటుకేసు రావటంవలన రాకపోయినాడు. డాక్టరు వచ్చి అందరినీ పరీక్ష చేశాడు. ప్రాణాంతకమైన విషయమేమీ లేదని ధైర్యంచెప్పి నేను ఇంటికి వెళ్ళి మీ అందరికి మందుపంపుతాను తీసుకోండి." అని చెప్పాడు.

శేషయ్యగారికి అప్పటికీ భయం తగ్గలేదు. "డాక్టరుగారూ! మీరు మరోకలాగా అనుకోకపోతే కాస్త ఈపూట ఇక్కడే ఉండండి. మాకు ధైర్యంగా ఉంటుంది." అని బ్రతిమిలాడాడు డాక్టరుగారు తప్పని సరి అయి అంగీకరించాడు ఇంటికివెళ్ళి ఇంతమందు తెచ్చి, తలాకాస్త పోశాడు

తరువాత శేషయ్యగారు కొంత తేరుకొని "డాక్టరుగారూ! మరేమీ భయంలేదుగదా!" అని అడిగారు. ఆయన భయంలేదని హామీ ఇచ్చాడు అక్కడికీ అనుమానం తీరక "మరి మాకుక్కపిల్ల చచ్చిపోయిందేమండీ?" అని అడిగారు శేషయ్యగారు.

డాక్టరుగారు అదోరకంగా మొహంపెట్టాడు ఏదో చెప్పబోయి తడబడ్డాడు "ఉన్నమాట చెప్పేస్తాను మీకుకోపం రాదు కదా!" అని అడిగారు శేషయ్యగారు "ఏమిటి? మరేంఫరవాలేదు: చెప్పండి" అన్నారు

"నేను ఇందాక అర్జంటుకేసొకటి చూడటానికి వెళ్లాను మీరు భోజనానికి పిలిచారు కదా! వీలయినంత తొందరగా ఇంటికిచేరుకుందామని సైకిలురిక్షాఎక్కి వస్తున్నాను నా తొందరనుబట్టి వాడూ చాలా తొందరగా తొక్కుతున్నాడు. ఇంతలో మీ కుక్కపిల్ల అడ్డువచ్చి చక్రంక్రిందపడింది రిక్షా తప్పుకుందామని ఒక్కకుతిప్పటంలో వెనుక చక్రంకూడా దాని మీదుగా పోయింది అందువలన అది చచ్చిపోయింది,"

శేషయ్యగారు కోపపడతారని డాక్టరు అనుకున్నాడు కాని ఆయన ఒకనిట్టూర్పు విడిచి "అమ్మయ్య" అన్నారు భోజనానికి వచ్చినవారు మొహాలుమొహాలు చూసుకుంటూ కిక్కురుమనకుండా వెళ్ళిపోయినారు. అయితే అందరికే ఒకేసారిగా గొంతు మండటం, పొట్టఉబ్బుకు రావటం, మొదలయిన లక్షణాలు వచ్చి ఎందుకు బాధపడ్డారో ఎవ్వరూ చెప్పలేక పోయినారు

★

"నాకేగనుక ఈ ఆసామీకి ఉన్నంతడబ్బు ఉంటేనా, ఇంతకంటె ఎక్కువ భాగ్యవంతుణ్ణి అయ్యేవాడిని."

"అది పొరపాటు. నువ్వు అంతే భాగ్యవంతుడివి అయ్యేవాడివి"

"పొరపాటేమీ లేదు నాదగ్గర జేబులో ఇంకో రూపాయి ఉన్నది"

గల్లాగురిగి

ఆరేళ్లు దాటాయి శారదకు. రెండో తరగతి పరీక్షలో మంచి మార్కులు వచ్చాయి ప్రమోషన్ ఇచ్చి నాల్గవతరగతిలోకి పంపించాడు హెడ్‌మాస్టరు. శారద తెలివి తేటలకు తలితండ్రులు చాల సంతోషించేవారు.

శారదకు మంచీ చెడ్డా కొద్ది కొద్దిగా తెలియసాగాయి. మంచి బట్టకావాలని మంకుచేసేది మల్లెపువ్వులే కావాలని మారాంచేసేది. "మాబళ్లో కమలకు వాళ్లనాన్న మంచి సంచి కొనిపెట్టాడు. నాకూ కొనిపెట్టు" అని తండ్రిని వేధించేది శారద ముద్దుబిడ్డ అందులో చక్కగా చదువుకుంటూంది అందువల్ల వాళ్లనాన్న యేదడిగినా లేదనేవాడు కాదు

ఒకరోజున శారద బడినుండి వచ్చింది. వచ్చీరావడంతోనే పుస్తకాలసంచి గబగబా తల్లి చేతికందించి, తండ్రిదగ్గరకు పరుగెత్తుకుంటూ పోయింది. శారద వచ్చి మీద పడుతుందన్న సంగతి తెలిసి, తండ్రి చదువుకుంటూన్న పుస్తకాన్ని పక్కకుబెట్టి, శారదను ఆహ్వానిస్తూ వున్నట్టుగా రెండు చేతులను జాపివుంచాడు శారద "నాన్నా", అంటూ గభిలున వచ్చి వాలింది తండ్రిమీద.

"ఏమిటమ్మా బంగారుతల్లీ!" అంటూ, ముద్దుపెట్టుకొని, దగ్గరకు తీసుకున్నాడు శారదను తండ్రి.

"నాన్నా! కమలే పైసలు కూడ బెట్టుకుంటున్నది! నేనూ కూడ బెట్టుకుంటాను పైసలు".

"మంచిదమ్మా! నీవూ కూడ బెట్టుకో!"

"పైసలు వేసుకోడానికి గురిగి కావద్దూమరి!"

"పాడుమట్టి గురిగేంఖర్మం నీకు! మంచి పెట్టెకొని పెడ్తానేం?"

"నాకు పెట్టెమీవద్దు! నాకు కమల గురిగిలాంటి గురిగే కావాలి"

"గురిగేనమ్మా! నీ యిష్టం వచ్చింది కొనుక్కో."

"గురిగి కొనుక్కోడానికి అణా కావాలి"

"అణా కాకపోతే, రెండణాలు యిస్తా! ఇంతా చేసి అణాయివ్వలేనా?" అంటూ శారదతండ్రి నవ్వాడు.

రూపాయితీసి శారదకిచ్చాడు. శారదతల్లి "రూపాయెందుకు, అణా అయితేసరిపోదూ," అన్నది

"ఫరవా లేదులేవే! అదేదో కూడ బెట్టుకుంటుందిట," అని తండ్రి శారదరూపాయి గట్టిగా పట్టుకున్న చిన్నారిచేతిని, ముద్దు పెట్టుకున్నాడు.

కమల సహాయంతో బజారుకు పోయి ఒక మట్టిగల్లాగురిగి కొని తెచ్చుకుంది తెచ్చేతేవటంతో ఆ గురిగిని దేవునిదగ్గిరపెట్టింది. తల్లినీ తండ్రిని లాక్కుపోయింది తన గురిగిలో చెరొకపావలా వేయించి ప్రారంభోత్సవం జరిపించింది.

రోజులు గడుస్తున్నాయి. శారద గురిగిలో రోజూ—అణో బేడో పడుతుండేది. ఎన్ని పైసాలై ఉంటాయని తండ్రిని రోజూ లెక్క అడుగుతుండేది శారద. తండ్రి తమాషాగా పదిరూపాయలనేవాడు! శారద కాసేపు ఆలోచించి, "పదిరూపాయలంటే ఎన్ని పైసలవుతాయి నాన్నా?" అని అడిగేది. "ఇన్ని" అని రెండు చేతులు దూరంగా జాపి చూపించేవాడు తండ్రి. తండ్రీ బిడ్డల ముచ్చట్లను చూచి ముసిముసినవ్వులు నవ్వేదితల్లి.

నెల నాల్గవ వారంలో పడ్డది. శారదతండ్రి ప్రస్తుతారీకు కొరకు నిరీక్షిస్తున్నాడు. పైసపైసకు తబ్బిబ్బవుతున్నాడు. బియ్యం నిండుకున్నాయని, ఆరోజువరకే సరిపోతాయని ఆఫీసుకు పోయేముందు శారదతల్లి భర్తతో చెప్పింది. పాపం! అతను ఐదు రూపాయల చేబదులుకోసం అఖండప్రయత్నం చేశాడు. ఎక్కడా పుట్టలేదు.

సాయంత్రం వట్టి చేతులతో ఇంటికి వచ్చాడు. పోనీలెండి మన ఇంట్లో సజ్జలు ఉన్నాయి! మళ్లీ మీ జీతం వచ్చేవరక్కు సరిపోతాయి! అన్నది శారద తల్లి.

శారద ఈ మాటలు విన్నది. తల్లినీ తండ్రినీ బాగా చూచింది. నెమ్మదిగా వంటింట్లోకి పోయి రెండు నిముషాల్లో చేతులు వెనక్కు పెట్టుకొని తిరిగి వచ్చింది. "నాన్నా! నేను సజ్జ అన్నం తినను" అని బుంగమూతి పెట్టింది శారద.

"అసలు సజ్జన్నం —ఎవరొండుతున్నారమ్మా!"

"అమ్మ అన్నది గదూ!"

"తమాషా కన్నదిలే!".

"నాకు తెలుసునాన్నా! ఇదిగో నాగల్లాగురిగి దీంట్లో చాలపైసలు ఉన్నాయిగదూ? దీన్ని పగులకొట్టి, పైసలు తీసుకపోయి, బియ్యం తీసుకురా!" అంటూ శారద, తండ్రి వద్దంటున్నా గురిగి పగులగొట్టింది. అణాలు, బేడలు, పావలాలు చిందరవందరగా, దూర దూరంగా పడ్డాయి. శారద తన చిట్టి చేతుల్తో వాటిని ఏరింది. రెండు చేతుల్తో ఆ నాణాలను తండ్రిచేతుల్లో—బలిచక్రవర్తి వామనునికి మూడులోకాలు దానం చేసినమాదిరి, పోసింది.

తండ్రి శారదను కౌగలించుకున్నాడు. అతని కళ్లల్లో ఆనందబాష్పాలు నిలిచినాయి. "అమ్మా! మాబంగారు తల్లీ! నీకెంత ప్రపంచజ్ఞానం వచ్చిందే!" అని శారద బుగ్గలు ముద్దెట్టుకున్నాడు.

విధిలేక శారద ఇచ్చినడబ్బుతో ఆనాడు బియ్యంతెచ్చాడు. కాని బాధపడసాగారు. "జీతం వచ్చిన తరువాత మా అమ్మడబ్బుకు మూడింతలు ఇస్తాను" అని నిశ్చయించుకున్నాడు. ఆరాత్రి శారద తల్లికి ఆవిషయం రహస్యంగా చెప్పాడు.

"ఇదిగో మనం కాస్త జాగర్తగా మాట్లాడుకోవాలి సుమా! మన అమ్మడుకు అన్నీ తెలుస్తున్నాయి!." అని భార్యను హెచ్చరించాడు. పక్కనే పడుకొని ఉన్న శారద ముఖాన్ని చూచి, సగర్వంగా చిరునవ్వు నవ్వింది శారద తల్లి. ★

గ్రంథసమీక్ష

బోట్ మన్ బోయ్

ఆంగ్లపద్యాల సంపుటి; కవి: సచ్చిదానంద్ రౌత్ రాయ్; ప్రచురణ: ప్రభాసీ ప్రెస్, కలకత్తా. ప్రతులకు: మోడరన్ రివ్యూఆఫీస్, 120/2, అప్పర్ సర్క్యులర్ రోడ్, కలకత్తా-9. లేక—మీరా పబ్లికేషన్స్, పి. ఓ. గార్డెన్ రీచ్ రోడ్, కలకత్తా—24. కవిగారి చిరునామా: 42, గార్డెన్‌రీచ్ రోడ్, కలకత్తా-24. ప్రతి వెల 6-0-0.

సాచిరౌత్ రాయ్ ఒరియా కవి. వీరు 1937 నుండి 1954 వరకూ ఒరియా, బెంగాలీభాషలలో వ్రాసిన ఖండకావ్యాలకు హరీంద్రనాథ చట్టోపాధ్యాయ, బి. సిన్హాగార్లుచేసిన ఆంగ్లానువాదాలు ఈ సంపుటిలో ప్రకటింపబడ్డాయి. రౌత్ రాయ్ గారు స్వయంగా ఇంగ్లీషులో వ్రాసిన పద్యాలుకూడా ఇందులో చేర్చబడ్డాయి. డా॥ కాళిదాసు నాగ్ గారు, హరీన్ చట్టో వ్రాసిన పరిచయవాక్యాలు, బోట్‌మన్ బోయ్ పద్యాలు వ్రాయడానికి కారణమైన చరిత్రాత్మక సంఘటననుగూర్చి కవివ్రాసిన పీఠికకూడా ఇందులో ఉన్నాయి.

ఒరిస్సాలోని స్వదేశసంస్థానాల ప్రజలను నిరంకుశ పరిపాలననుండి విముక్తులను చేయడానికి జరిగిన పోరాటాల వాతావరణంలో, బాజీరౌత్ అనే పడవవాళ్ల కుర్రవాడు ఆ పోరాటంలో ఆత్మార్పణ చేసుకొన్న సంఘటన ప్రత్యక్ష ప్రేరణకాగా, సాచిరౌత్ రాయ్ 'బోట్ మన్ బోయ్' పద్యాలు 1939-1942 సంవత్సరాలలో రచించారు. ఈ పద్యాలు ప్రజలలో విశేష ప్రచారం పొందాయి. ఆ తరువాత రౌత్ రాయ్ గారు 1949 వరకూ జాతీయత, స్వాతంత్ర్య పిపాస, పీడితప్రజా కారుణ్యం, అభ్యుదయం మొదలగు ఆవేశాలతో నిండిన పద్యాలు రచించారు. ముఖ్యంగా 'బోట్‌మన్‌బోయ్' రచన శక్తివంతంగా వుంది. బలహీనులకు జరిగే అన్యాయాలపట్ల ఆగ్రహం, అన్యాయాలను ప్రతిఘటించి క్షాత్రధర్మాన్ని ప్రతిష్ఠించాలనే ప్రబోధం ఈ పద్యాలలో వెల్లి విరుస్తోంది.

ఆత్మాహుతి చేసుకున్న పన్నెండేళ్లపడవవాళ్ల బాలుణ్ణి ఎడతెగకుండా జరిగే స్వాతంత్ర్య సమరానికి చిహ్నంగా కవి చిత్రించారు. మిగతా సాహిత్యరూపాల

★ గ్రంథ సమీక్ష ★

లాగా కవిత్వం అనువాదానికి లొంగేది కాదు. కవితనువాదంలో మూలంలో స్వతస్సిద్ధంగా ఉండే శబ్దశక్తి, సౌందర్యం పోతాయి. అయితే హారీన్ చట్టో చేసిన సృజనాత్మక అనువాదంవల్ల ఈ పద్యాలు ఇంగ్లీషులోకూడా శక్తిమంతంగానే ధ్వనిస్తూ ఈ కవి ప్రతిభను వ్యక్తంచేస్తున్నాయి.

గ్రంథం చివరిభాగంలో రేత్ రాయ్ స్వయంగా ఇంగ్లీషులో రచించిన పద్యాలు ఎక్కువగా వేదాంతపరంగా ఉన్నాయి. ఇవి 1953-54 సం॥లో రచించబడినవి.

పుస్తకం ముద్రణ, బైండింగు ఉత్తమంగా ఉన్నాయి ★

విజ్ఞానవీధులు

'డాక్టర్'

చిట్టిప్రశ్నలకు జవాబులు

ఏది చెత్త?

పనికిరాని వస్తువుల్ని ప్రతివారూ చెత్త డబ్బాలలో పారవేస్తారు తర్వాత వాటిని గురించి ఆలోచించనే ఆలోచించరు ఒక నాడు పనికిరాని చెత్తగా కన్పించిన వస్తువు మరొకనాడు అవసరమైనది కావచ్చు. ఈ విషయం రసాయనశాస్త్ర చరిత్రలో ఎన్నో ఘట్టాలలో రుజువైంది. లోకజ్ఞులు ఈలాటిది జరుగవచ్చుననే ఉద్దేశంతోనే ఏ వస్తువునైనా పారవేసేముందు ఆరునెలల ఆలోచించమని సలహా ఇస్తారు అప్పటికి బహుశా మొదటి నిర్ణయం మార్చుకోవాలనే అభిప్రాయం కలగవచ్చునని వారి అంచనా అయివుండవచ్చు

సామాన్యుల దృష్టిలో చెత్తలా కన్పించే వస్తువులెన్నో రసాయనికుల దృష్టిలో బంగారు గనులలాంటివి కోల్ తారు అలాంటి వాటిలో ఒకటి సుమారు ఒక శతాబ్దంక్రితం దాన్ని వదిలించుకోవడం ఎలాగా అని పాశ్చాత్యదేశాల్లో కోల్ గాస్ (*Coal Gas*) కంపెనీవారు ఆత్రపడేవారు అలాంటిది నేడు ఎన్నో మందులు, రంగులు, రసాయనిక ద్రవ్యాలూ తయారుచేయడానికి ముడిపదార్థమైంది

చెఱకు గడనుంచి రసం తీసేసిన తర్వాత మిగిలే పిప్పిని అట్టలు తయారుచెయ్యడానికి వాడవచ్చునని నిర్ధారణ అయింది వేరుసెనగ పంటలో లభించే వస్తువులనుంచి సుమారు రెండువందల ఉపయోగకరమైన పదార్థాలను తయారు చెయ్యవచ్చునని జార్జి వాషింగ్టన్ కార్వర్ అనే అమెరికన్ నీగ్రో వ్యవసాయిక రసాయన శాస్త్రవేత్త సూచించాడు. కరువుకాలంలో బీదలచే అంబలి తయారుచేసుకొని ప్రాణాలు నిలుపుకొనేటందుకుపయోగింపబడే చింతగింజలు, గోనేసంచుల తయారీలో నునుపు తేవడానికి వాటికి పెట్టేటందుకు పనికివచ్చే చవుకబారుపిండి పదార్థంగా వాడవచ్చునని తెలుస్తోంది సగం సగం తుప్పుపట్టడంచేత అవతల పారవేసే ఇనపసామాన్లను 'అన్నభేది' లవణాన్ని, 'పొటాసియము పెర్రోసయనైడు' లవణాన్ని తయారుచేసేటందుకుపయోగించవచ్చును. ఈలామనం ఆలోచిస్తే చెత్తపదార్థాలనుకొనేవన్నీ ఏదో రకంగా ఉపయోగించడానికి పనికివస్తాయని తేలుతోంది అయితే వాటిని ఎవరికి వారే వాడుకచెయ్యలేరు. పనికిరాని వాటిని పారవేయడంలో కూడా ఒక క్రమాన్ననుసరించడం, వాటిని వినియోగించే పరిశ్రమలు అక్కడక్కడ దేశంలో స్థాపించబడటం అవసరం. అప్పుడే దేశసౌభాగ్యం సక్రమముగా సర్వజన సౌఖ్యాతిశయకరంగా వినియోగమవుతుంది

—(హరి)

*　　*　　*

ఎస్ పద్మగారు,—రాజమండ్రి.

ఓ పద్మ చెల్లెమ్మా! హార్మోనులు లేకపోవడమువల్ల మరుగుజ్జులౌదురనీ అది హెచ్చైనయెడల అతి దీర్ఘశరీరులగుదురనీ గ్రహింపు జరిగినది నేటికి. మరుగుజ్జుతనమూ, పొడగరితనమూ సరిదిద్దే సాధనాలు కనుక్కోవడానికి ఇంకా కొంత కాలము పట్టుతుంది ఏమంటే, అహార్మోనులను అవి కావలసినచోట శరీరానికిచ్చి నిలపడము ఇంకా తెలియలేదు

—రోకలి బండలవల్లనే కాదు మనకు ఉపయోగము కాని జీవులు చాలావున్నాయి చీమల మాటేమిటి? వీటినన్నిటినీ చంపడానికి మనకేమి హక్కున్నదీ?

*　　*　　*

కంచర్ల ఆదినారాయణరావుగారు, మదరాసు.

—చంద్రమండలము చల్లగా వుంటుంది. సూర్యమండలము అతివేడి. సూర్యమండలములో ఏపదార్థమూ ఘనస్థితిలో ఉండలేదు మరి శాస్త్రజ్ఞులు ఎలాగ వుండగలరు? చంద్రమండలంలో ప్రవేశించినప్పుడు శరీరముయొక్క ఉష్ణతను కాపాడగల దుస్తులు వేసుకోవచ్చు శాస్త్రజ్ఞులు.

అతిశీతలంగాఉండే ధ్రువప్రాంతాలలో తోళ్ల దుస్తులు వేసుకుని వుంటారు ఎస్కిమోలు భూమధ్యరేఖప్రాంతాలలో వుండే నీగ్రోలు కొండగుహాలలోనూ, చెట్ల గుబురులక్రిందనూ వున్నప్పటికీ వారి శరీరాలు ఎంత నల్లగావుంటాయో చూడండి అతిశీతలానికి ఏమైనా చేసుకోవచ్చును. అతివేడికి ఏమీ చెయ్యలేము.

*　　*　　*

పండరినాథ్ గారు, అనంతపురం.

—అవును ఎవరో పెట్టిన మందువల్ల నానాటికీ కృశించిపోవడము కలదు సరియైనమందును డాక్టరులు - అంటే రోగులను పరీక్షించిన డాక్టరులుమట్టుకే నిర్ణయించగలరు. అయినా ఒక సలహా పచ్చి ఉత్తరేణిపుల్లలతో పళ్లు తోముకోమని చెప్పండి ఆరోగుల్ని.

*　　*　　*

వి ఆర్ కోరళ్లగారు, గుంటూరు

—అవును మనము నడిచేటప్పుడు చంద్రుడు మనతోనే వచ్చినట్టు కనపడుతుంది మనతోనే రావడమంటే వెనక దిగబడిపోవడములేకుండా మనము నడుస్తూవుంటేకూడా రావడము రైలులో ప్రయాణము చేస్తూ - దూరంగావున్న చెట్లని చూడండి. వాటికీ, రైలుకీ నడుమనున్న చెట్లూ పుట్టలూ మనలను దాటి పరుగెత్తుకుపోతూన్నట్లు కనబడినా ఆ దూరపుచెట్లు మనతో వస్తున్నట్టు కనబడతాయి అలాగ ప్రయాణము చెయ్యగా చెయ్యగా, ఆచెట్లే వెనకపడతాయి

మీరు ఒక స్టేషనులో ఆగినప్పుడు మీ కంటికీ ఆ దూరపుచెట్టుకీ కలుపుతూ తిన్నని గీత గీశారనుకోండి తరవాత మరొక స్టేషనులో ఆగినప్పుడు మళ్లా అలాగే మరొకగీత గీశారనుకోండి ఈ రెండు గీతలూ ఆ దూరపు చెట్టుదగ్గర కలుస్తాయి అక్కడ ఈ రెండు గీతలనడుమాగల కోణము ఎంత పెద్దదయితే, అంతగా వెనకపడ్డట్టుకనపడుతుంది ఆ చెట్టు. ఆచెట్టు దూరపుచెట్టయినకొద్దీ, ఈ కోణము చిన్నదౌతుంది చంద్రుడు మనకి నాలుగు వందల అరవైఅయిదు వేల మైళ్ళ దూరంలో ఉన్నాడు కనక మనము సామాన్యముగా నడిచే దూరము చంద్రుడిదగ్గర పొడిచే కోణము చాలా చిన్నదిగా వుంటుంది అంటేతనే చంద్రుడు వున్నచోటునే వున్నట్టు - అనగా మనతో వచ్చినట్టు కనబడతాడు

*　　*　　*

కె సరళాదేవిగారు, లోవరం

—గొంగళి పురుగు ముళ్ళద్వారా సూక్ష్మంగా దానిశరీరములోని రశి మన చర్మమునకు ఎక్కును గోకినప్పుడు చర్మములోవచ్చినమార్పు ఈ రశి తగిలినప్పుడూ వచ్చును కనుక బొబ్బలెక్కును

గోళ్ళపాట్లలలో కలిగే అంటువల్ల గోరుచుట్టువచ్చును నిమ్మకాయను పెట్టుకొనుట కేవలము మందుగానే కాదేమో గోరుచుట్టు వేసినవేలు తక్కినవాటికి సోకి బాధ పెట్టకుండానూ ఇందువల్ల అప్రేలికొసనాని బాధ తగ్గిస్తుంది నిమ్మరసపు పులుపు మందుగా పనిచేస్తుందేమో కూడాను. ★



ఏ. ఎస్. ఏ. పిక్చర్స్‌వారి "ఆడబిడ్డ"లో పుష్పలత.



బిమల్ రాయ్ చిత్రం "నౌకరీ"లో నటించిన సింధీ సుందరి షీలారమణి

బొంబాయి సినిమా లేఖ

(ఆంధ్రవారపత్రిక విలేఖరి)

షెహానాయ్, ఖిడ్కీ, సర్గం మొదలైన బాక్సాఫీస్ చిత్రాలు తీసిన పి. ఎల్. సంతోషి మినర్వా మువిటోన్‌వారి ఒక చిత్రాన్ని డైరెక్ట్ చేయడానికి ఇటీవల బుక్ అయ్యారు. 25 ఏళ్ళ కిందట ఈయన యువరచయితగా బొంబాయి వచ్చి జీవనోపాధికొరకు అన్వేషిస్తూ, మొట్ట మొదటుగా ఉద్యోగం చేసింది మినర్వా సినిటోన్‌లోనే. ఆ రోజుల్లో అతని జీతం నెలకు 30-0-0. అందుచేత ఒక నెల తరవాత ఉద్యోగం మానివేశాడు.

మినర్వా స్టూడియోలో ఇప్పుడు ఎడతెరిపి లేకుండా పని జరుగుతున్నది. 'లే మిజేరబ్ల్' నవలపై ఆధారపడిన కథతో మినర్వావారు నిర్మిస్తున్న "కుందన్"చిత్రం అయిపోవస్తోంది. ఇందులో సొహ్రాబ్ మోడీ, సజ్జన్, షీలారమణి మున్నగువారు నటిస్తున్నారు.

* * *

అనిల్ బిశ్వాస్ భార్య ఆశాబిశ్వాస్ చాలరోజులు చిత్రాల్లో నటించి ఇప్పుడు చిత్రనిర్మాణంలోకి దిగింది. స్త్రీ నిర్మాతల సంఖ్య బొంబాయిలో ఇటీవల ఎక్కువైంది. వీరిలో కులదీప్ కౌర్ ఒకతె. ఈమె వాంప్ పాత్రలు ధరిస్తూ వుంటేది. ఈమెను సినిమాలలోకి ప్రవేశపెట్టినది నటుడు ప్రాణ్; పైకి తీసుకువచ్చినది రమేష్ సైగల్. కులదీప్ కౌర్ ఇప్పుడొక చిత్రం నిర్మిస్తున్నది. మరొక స్త్రీ ప్రొడ్యూసరు రూపవర్మ. ఈమెను చేతన్ ఆనంద్ మొదటగా సినిమాల్లోకి ప్రవేశపెట్టాడు. కిశోర్ సాహూ తీయదలచిన చిత్రం "సౌదా"లో కూడా బుక్ అయింది. కాని అది విఫలం కావడంతో స్వయంగా చిత్రాలు తీసి, వాటిలో నటించడానికి ఆమె నిశ్చయించింది.

* * *

ప్రసిద్ధ నటి నిమ్మి 'వోర్లీ సీ ఫేస్' ప్రాంతంలో స్వంతభవనం కట్టడానికి నిశ్చయించింది. ప్రతిమదాస్ గుప్త, బేగంపారా కూడా ఆ ప్రాంతంలోనే వుంటున్నారు.

* * *

మొదటి భారతీయ చిత్రనిర్మాత దాదా ధుండిరాజ్ ఫాల్కే 11 వ వర్ధంతి ఫిబ్రవరి 16 న వచ్చి వెళ్ళిపోయింది. ఎప్పటిలాగానే బొంబాయి ఫిలిం వ్యక్తులెవరూ దాన్ని గూర్చి పట్టించుకోనే లేదు.

* * *

కాని ఫిబ్రవరి 14, 17, 19 తేదీల్లో మాత్రం వరుసగా మధుబాల, స్మృతి బిశ్వాస్, నళినీ జయవంత్‌ల జన్మదినోత్సవాలు వైభవంగా జరిగాయి.

మధుబాల, నళినీజయవంత్‌ల జన్మదినోత్సవాలకు దగ్గరిబంధువులు, స్నేహితులు మాత్రమే హాజరయ్యారు. స్మృతిబిశ్వాస్ మటుకు ఫిబ్రవరి 17 వ తేదీన పెద్ద విందు చేసింది. నర్గీస్, కిశోర్‌కుమార్, నిరూపరాయ్, శశికళ, రూపమాల, అనితాగుహా, శేఖర్, బి. ఆర్. చోప్రా, హేమ్‌చందర్, ఇంకా అనేకులు హాజరయ్యారు. ఈ సందర్భంలో డైరెక్టర్ హేమేన్‌గుప్తకుమార్తె అయిదేళ్ళ పిల్ల బూలా చక్కని కథక్ నృత్యం చేసింది.

* * *

1954 సం॥పు ఉత్తమనటి "ఆస్కార్" బహుమతికోసం జూడీగార్లండ్, (ఎ స్టార్ ఈజ్ బార్న్), గ్రేస్ కెలీ (ది కంట్రీ గర్ల్), జేన్ వైమన్ (మెగ్నిఫిసెంట్ ఆబ్సెషన్), డరోతీ డాండ్రిడ్జ్ (నీగ్రో



అమర్ మల్లిక్ చిత్రం "స్వామీ వివేకానంద"లో బెంగాలీనటి భారతీదేవి.

తార - "కార్మన్ జోన్స్"లో నటించింది) ఆడ్రే హెప్ బర్న్ (సబ్రినా) పేర్లు సూచింపబడినవి.

ఉత్తమ నటుడు ఆస్కార్ బహుమతికి మార్లన్ బ్రాండో (ఆన్ ది వాటర్ ఫ్రంట్), బింగ్ క్రాస్బీ (ది కంట్రీ గర్ల్), హంఫ్రీ బోగార్ట్ (కెయిన్ మ్యూటినీ), డాన్ ఓ హెర్లీ హీ (రాబిన్సన్ క్రూసో), జేమ్స్ మేసన్ (ఎ స్టార్ ఈజ్ బార్న్) పేర్లు సూచింపబడినవి.

ఉత్తమ చిత్రం బహుమతికి కెయిన్ మ్యూటినీ, ఆన్ ది వాటర్ ఫ్రంట్, సెవెన్ బ్రైడ్స్ ఫర్ సెవెన్ బ్రదర్స్, త్రీ కాయిన్స్ ఇన్ ది ఫౌంటెన్ చిత్రాలు నామినేట్ చేయబడినవి.

*　　*　　*

లలిత, పద్మిని, రాగిణి తిరువాన్కూరు సోదరీత్రయానికి నాట్యరాణులనే బిరుదును అన్నామలై విశ్వవిద్యాలయం వారు ఇచ్చారు.

ఐ ఎమ్ పి పి ఎ లో గౌరవ సభ్యులుగా ఎన్నుకోబడిన ఎస్. కె. పాటిల్ గారు ఫిలిం పరిశ్రమలోని వివిధశాఖలమధ్య ఏకీభావం కుదర్చడానికి ప్రయత్నిస్తానని చెప్పారు.

ఇంతవరకూ పూనాలో చిత్రాలుతీస్తున్న దత్తా ధర్మాధికారి అక్కడ టెక్నికల్ సౌకర్యాలు బాగా లేనందున ఇకనుంచీ బొంబాయిలో చిత్రాలు తీయడానికి నిశ్చయించారు.

ఎ. వి. ఎమ్. వారు బహుశా మార్చినెల ఆఖరున ప్రారంభించబోయే చిత్రంలో నర్గీస్, దేవ్ ఆనంద్‌లు మొదటిసారిగా కలిసి నటించనున్నారు.

శశికళ
(ఈ వారం ముఖచిత్ర తార)

శశికళ ఈ మధ్య వెలువడిన "సమాజ్" చిత్రంలో చక్కగా నటించి పలువురి మెప్పుపొందినది అనుభవశాలియైన అశోక్ కుమార్ పక్కన నటిస్తూ రాణించడం సామాన్యం కాగు ఈమె మహారాష్ట్ర యువతి. ఆట్టే చదువుకోలేదు బాల్యం లోనే "ఎక్‌స్ట్రా"గా సినిమాల్లో అడుగు పెట్టింది కుటుంబపోషణ భారం ఆమెదే అయింది. "జీనత్" లోని ఖవాలీ సన్నివేశంలో ఆమె శ్యామాతో పాటు ఒక చిన్న పాత్ర ధరించింది (శ్యామ ఇప్పుడు నాయికపాత్రలకు బుక్ అవుతోంది) ఆ తరవాత ఆమె ఒక మంచి తెలివైనపని చేసింది ఒక ధనిక పంజాబీ వ్యాపారస్తుని ప్రేమించి, అతడు వివాహం చేసుకోకపోతే చనిపోతానని బెదిరించింది చివరి కతన్ని వివాహమాడింది వివాహానంతరం ఆమెకు పెద్దవేషాలులభించాయి ఈరోజున ఆమె ఒక అరడజను చిత్రాల్లో నాయిక వేషాలు వేస్తోంది సంతోషి తీస్తున్న "ఒక్క బజా రుపయా" పి. ఎన్ అరోరా తీస్తున్న "హజార్ - ఇ - అరబ్" మొదలైన చిత్రాల్లో ఆమె వున్నది శశికళకు మూడేళ్ళ కుమార్తె వున్నది సత్యజిత్ బిశ్వాస్, నిరూపారాయ్ ఆమె ముఖ్య స్నేహితురాండ్రు వీరితో కలిసి తరుచు ఎక్కడికైనా వెడుతూవుంటుంది


ఈమె మహారాష్ట్రమహిళ అయినా ఆమె ఇంతవరకూ ఏ మహారాష్ట్ర చిత్రంలోనూ నటించలేదు ★



కిశోర్ సాహూ చిత్రం "హామ్లెట్"లో నటించిన మాలాసిన్హా

వాల్ట్ డిస్నీ చిత్రం
"లివింగ్ డిజర్ట్"

వాల్ట్ డిస్నీ నిర్మించిన మొట్టమొదటి ఫుల్ లెంగ్త్ డాక్యుమెంటరీ చిత్రం "లివింగ్ డిజర్ట్" మద్రాసు ఓడియన్ థియేటర్‌లో ఫిబ్రవరి 25 వ తేదీని విడుదలయింది ప్రకృతిదృశ్యాలను యథాతథంగా టెక్నికలర్ సినిమాద్వారా చిత్రించే చిన్న చిన్న డాక్యుమెంటరీలను వాల్ట్ డిస్నీ ఇదివరలో నిర్మించారు "నేచర్స్ హాఫ్ ఏకర్" (*Nature's Half-Acre*), "బీవర్ వాలీ" (*Beaver Valley*), "సీల్ ఐలండ్" (*Seal Island*) మొదలైన షార్ట్‌లు ఇదివరలో ప్రదర్శించబడినాయి ఈ తరహా చిత్రాలకు బాక్సాఫీస్ విలువ అంతగా ఉండకపోయినా, చలనచిత్రాల ప్రయోజనం ఎంత ఉదాత్తమైనదో, మనం నిత్యం చూస్తూకూడా పరికింపుచేసుకోడానికి అంతగా అవకాశం లేని ప్రకృతిలో ఎంత సౌందర్యం ఇమిడివున్నదో, ఈప్రకృతిలో కళావేత్త చూడదగ్గ విషయాలని సినిమా కళద్వారా ఎంత చక్కగా క్రోడీ



సారథి చిత్రం "రోజులు మారాయి'లో నరసింహారావు, అమ్మాజీ, జానకి, హేమలత తదితరులు.

"లివింగ్ డిజర్ట్"

కరించి ప్రతిఫలింప చేయవచ్చునో ఇటు వంటి చిత్రాలవల్ల నిరూపించబడుతున్నది సినిమా పరిశ్రమకు ప్రభుత్వాల ప్రోత్సాహమూ సహాయమూ లభించాలంటే, ఇటు వంటి చిత్రాలకే అది అర్హమని తోస్తుంది.

ఉత్తర అమెరికా ఎడారిలో జీవన రాగాన్ని ప్రతిబింబింపచేసే ఈ చిత్రం ఎకాడెమీ ఎవార్డు గెలిచింది. ప్రాణికోటి మనుగడకు అధారం బొత్తిగా హీనమైన ఈ ఎడారిలోకూడా భయంకరపరిసరాలనూ, వేడిమినీ తట్టుకొని వివిధ క్రిమికీటకాలు, జంతువులు, పక్షులు ఎలా నివసిస్తున్నాయో వివరంగా చిత్రించబడింది వానివాని జీవన సంగ్రామాలు, ఆహారసంచయనం, స్వప్రాణ రక్షణకృషి, సామూహికజీవనం హృద్యంగా చిత్రించబడింది ఎడారి ఉడతల చెలగాటాలు, తాబేళ్ళ మల్లయుద్ధం, తేళ్ళ శృంగార నృత్యం, పాము పక్షుల పోరాటం, సాలెపురుగు కందిరీగల పోరాటం మొదలైన దృశ్యాలు ఈచిత్రంలో అనేకం ఉన్నాయి సినిమాకథకూ సినిమాజీవనసంగ్రామాన్ని చిత్రించిన ఇటువంటి చిత్రాలను దేశీయ భాషల కామెంటరీలతో విద్యార్థులందరికీ ప్రదర్శించే ఏర్పాట్లు చేయగలిగితే ఎంతో బాగుంటుందనిపిస్తుంది ★

చిత్రనిర్మాతలకు పెట్టుబడి సహాయం

ఎస్. కె. పాటిల్ ప్రకటన

భారతదేశంలో చలనచిత్ర నిర్మాణానికి ఆర్థికసహాయం చేయడానికి తాను, బొంబాయిలోని కొందరు ఫిలిం అధిపతులు కలిసి "ఫిలిం ఫైనాన్సింగు కార్పొరేషను" త్వరలో స్థాపించనున్నట్లు బొంబాయి ప్రదేశ కాంగ్రెసు అధినేత, ఫిలిం విచారణ సంఘం అధ్యక్షులు శ్రీ యస్. కె పాటిల్ ఫిబ్రవరి 18 న విజయవాడలో ఆంధ్ర ఫిలిం వాణిజ్యమండలివారి సన్మానానికి సమాధానంగా చెప్పారు.

ఇలాంటి కార్పొరేషను స్థాపించవలసిందిగా ఫిల్ము విచారణ సంఘం నాగు ప్రభుత్వానికి సూచించి మూడు సంవత్సరాలైనా ఇంతవరకు ఎట్టి చర్య తీసుకోబడలేదని, ప్రభుత్వం చర్య తీసుకొనేవరకు

వుండటం తనకు యిష్టంలేక ఇందుకు పూనుకున్నామని వారు అన్నారు.

ఫిలిం విచారణ సంఘంవారు ఎన్నో ముఖ్యమైన సూచనలు చేశారని అయితే మూడు సంవత్సరాలైనా ప్రభుత్వం ఇంతవరకు వీటిని అమలుజరప బూనుకోలేదని వారు విమర్శించారు ఈ సూచనలు చేయడంలో మేము ఒక్క ఫిలిం పరిశ్రమనే దృష్టిలో పెట్టుకొనలేదు, పసితనంలోవున్న మన ప్రభుత్వం ఎదుర్కొనవలసిన వివిధ సమస్యలను గుర్తుంచుకొని ఫిలిం పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చేయదగినవి, చేయగలిగిన సూచనలు మాత్రం చేశాము" అని శ్రీ పాటిల్ చెప్పారు

"ఈ సూచనలు అమలుజరపాలంటే, ఇప్పుడు నాకు తోస్తున్నదానినిబట్టి, ఈ శాఖ మంత్రికి కొంచెం ధైర్యం, ఆలోచన ముందు చూపు అవసరం అన్నింటిని మించి కేంద్ర మంత్రిమండలిలోని తోటి సభ్యులను ఒప్పించి తమ మాటను నెగ్గించుకోగల శక్తిసామర్థ్యాలు గూడ వుండాలి" అని వారు అన్నారు

ఫిలిం సెన్సారు బోర్డులో "తమ జీవితకాలంలో సినిమా చూచివుండని పెద్దలు కొందరున్నారు. ఫిలిం పరిశ్రమ అంటే ఏమిటో, ఫిలిం అంటే ఏమిటో గూడ వారికి తెలియదు అటువంటివారికి ఫిలింల మంచి చెడ్డలను నిర్ణయించే అధికారం యివ్వడంలో అర్థంలేదు. ఈ సంఘంలో నియమించబడే వ్యక్తులకు కొన్ని కనీస యోగ్యతలు నిర్ణయించబడాలి. విధిగా తరచు సినిమాలు చూచే వ్యక్తులు వుండటం చాల అవసరం" అని శ్రీ పాటిల్ అన్నారు

అదీగాక ఈ సభ్యులను తరచు మార్పు చేస్తుంటారు. ఏ మంత్రిగారో తనవారికి మేలు చేయాలనుకుని ఈ సభ్యులను మార్చటం సంభవిస్తున్నది. ఇది చాల అన్యాయం అని వారు విమర్శించారు

మనదేశంలో ఫిల్ముల నిర్మాణానికి కావలసిన ప్రజ్ఞావిశేషాలు గల యువకులు ఎందరో వున్నారు అయితే వారిలో 5% గూడ ఈనాడు వినియోగింపబడుతున్నట్లు లేదు. మనకు వున్న అవకాశాలను వినియోగించుకొని ఉత్తమ చిత్రాలను నిర్మించి ప్రపంచదేశాలకు వాటిని పంపించుటకు కృషి చేయాలి. అని పాటిల్ అన్నారు.

'ఫిల్ముల ముఖ్యోద్దేశ్యం ప్రజలను ఆనందపరచుటే తర్వాత నే విద్యావిషయాలకు ప్రాముఖ్యం. అంతేగాని అసలు ఫిల్ములు విద్యావిషయాలకే ఎక్కువ ప్రాధాన్యం యివ్వాలనడంలో అర్థంలేదు' అని పాటిల్ అన్నారు.

సాలుకు రు 9 కోట్లు పన్నులు చెల్లించే ఈ ఫిలిం' పరిశ్రమను ప్రభుత్వం సరిగా చూడాలని చెపుతూ పన్నులు అధికంగా పెంచితే సినిమాలకు వెళ్ళేవారి సంఖ్య తగ్గుతుంది కనుక పన్నులు తగ్గించి ఎక్కువ మందిని సినిమాలకు ఆకర్షించి హెచ్చు రాబడిని సంపాదించే మార్గం మంచిదని అన్నారు

వాణిజ్యమండలి ఉపాధ్యక్షులు శ్రీ టి అశ్వత్థ నారాయణగారు అధ్యక్షత వహించారు

కార్యదర్శి శ్రీ అయ్యంగారు సన్మాన పత్రం సమర్పిస్తూ ఈనాడు ఫిలిం పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను విపులీకరించారు

శ్రీ మల్లాది ఫణిభూషణరావుగారు మాట్లాడుతూ వార్తాచిత్రాల విషయంలో ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరిని విమర్శించారు

శ్రీ డి కృష్ణమూర్తిగారు వందనములు సమర్పించారు. (స్వ. వి)

కీ॥ శే॥ బళ్లారి రాఘవా చారి వర్ధంతి

మద్రాసు న్యాయ కళాశాల ఆంధ్ర విద్యార్థుల సంఘంవారు ఫిబ్రవరి 18 వ తేదీన ఎగ్మూరు మ్యూజియం థియేటరులో కీ॥ శే॥ కళాప్రపూర్ణ బళ్ళారి రాఘవాచార్యులుగారి వర్ధంతి జరిపారు. ఈ సందర్భంలో విద్యార్థులు "ఆత్మవంచన" అనే నాటకం ప్రదర్శించారు. ప్రదర్శనానికి ఫిలిం డైరెక్టరు బి ఎన్ రెడ్డిగారు అధ్యక్షత వహించారు

ప్రసిద్ధ నటులు వి నాగయ్యగారు కళాప్రపూర్ణుని గూర్చి మాట్లాడుతూ, ఈ స్మారకదినోత్సవాన్ని విద్యార్థులింత శ్రద్ధాభక్తులతో జరపడం తమ కానందదాయకంగా ఉందన్నారు ఆయన నాటకకళను ఉన్నత శిఖరాలకు లేవనెత్తిన మహా మహుడనీ, ఆయన పేరు తలచుకుంటే వెనుకటి రోజులు జ్ఞాపకంవచ్చి దుఃఖం కలుగుతోందనీ నాగయ్యగారన్నారు "రామదాసు" నాటకంలో బళ్లారి రాఘవుని పక్కన తాము కబీరు పాత్ర ధరించేవారమని ఆయన చెప్పారు

అధ్యక్షుడు బి ఎన్ రెడ్డిగారు ఉపన్యసిస్తూ, ఆంధ్ర నాటకరంగాన్ని పునరుజ్జీవింపజేసి ఇతర దేశాల్లోకూడా కీర్తి గడించిన మహా నటుడు బళ్ళారి రాఘవాచార్యులుగారి పేరుమీదుగా ఆంధ్రలో ఒక్క నాటకమందిరమైనా లేకపోవడం శోచనీయమన్నారు సరియైన నాటక మందిరాలు లేనిదే నాటక కళ అభివృద్ధికాదనీ, మందిరాల కొరతవల్ల ఉత్సాహవంతులైన ఎందరో యువకులు నటనా కౌశలం కలిగినవారైనా ముందుకు రాలేకపోతున్నారనీ, క్రమంగా నాటకకళ అంతరించిపోతుందా అనే భయంకూడా కలుగుతోందనీ, ఈ విషయమై ధనవంతులు, కళాభిమానులు ఏదైనా కృషి చేయాలనీ ఆయన అన్నారు

బుచ్చిబాబుగారు రచించిన "ఆత్మవంచన" నాటకంలో కౌశిక్, ఎస్. సత్యనారాయణరాజు, వేమూరి రామయ్య, కె. ఎస్. క. గౌరీనాథశాస్త్రి, జి. వి. సంజీవి, క భానుప్రసాద్, రమాదేవి, ఎన్ మల్లిక్కా కృష్ణ, పార్వతి, రామం పాల్గొన్నారు వీరి నటన ప్రేక్షకుల ప్రశంసపొందింది. విద్యార్థి సంఘ లలితకళా కార్యదర్శి ఎమ్ బి బి. ఎస్ ఆర్. శర్మగారివందనములతో ప్రదర్శనముగిసింది.

చలనచిత్రగోష్ఠికి శుభాకాంక్షలు


ఫిబ్రవరి 27 నుండి వారం రోజులపాటు ఢిల్లీలో జరుగనున్న చలనచిత్రగోష్ఠి ముందుముందు ఫిలిం డైరెక్టర్లను, నటులను, టెక్నిషియన్లను తర్ఫీదుచేసే ఫిలిం ఎకాడమీల, విద్యాలయాల స్థాపనకు దారి తీయగలదనే ఆశాభావాన్ని పలువురు ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లు, తారలు తమ తమ సందేశాలలో వెల్లడించారు ఈ గోష్ఠిని ప్రధాని నెహ్రూ ప్రారంభిస్తారు

వినోద చిత్రాల విషయంలో ప్రజలపట్ల చిత్ర నిర్మాతలకున్న బాధ్యత ఏమిటి? అందమైన దుస్తులకు చిత్రాలలోగల కళాప్రయోజనం ఏమిటి? భారత సాంస్కృతిక, సాంఘిక జీవితానికి సినిమా వటి చేసే దోహదం ఏమిటి? భారతీయ శాస్త్రీయ సంగీతానికి, ఫిలిం సంగీతానికి చిత్రాలలోగల స్థానం ఏమిటి? చిత్రానికి మంచి కథ యొక్క అవసరం ఎంతవరకూ వున్నది? ఫిలిం నిర్మాణ సామగ్రిని ఇండియాలో తయారుచేయడానికిగల సాధక బాధకాలు ఏమిటి? వార్తాచిత్రాల భవిష్యత్తు ఏమిటి? ఈ సమస్యలన్నిటిపైనా ఫిలిం ప్రముఖులు ఉపన్యాసపత్రాలు చదువుతారు.

బిమల్ రాయ్, రాజ్ కపూర్, కిశోర్ సాహూ మున్నగువారు సంగీత నాటక అకాడమీ వారికి ఈ గోష్ఠి విజయం పొందాలని శుభాకాంక్షలు పంపారు

ఎ వి. ఎమ్. వారి కొత్త హిందీ చిత్రాలు

"లడ్కీ" హిందీచిత్రంతో అర్థికవిజయం పొందిన మద్రాసు నిర్మాతలు ఎ వి ఎమ్. వారు తమ మూడవ హిందీ చిత్రంగా "భాయ్ భాయ్" అనే చిత్రం నిర్మి



బి. ఎన్. రెడ్డిగారి దర్శకత్వాన తయారైన వాహినీవారి "బంగారు పాప"లో రామశర్మ, జగ్గయ్య, రంగారావు, కృష్ణకుమారి మున్నగువారు పాల్గొన్న ఒక సన్నివేశం.

స్తున్నారు. ఎమ్. వి. రామన్ డైరక్టు చేస్తున్న ఈ చిత్రంలో అశోక్ కుమార్, కిశోర్ కుమార్, సవిత్రి, నిరూపారాయ్, [illegible], ఓంప్రకాష్ మొదలైన అగ్రశ్రేణితారలు నటిస్తారు. పాటలు, మాటలు రాజేంద్రకృష్ణ వ్రాస్తారు. సంగీతం మదనమోహన్.

"శివభక్త" అనే మరొక హిందీ పౌరాణిక చిత్రంకూడా ఎ. వి. ఎమ్. వారు నిర్మిస్తున్నారు. పని చురుకుగా జరుగుతోంది. ఇటీవల బొంబాయి తారలు మిశ్రా, అనంత్ కుమార్, సాహూమోదక్‌లతో షూటింగ్ జరిగింది. తిరువాన్కూర్ సోదరీత్రయానికి చెందిన పద్మిని, 'బహార్'లో నటించిన మరొక పద్మిని, కుమారీదేవికూడా ఈ చిత్రంలో నటిస్తున్నారు. మాటలు మోహన్‌లాల్ బాజ్‌పాయ్, పాటలు నేపాలి వ్రాశారు. సంగీతం చిత్రగుప్త. ఈ చిత్రం కథ రచించిన హెచ్. ఎల్. ఎన్. సిన్హాగారే డైరక్టు చేస్తున్నారు. ఈ చిత్రం [illegible] విడుదల కాగలదు.

భారతదేశంలో టెక్నికలర్ లాబొరేటరీ

భారతీయ ఫిలిం పారిశ్రామికుల సహకారంతో బ్రిటిష్ టెక్నికలర్ కంపెనీ వారు భారతదేశంలో టెక్నికలర్ ప్రాసెసింగ్ లాబొరేటరీ త్వరలో స్థాపించనున్నారని ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టరు కే హారిసన్ ఇటీవల మద్రాసులో ప్రకటించారు. భారత ఫిలిం పరిశ్రమకు టెక్నికలర్ అవసరాలు ఏమాత్రం ఉన్నదీ పరిశీలించేందుకు కొలరోజులపాటు దేశంలో పర్యటిస్తున్న హారిసన్‌గారు "ఈ దేశంలో టెక్నికలర్ నిర్మాణానికి చాలా మంచి అవకాశాలున్నాయి" అన్నారు.

"మంచి చిత్రాలను తక్కువ ఖర్చుతో తీయడానికి భారతీయ నిర్మాతలకు టెక్నికలర్ సహాయం అవసరం. టెక్నికలర్ చిత్రాలు తీసి ఇతరదేశాల చిత్రాలతో పోటీ చేయడానికి [illegible] భారతీయ [illegible] టెక్నికలర్ [illegible] సిద్ధంగా ఉన్నాము," అని [illegible]న్నారు.


పరిస్థితులు అనుకూలిస్తే భారతదేశంలో [illegible] సంపూర్ణ [illegible] అన్నారు.

* * *

భారత ప్రభుత్వ ఫిలింస్ డివిజను [illegible] ఆదివారం శ్రీ [illegible] వార్తాచిత్రాలను ప్రత్యేక ప్రదర్శనలుగా [illegible] ప్రదర్శించారు. "భావిపౌరులు", చేనేతపరిశ్రమ, పవిత్రగంగానది, [illegible] కొచ్చిన్ రాష్ట్రం, రోడ్డు ప్రమాదాలు, కేడెట్లు, అవశేష కాంగ్రెసు, బొంబాయిలో రిపబ్లిక్ దినోత్సవం, ఢిల్లీలో పాకిస్తాన్ గవర్నరు జనరలు [illegible] చిత్రాలు ప్రదర్శింపబడినవి.

ఫిలింసు డివిజను విభాగానికి ప్రాంతీయ మేనేజరు శ్రీ కె. డి. [illegible]గారు ఆహూతులకు స్వాగతం చెప్పారు. ★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras



జలపద్మ

ఫొటో: వి పుల్లేశ్వర్—విజయవాడ.